
అభిసారిక
. ABHISARIKA .
AUGUST
. 1949 .
As. 8.



సతి - పతి

## ఈ సంచికలో

హావలాక్ ఎల్లిస్, చౌడేశ్వరీదేవి, బొకాషియో, గిరీంద్రశేఖర్ బోస్, మేరీస్టూప్స్, 'శివం', మోహన్‌బాబు, డా. బెంజిమన్ స్పోక్, దాసరి సుబ్రహ్మణ్యం మొదలైనవారి రచనలూ సందేహాలకు సమాధానాలూ మొదలైన వైజ్ఞానిక విషయాలూ, రసవత్తరమైన కథలూ అవీ ఇవీ ఇంకా ఎన్నో!!


శరత్ చంద్రుని

# శ్రీకాంత



శ్రీకాంత—శరత్ బాబు రచన
లోకంలోని అనేక భాషల్లోకి
అనువదించబడ్డ నవల.

మూలంలోని నాలుగు భాగాలూ
ఒకే పుస్తక రూపాన—
అందమైన ముద్రణతో—
చక్కని లింప్ బౌండుతో—

పదిరూపాయలు.

## సవిత : శరత్ నవల

360 పేజీలు మూడు రూపాయలు.

ఒక కాపీ శ్రీకాంత కొన్నవారికి సవిత ఒక కాపీ ఉచితంగా అన్నిఖర్చులూ భరించి పంపుతాం.

శరత్ ఇతర రచనలూ, యువ ప్రచురణలూ, ధనికొండ, చక్రపాణి, చలం, కుటుంబరావు మొదలైనవారి రచనలూ మావద్ద దొరుకుతవి. పుస్తకవిక్రేతలకూ, లైబ్రరీలకు మంచి కమీషన్.

నేడే మా పెద్ద క్యాటలాగుకు రాయండి.

**శేషు అండ్ కో., తెనాలి**

ప్రతి యువతీ, యువకుడూ చదువవలసిన పుస్తకం

హావలాక్ ఎల్లీస్ రచన ★ 'క్రాంతినాథ్' అనువాదం

# " సిగ్గు "

మనం ఎందుకు సిగ్గుపడాలి? సిగ్గువల్ల కలిగే మంచిచెడ్డలేమిటి? శారీరకంగానూ, మానసికంగానూ కలిగే పరిణామా లేమిటి? నాగరికతకూ, సిగ్గుకూ సంబంధం వుందా? స్త్రీలు ఎక్కువ సిగ్గును ఎందుకు కనబరచాలి?

యింకా యిలాటి లక్ష ప్రశ్నలకు జవాబులు యీ పుస్తకంలో వున్నవి. నేడే మీ ప్రతికై త్వరపడండి.

**విడి ప్రతి ఒక రూపాయి మాత్రమే!**

**'అభిసారిక'** ఏజెంట్లదగ్గర దొరుకుతవి. లేదా నేడే ఆర్డరుచేయండి.

★

'అభిసారిక' కార్యాలయం, తెనాలి

# సమీక్ష

[ సారస్వత, వైజ్ఞానిక మాసపత్రిక

ఆగస్టు సంచిక కోపర్నికస్ ముఖచిత్రంతో వెలువడుతున్నది.

చలం రచనలపై విమర్శ, అంతర్జాతీయ పరిస్థితుల సింహావలోకనం, రెండు సంవత్సరాల జాతీయ పరిపాలన సమీక్ష, కథలు, విమర్శలు, విజ్ఞాన విశేషాలవిూద వ్యాసాలు మొదలయినవాటితో ఎంతో ఆకర్షణీయంగా తయారౌతుంది.

ఏజెంట్లు త్వరపడాలి వెల **0-8-0**

'సమీక్ష' కార్యాలయం,

మారీసుపేట, తెనాలి.

స్త్రీ పురుషుల

# సెక్సు

సమస్యలకు, లోటుపాట్లకు

చెప్పుకోడానికి సిగ్గుపడే

**లోపాలకు**

దురభ్యాస ఫలితముల

**బాగుకు**

సంప్రదించండి.

'మెడికో' మచిలీపట్నం

జ్ఞాపకం ఉంచుకోండి

☞ సెప్టెంబర్ **15**-వ తారీకు

# అభిసారిక

## మొదటి సప్లిమెంట్ సంచిక

**వెలువడుతుంది**

★

ఆకర్షణీయమైన ముఖచిత్రం 32 పేజీలు.

**వెల 4 అణాలే!**

★

పతితుల ప్రశ్నలెన్నిటికో సచిత్రంగా జవాబులు. ఎందరి అనుభవాలో ఇందులో ఇమడ్చబడినవి.

★

నేడే మీ ప్రతికై ఆర్డరు చేయండి. విడికాపీకి 4 అణాల స్టాంపులు పంపుతేచాలు. ఏజెంట్లు ఇప్పుడే తమకు కావలసిన కాపీలకు ఆర్డరు చేస్తూ పైకం పంపాలి.

చందాదార్లకు యీ సప్లిమెంట్ ఉచితం

సంవత్సర చందా రూ **5-8-0**

6 నెలలకు ,, రూ **3-0-0**

లేనిచోట్ల వెంటనే డిపాజిట్ కట్టగల సమర్థులైన ఏజెంట్లు కావాలి!

★

వివరాలకు ; అభిసారిక కార్యాలయం, తెనాలి.




సంపుటి 1 | ఆగష్టు 1949 | సంచిక 2

మొదటి సంచికను అభినందిస్తూ వొచ్చిన ఉత్తరాలకు కృతజ్ఞత తెలపలేకుండా ఉండలేం. ప్రతిచోటా కాపీలు కావాలని, కోరుతూ ఏజంట్లు రాసిన లేఖలనుపట్టి పాఠకలోకం ఇచ్చిన స్వాగతాన్ని గ్రహించగలిగాం. కాపీలు అందజెయ్యలేని పాఠకులు మన్నిస్తారుగాక! మీకు ఖచ్చితంగా కాపీ అందితీరాలంటే చందాకట్టటం తప్ప ఇంకో ఉపాయంలేదు.

కొంతమంది పాఠకులు పత్రిక చాలా శాస్త్రీయంగా ఉన్నదనీ రచనలు పెద్దవైనవనీ రాశారు. శాస్త్రీయ దృక్పథాన్ని మేము మార్చలేము. మొదట్లో కాస్తవిసుగ్గావున్నా అదే విజ్ఞానమైనప్పుడు కొంత ఓపికను పాఠకులు చూపాల్సివుంటుంది. పోతే వ్యాసాలకు ఎక్కువస్థలం ఇవ్వకపోతే అవి త్వరలో అవవు. ఐనప్పటికీ మరికొంత తగ్గిస్తాము. మరికొంతమంది పాఠితలు స్త్రీలకోసం ప్రత్యేక వ్యాసాలేమన్నా వేయమని కోరారు. లైంగిక విజ్ఞానాన్ని స్త్రీ పురుషులు






సమానంగానే నేర్చుకోవాల్సివుంటుంది, ఐతే చాలా సందర్భాల్లో స్త్రీ యెక్కువ విజ్ఞానాన్ని సంపాయించాల్సిన అవసరంవుంది.

మరీ యీ దేశంలో ఏ 12-వ ఏటనో ఆడపిల్ల పెద్దమనిషి కావటం, వెంటనే ఆమెకు కార్యంచేయటం—ఏడాది తిరక్కముందే బిడ్డతల్లికావటం—దానివల్ల తల్లి జీవితం దుర్భరంగానూ, వెగటుగానూ మారటం, బిడ్డజీవితం సుఖవంతం కాకపోవటం జరుగుతూవుంది. ఇంట్లో ముసలమ్మల సలహాలు అశాస్త్రీయ పద్ధతులూ ఆచరించదగ్గవనే గుడ్డినమ్మకంకూడా ఒక విధంగా ప్రమాదమే! యీ బిడ్డల శిక్షణను గూర్చిన వ్యాసాలు యీ సంచికనుంచీ వేస్తున్నాము. ఇవి సాంఘికంగా ఉపయోగకారి కాగలవని మా నమ్మకం.

పేజీలు పెంచమనే సలహాలను ప్రస్తుతం ఆచరించలేము. సందేహాలకు – సమాధానాల శీర్షికకు యీ సంచికలో ఎక్కువ పేజీలు వొదిలాము. ఐనప్పటికీ ఇంకాచాలా ప్రశ్నలుమిగిలిపోయినవి. వీటి కోసమై ప్రతి 3- మాసాలకూ ఒక సప్లిమెంటును చౌకధరకు ఇవ్వదలిచాం. వీటిలో మొదటిది సెప్టెంబర్ 15-న వెలువడుతుంది. యీసంచికలోనే వేరొకచోట విశదంగా వేశాము.

కథలకు పెద్దబొమ్మలు గీయించమని మరికొంతమందిసలహాలు. బొమ్మలువేసినంత మాత్రాన కథ బాగుంటుందనుకోవటంలో నిజంలేదు. అదీకాక మేము బొమ్మలిచ్చి పాఠకుని తృప్తిపరచటంకన్నా— నేర్చుకోదగ్గ విషయాల్నిచ్చి తృప్తిపరిచేందుకే ప్రయత్నిస్తాం. ప్రస్తుతం వెలువడే బొమ్మలకన్న ఎక్కువ బొమ్మలిస్తామనే ఆశ మీకెవరికీ అక్కర్లేదు. విషయదారిద్ర్యం రానంతవరకూ దీన్ని కోరటంలోనూ, అనుసరించటంలోనూ అర్థంలేదేమో ?




బహిష్ఠయిన స్త్రీని సంఘం దూరంగా వుంచటానికి ప్రయత్నిస్తుందని తెలుసుకున్నాం. యిది లోకమంతటా ఎలా సాంఘికాచారంగా అమలు జరుపబడుతూ వున్నదీ యీ కింద వివరించబడింది :

యీ ప్రశ్నను మనస్తత్వవేత్తకన్న చరిత్రకారుడు, నాగరికతా పరిశోధకుడూ ఎక్కువగా తరచవలసిన అవసరంవుంది. అనేక విషయాల కలగా పులగం ఈప్రశ్నకు అడ్డురావటంవల్ల నిర్ధారణగా ఏదీ చెప్పేందుకు వీల్లేకుండా వుంది. అందుకని యీ ప్రశ్నను అసలే వొదిలేసేందుకు వీల్లేదు. స్త్రీ పురుషుల లైంగిక జీవనమూ, వారి మనస్తత్వ పరిణామాలను ఆధారంగా తీసుకొని దీనికి జవాబు వెతికేందుకు ప్రయత్నిద్దాం !

సురినామ్‌లోని నీగ్రోల్లో స్త్రీ బహిష్ఠు సమయంలో ఒంటరిగా వుంటుంది. యింకో స్త్రీ కానీ, పురుషుడు కానీ ఆ సమయంలో ఆమె దగ్గరికి వెళ్ళటం చాలా అపాయకరమైనదిగా భావించబడుతుంది. ఒకవేళ ఎవరైనా తన దాపులోకి వొస్తున్నారని ఆమె భావించి నట్టయితే ''నేను మైలబడ్డాను! నేను మైలపడ్డాను'' అని అరిచి ఆమె వారిని హెచ్చరిస్తుంది.

లోకంలో యిలాటి అలవాట్లూ, ఆచారాలూ ఎన్నో దేశాల్లో, ఎన్నో జాతుల్లో వున్నవి. కాని బహిష్ఠయిన స్త్రీ తన తోటి స్త్రీలకు ఎందులోనూ, ఏవిధంగానూ తీసిపోదు. అసంపూర్ణ నాగరికతను ఆరాధించే మానవుడి ఊహల్నీ నమ్మకాల్నే కాని, అతను మానవాతీతమైన యితర శక్తులమీది అభిప్రాయాల్ని కూడా మనం చూడవలసివుంది.

యూరప్ ఖండంలో విశేష ప్రచారంలోవున్న జానపద గీతాల్లోనూ, కథల్లోనూ స్త్రీని సర్పంతో పోల్చటం అతిసామాన్య విషయం. ఇది క్రైస్తవ వేదాంత సారాంశమేనని నమ్మకంగా చెప్పవొచ్చు. రాబర్ట్‌సన్ స్మిత్ చెప్పినట్టు మానవుడు





ఎదుర్కొని నిర్మూలించవలసిన అపాయకరమైన జంతుజాలంలో పాములు చివరివి. అందుకనే వాటిని దెయ్యాలు, భూతాలు, రాక్షసుల జాతిలో కలిపారు. అరేబియన్‌ల 'జిన్' లేక రాక్షసుడి తరగతిలో యీపాముకూడా కలుస్తుంది. 'యీడెన్' వనంలో 'పాము' సైతాన్ రూపాంతరంగా కాక, ఒకప్రత్యేక రాక్షసజాతిగా పరిగణించబడింది. స్త్రీలు పురాతన మత నమ్మకాల్ని అనుచరించి విపరీతమైన రాక్షస శక్తిని కలిగిన వారనే నమ్మకం ఉండటంవల్ల, యీపాములతో పాటే వార్ని కూడా ఒకేతరగతిలోకి నెట్టి వుంటారు.

ఇది కారణంగానే లోకంలోని అనేకజాతుల్లో కామానికి గుర్తుగా, చిహ్నంగా పాము ఎన్నుకో బడ్డది. వీనస్ అనే కామదేవత చేతి కర్రమీద కర్రను చుట్టుకొని పాము ఉండి కర్రపైన పడగ విప్పినట్టు వుంటుంది. ఒక్కపామే కాక బల్లి, మొసలి కూడా ఆజాతికే చెందినవిగా భావించబడినవి. హిందువుల కామదేవుడు మన్మధుడు. అతని పతాకంమీద మొసలి వుంటుంది. అందుకనే అతన్ని 'మకరధ్వజుడు' అన్నారు. అంతేగాక ఆయుర్వేదంలో 'మకరధ్వజం' అనేమందు పురుషుని మర్మాంగ లేపనకు పనికి వొచ్చేదిగా వివరించబడింది. మొసలి వీర్యంతో తయారుకాబడిన ఒకానొక ఔషధరాజం పుంసత్వాన్ని విపరీతంగా ఇవ్వగలుగుతుందని వాత్స్యాయనుడు చెప్పాడు. ఇక బల్లి పతనంలోనూ, దాని ఫలితాల్లోనూ అది వామ భుజంమీదపడితే స్త్రీ సంభోగం అని వివరించారు. బల్లికి యీ విధమైన లైంగిక ప్రాముఖ్యత ఇవ్వబడ్డది.

దక్షిణ ఆస్ట్రేలియాలో స్త్రీ నుంచి పురుషుణ్ని విడదీసింది—సాలీడేననే ఒక పురాణగాథ వుంది. ఉత్తరఆస్ట్రేలియాలో ఇంకో పిచ్చినమ్మకం వుంది. పందికొక్కు స్త్రీ రహస్యాంగాన్ని గీరటంవల్ల రక్తస్రావం సంభవిస్తుందనీ, అదే బహిష్ఠు అనీ నమ్మేవారు. విక్టోరియాలోని గ్లెనల్గ్‌లో కన్యయొక్క రహస్యాంగం సంభోగానికి తగినంత పెద్దదిగా లేనప్పుడు పాముతల దూర్చబడే ఆచారం వుండేది. బొలీషియాలోని చిరుగ్వనాస్ జాతి స్త్రీ బహిష్టవగానే ముసలి వాళ్ళందరూ కర్రలు తీసుకొని ఆపామును వేటాడేందుకు నలుమూలలకూ వెళ్ళేవారు. పాము హాని చేయటంవల్లనే స్త్రీ బహిష్ఠయేదని వారినమ్మకం !

గ్రీస్‌లో విశేష ప్రచారంలోవున్న జానపద గీతాల్లో – వయసువచ్చిన రాకుమారి సూర్యరశ్మి తగలకుండా వుండాలనీ, అలాతగిలినట్టయితే ఆమె బల్లిగానో, ఊసరివెల్లిగానో మారుతుందనీ చెప్పబడ్డది. సూర్యరశ్మిని ఎరుగని కన్య అతికోమలంగా వుండేదనే విషయం మన పురాణాలుకూడా రుజూచేస్తున్నవి. యింకా అనేక యితర పూర్వజాతుల్లో పాముకాటువలన బహిష్ఠు వస్తుందనే నమ్మకం వుండేది.

మెక్సికోలో 'బల్లి' కామానికి చిహ్నం. బ్రెజిల్‌లో ఆడపిల్ల యీడుకు రాగానే ఒంటరిగా అడవుల్లోకి వెళ్ళకూడదనీ, అట్లావెళ్లి నట్టయితే పాములు కరు

స్తవనే భయం వుండేదనీ నమ్మేవారు. దక్షిణ ఆఫ్రికాలోని బసుటాస్ జాతిలో యువతులందరూ మట్టితో చేయబడ్డ పెద్దపాముచుట్టూ నాట్యాలు చేసే ఆచారంవుంది.

పోలినేషియాలోని పురాణగాథల్లో బల్లి అతిపవిత్రమైన జంతువుగా చెప్ప బడింది. అప్పటిస్త్రీలు చాలాసార్లు బల్లుల్ని కనేవారట! బెంగాల్ లో స్త్రీకి కలలో పాము కనిపించి నట్టయితే ఆమె శిశువును కంటుందనే నమ్మకం వుంది.

బెర్లిన్ మ్యూజియమ్‌లో మూడు బొమ్మలున్నవి. వాటి వివరం——

(1) నగ్నంగా వున్న స్త్రీ రహస్యాంగంలోకి మొసలి తనముట్టెను దూర్చు తూన్నది.

(2) పామల్లేవున్న మొసలి స్త్రీ రహస్యాంగంనుంచిపాకి బైట పడుతూన్నది.

(3) పురుషుని రహస్యాంగాన్ని పోలినట్టువున్న పాము స్త్రీ రహస్యాంగ ముఖద్వారం గుండా లోనికి పోతూన్నది.

యిలాటి అభిప్రాయాల్తో రాయబడ్డ చిత్రాలు యూరప్‌నిండా వున్నవి. బహిష్టు సమయంలో బల్లి స్త్రీని కరుస్తుందనే భయం వుండటంవల్ల పోర్చుగల్ లోని స్త్రీలు డ్రాయర్లు ధరించే ఆచారంవుంది. 18-వ శతాబ్దంవరకూ, బహిష్ఠయిన స్త్రీ తాలూకు వెంట్రుకల్ని తాకినట్టయితే అందులోనుంచి పాము పుడుతుందని నమ్మే వారు. యీ విధంగా లోకంలోని అనేక ప్రాంతాల్లో పాము మీద వివిదాభి ప్రాయాలున్నవి.

ఎంతోమంది కన్యలు భగవదర్పితలవటంకద్దు. యిందులో సర్పరూపంలో వున్న భగవంతునికి అర్పితమయేవారు అధికం. సర్పాన్ని అనేక రూపాల్లో పూజించ టంకూడా కొత్త విషయంకాదు. హిందువులకు సుబ్రహ్మణ్యేశ్వరుడు సర్పదైవం. పిల్లలు లేనివారు పాముపుట్టకు ప్రదిక్షిణంచేసే ఆచారంకూడా లేకపోలేదు. ఈశ్వ రుని మెడలోని పాములు ఆయన పురుషత్వానికి చిహ్నాలనికూడా చాలామంది అభి ప్రాయం. రోమ్‌లో 'పాము' గర్భానికి చిహ్నంగా భావించబడుతోంది. కుటుంబ విస్తరణలో పాముకు ఒకవిధమైన ప్రాధాన్యత ఏర్పడింది. రాబ్‌బినికాల్ పురాణాల్లో కూడా పాము కామవాంఛకు చిహ్నంగా భావించ బడుతోంది.

లోకంలోని అనేక భాగాల్లో పామువల్లనే స్త్రీకి 'ఋతువు' ఏర్పడుతూవుం దనే అభిప్రాయం ధృఢంగావుండేదనే విషయంలో అనుమానమేమీ అక్కర్లేదు. జర్మన్ పశ్చిమఆఫ్రికాలోని సాంకేతికభాషలో పురుషుని రహస్యాంగానికి పామును పిలిచే పేరునే ఆడవాళ్లు వుపయోగిస్తారు. పాముకూ కామానికీ గొప్ప సంబంధం వుండేదనే విషయాన్ని ఎన్నో విధానాల్లో రుజూచేయవచ్చు.

ఋతువునుగూర్చిన అభిప్రాయాల్లో ఏదో అర్థంకాని రహస్యం, కామాన్ని రెచ్చగొట్టేది ఇమిడివుందని పూర్వం నమ్మేవారు. పామల్లే విషాన్ని కక్కటంలోనూ,





పామల్లే పురుషుని రహస్యాంగనిర్మాణం వుండటంవల్లనూ యీ నిగూడాభిప్రాయం ఏర్పడి వుండొచ్చు.

యీ విధమైన ప్రాథమిక మానవుని అభిప్రాయాల్లో బహిష్టు ఒక అసామాన్య మైనదిగానూ, పామల్లే భయంకరమూ, విషపూరిత మైనదిగానూ, భావించబడేది. లోకంలోని అన్ని మానవ సంఘాల్లోనూ బహిష్ఠయిన స్త్రీని భూతాలు ఆవేశించిన దానివలె, ఏవో మానవాతీతమైన శక్తులున్నదానివలె చూచే ఆచారం ఏర్పడివుంది. అమాయకత్వంవల్ల, నిరంకుశపాలకుల ఆజ్ఞానుసారంగా, మూఢమతాభిప్రాయాలవల్ల మానవుడు తరతరాలుగా ఇలాటి నమ్మకంలోనే పెరుగుతూ వొచ్చాడు. బహిష్ఠయిన స్త్రీని అపవిత్రురాలుగా చూసేవారు. యీ మానవాతీతమైన శక్తుల్లో మంచివాటికీ, చెడ్డవాటికీ గల భేదాన్ని గుర్తించలేని ప్రాథమిక మానవుడు వాటి జోలికిపోయి ఆలోచించటమంటేనే భయపడేవాడు.

యీ 'అపవిత్రత'కు ఒక ప్రాధాన్యతవుంది. అపరిశుభ్రమైన ఇతరభౌతిక వస్తువు లకు వుపయోగపడే పదం మాత్రమే కాదిది. ముట్టరానిది (ముట్టుపటం అంటే ఇదే అర్థమేమో?) తాకరానిది, దరిజేరరానిది, నిషేధించ బడ్డది, సంఘనిబంధన ప్రకారం దరిజేరరానిది అనే అర్థంలో యీపదం వుపయోగించ బడింది. 'పవిత్రమైనది' అనే దానికి సరిగ్గా విరుద్ధమైన అర్థాన్నిచ్చే పదంగా చెప్పవొచ్చు. ఐతే అతి పవిత్రమైన వస్తువులు మానవుడు ఏవిధంగా తాకేందుకు అనర్హుడో యీ అపవిత్రమైన స్త్రీని కూడా తాకే యోగ్యత అతనికి లేకుండా పోయింది. సిరియాలో 'పావురం' అతిపవిత్ర మైనదిగా భావించబడుతుంది. దాన్ని ఎవరైతే తాకుతారో వారు ఆరోజల్లా అప విత్రుడుగా భావించబడతాడు. ఇదే విధంగా పందికూడా నిషేధించబడ్డ జంతువని కొన్ని మానవసంఘాలు నిర్ణయించినవి.

'పవిత్రము; శుభ్రమైనది' అంటే——అనుమతింపబడినదనే అర్థంలో వాడబడు తోంది. 'అపరిశుభ్రమైనది' అంటే ముట్టరానిది; అనుమతించబడినది అనే అర్థంలో వాడబడుతోంది. ముట్టరానివాడికి ఒకవిధమైన పవిత్రత అంటగట్టబడింది. హిందువు లకు ఆవుమాంసము నిషేధించబడింది; అందుకని వారికి ఆవు అతి పవిత్రమైనజంతువు. ఇలాగే ఇతరజాతులకు నిషేధించబడ్డ జంతువుల విషయం కూడాను.

మహమ్మదీయమతం అవతరించకపూర్వం 'శుభ్రమైనది' 'అపరిశుభ్రమైనది' అనేపదాలు బహిష్టుకాని స్త్రీలకూ, బహిష్ఠయిన స్త్రీలకూ. అరేబియాలో వాడికలో వుండేవి.

యీవిధమైన భేదాన్ని అనాగరికజాతులు ఎలా పరిగణించేవో ఫ్రేజర్ అనే ఆయన పరిశోధించాడు. బహిష్టయిన స్త్రీ, ప్రసవమైన స్త్రీ——రాజులకూ, జాతి పెద్ద లకూ సంబంధించిన పవిత్రతనే కలిగివుండేవారు. ఆచారవ్యవహారాల్లోనూ, తమ పవిత్ర తను కాపాడుకోవటంలోనూ, వీరందరికీ నిషేధం ఒక్కటే! ఇతరసాధారణ ప్రపం

చం నుంచి వారిని వేరుచేసి, ఏకాంతవాసంలో వుంచి, వారిఅసాధారణత, వారిలో పనిచేసే మానవాతీతమైన శక్తి ఇతరులను సోకకుండా వుండేట్లు కాపాడటమే వారి అభిప్రాయంగా వుండేది. మరికొన్ని జాతుల్లో బహిష్టయిన స్త్రీ ఇటుభూమిని తాకకూడదు; అటు సూర్యుణ్ని చూడకూడదు అనే ఆచారం వుండేది. ఆమూడురోజులూ భూమ్యాకాశాలకు మధ్యగా వేళ్లాడవలసి వుండేదన్నమాట ! ఇంటికప్పుకు వేళ్లాడే వుయ్యాలలో వుండటం దక్షిణాఫ్రికాలో ఆచారంగావుండేది. న్యూజిలెండులో ఒకబోనులో బంధించి దాన్ని ఎత్తుప్రదేశాలమీద, ఒకచీకటికొట్లో వుంచటం ఆచారంగావుండేది. ఆమెలోని అసాధారణశక్తితో ఆమెజీవపదార్థానికి అతిముఖ్యమైన సూర్యుణ్నీ, భూమినీ విషపూరితం చేయలేదనే నమ్మకం వారికి వుండేది. ఇందులో ఆమెక్షేమమూ, ఇతరులక్షేమమూ కూడా ఇమిడివున్నవనుకునేవారు. ఇందులోని అసాధారణశక్తిని మంచిగానూ, చెడుగానూకూడా తీసుకోవచ్చు; దాని ప్రయోగంలో రెండూ యిమిడి వుండటంవల్ల, అలాటి శక్తిని దూరంగా వుంచటంలోనే సంఘక్షేమం వుందని అభిప్రాయ పడేవారు.

హిందువుల్లో బహిష్ఠయిన స్త్రీ యింటిలో ఒంటరిగా ఒకమూల జేరటం ఆచారం. 'బైట వుండటం'లో ఆమె యింటిలోని వ్యక్తులనుంచి వేరుచేయబడ్డధ్వనివుంది. ఆమెను మడివాళ్ళు చూడకూడదు. యితరులు తాకకూడదు. మరీ ఆచారాన్ని వెలగబెట్టేవారు ఆమెతో మాట్లాడరాదు. చివరకు ఆమె వుపయోగించే పాత్రలూ, నీరూ, మంచమూ అన్నీకూడా అసాధారణ వస్తువులల్లే చూడబడుతవి. ఆమెతాకిన గుడ్డలు మైలవిగానూ, ఆ గుడ్డల్ని తాకిన వ్యక్తిని తాకిన వారందరూ మైలపడ్డ వారిగానూ భావించబడతారు. యిక్కడ నూలు ఆ అసాధారణశక్తికి విద్యుత్ ప్రవాహవాహకంగా వుపయోగ పడుతుందన్నమాట ! దిగంబరులైన ఒక్కపిల్లలు తప్ప యింకెవరూ ఆ బుతువులో ఆమెను తాకరాదు—యిదీ ఆచారం !

డర్క్‌హీమ్ యిలా అంటాడు; "యీ సంఘ నిబంధనలూ, నిషేధాలూ గమనిస్తే—వీటిలో వైవాహిక సంబంధాల్నిగూర్చినవి మనకొక అభిప్రాయాన్ని యిస్తవి. సగోత్రీకుల వివాహం వలెనే, ఆ తెగలోని వ్యక్తితోడి వివాహం నిషేధించబడింది. ఒకేకుటుంబములోని వ్యక్తుల మధ్య వివాహం ఎలా నిషేధించబడిందో, అలాగే ఒకేతెగలోని వ్యక్తులమధ్య వివాహం కూడా నిషేధించ బడుతుంది. దీనికి కారణం పూర్వం 'సమిష్టి వివాహపద్ధతి' (Group marriage system) అమల్లో వుండేది. అంటే ఒకతెగలోని పురుషులందరికీ, ఆ తెగలోని స్త్రీలందరూ భార్యలుగానే వుండేవారు. ఇకవారి సంతానమంతా అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ అవుతారుకదా! అందుకని వారిమధ్య వివాహం నిషేధించబడింది. క్రమంగాతమ స్నేహాన్నీ బంధుత్వాన్నీ విస్తరించుకోవటంలోగల మేలును కూడా మానవుడు గుర్తించటంవల్ల ఒకతెగవారు, తమ తెగలోని వారితో కాకుండా, ఇతర తెగలవారితో వివాహసంబంధాలు చేసుకోనేవారు. ఒక కుటుంబమల్లే పెరిగిన తెగకూ, కుటుంబానికీ గలభేదం





బహుకొద్ది కావడమే దీనికి కారణం. యితరతెగలతో మాత్రమే వివాహాలు చేసుకొనే పద్ధతి (Exogamy) లో పూర్వీకుల్లో రక్తసంబంధాన్ని గూర్చిన కొన్ని నమ్మకాలు ఎక్కువగా పనిచేసేవి. యిలాటి రక్తసంబంధమే బహిష్ఠులోనూ, ప్రసవమవటంలోనూ, కనుపిస్తుంది కనుకనే ఆయావికారాల్లో వున్న స్త్రీకి కూడా ఒకవిధమైన నిషేధం అమలుజరుప బడింది. మరీ బహిష్ఠు ప్రతినెలా కనిపించటమూ అదినిషేధించ బడినదనే విషయం, తరుచుగా జ్ఞాపకానికి రావటమూ యిది తరతరాలుగా శతాబ్దాల తరబడిన మానవుడిలో పాతుకు పోవటంవల్ల ఒక సామాన్య విషయంగా నిత్యజీవితంలో కలిసి పోయింది. దీన్ని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేనంత చిన్నవిషయంగా వుండిపోయింది. ఒక విధమైన మతైక మూఢ నమ్మకంగా మారిపోయింది—

"అంతేకాదు. రక్తాన్నిగూర్చి అతిగాఢమైన పవిత్రమైన నమ్మకాలు పూర్వ మానవులకు వుండేవి. అది జీవధాతువుల్లో ఒకటనీ, దాన్నిగూర్చి ఎంతో జాగ్రత వహించవలసిన బాధ్యత మానవుడికి వుందనీ అన్నిజాతుల వారూ నమ్మేవారు. అడదాని రక్తాన్ని అతి పవిత్రంగా భావించేవారు. బ్రాందీ, ద్రాక్షరసాలు మొదలైన మత్తు పదార్థాల్ని చాలా జాతులవారు నిషేధించారు. దీనికి కారణం—ద్రాక్షరసం, ద్రాక్షకాయకు సంబంధించిన రక్తమనే అభిప్రాయం. రక్తము, దానికి సంబంధించినవన్నీ నిషేధించబడినవి. బిడ్డకు తన రక్తాన్ని పంచి యిచ్చేది స్త్రీ కావటంవల్ల ఆమెకు కూడా యిలాటి నిషేధం వర్తిస్తుంది. యీ కారణాలన్నీ తెలిసుకోక పోయినా ఒక విధమైన ఆతృత, ఒకరకమైన మతైక భయం, ఆమెనుంచి యితరులను దూరంగా నెట్టగలిగినవి. అటిస్థితిలో వున్న స్త్రీతో సంభోగమే కాకుండా, ఆమెను ముట్టుకోవటమూ ఆమెతోడి ప్రణయ సంభాషణలు మొదలైనవి కూడా నిషేధించబడినవి. గాఢంగాపాతుకుపోయిన యీఅభిప్రాయం లోలోన పనిచేయటంవల్ల, ఆ స్థితిలోవున్న ఆడది ఆకర్షించదు. సరికదా దూరానికి నెట్టేందుకే ప్రయత్నిస్తుంది. లైంగిక అవయవాలు సాధారణస్థితిలో వుండక పోవటంవల్ల యీభయం మరీ అధికమవుతుంది. యీ రెండుకారణాలవల్లా బహిష్టయినస్త్రీని అసాధారణంగా చూడటం తటస్థించింది."

స్త్రీని దూరంగా వుంచేందుకు లోకంలోని వివిధమతాలు అనేకవిధాలుగా ప్రబోధించినవి. స్త్రీని సైతాన్ గాభావించటమూ, స్త్రీవల్లనే పురుషుడుపాడైపోతాడనే అభిప్రాయాన్ని ప్రచారంచేయటమూ, స్త్రీకి లోబడ్డవాణ్ని స్త్రీమాయలో ఇరుక్కున్నవాడుగా భావించటమూ మొదలైనవి స్త్రీఅంటే పురుషుడు భయపడేట్లుగా చేసేందుకు ప్రయత్నిస్తున్నవి. బ్రహ్మచారులు ఎంతో ధృడంగానూ దేన్నయినా సాధించగల వారుగానూ పరిగణించబడేవారు. బ్రహ్మచర్యావలంబన మానవాతీతశక్తుల సాధనకూ, తపస్సుకూ అతిముఖ్యాంగంగా భావించబడేది. బ్రహ్మచారి పవిత్రుడుగా పరిగణించబడేవాడు; అందుకనే పెళ్లిలో మామగారు, అతనికాళ్లుకడిగి కన్యను దానం

చేయటం ! పెళ్లయాక, అంటే ఒక స్త్రీతోడి సాంగత్యం ఏర్పడ్డాక అతని పవిత్రత అంతా తుడిచిపెట్టుకొని పోతుంది. సంభోగం మానవుణ్ని శక్తిహీనుణ్ని చేస్తుందనీ, ఆయుస్సును క్షీణింప జేస్తుందనీ వీరందరూ నమ్మేవారు. లేక అధిక సంభోగాన్ని అరికట్టేందుకు యీ వుపాయాన్ని కనిపెట్టి వుంటారేమో ?

సంభోగాన్ని గూర్చిన అభిప్రాయాలే యింతభయోత్పాతంగా వుంటే-యిక బహిష్ఠయిన స్త్రీతోడి సంభోగం విషయం చెప్పనే అక్కర్లేదు! మనుధర్మం యిలా చెపుతోంది. ‘బహిష్ఠయిన స్త్రీ దగ్గరకు వెళ్ళినవాడి విజ్ఞానము, శక్తి, బలము, దృష్టి, పురుషత్వమూ నశిస్తవి’ యిలాటి అభిప్రాయాలే ప్రపంచమంతా అల్లుకొని వున్నవి. ఒకసారి బహిష్ఠయిన స్త్రీతో వ్యభిచరించిన పురుషుడు 40, 50 రోజులపాటు తపస్సు చేస్తేనే కాని ఆపాపంపోదని క్రిష్టియన్ చెర్చ్ చెపుతుంది.

బహిష్ఠయిన స్త్రీ ఒక్క సాంఘిక శక్తుల్ని కట్టి వేయటమే కాక- ఆమె తాకిన పూలు వాడిపోతవనీ, చెట్లను తాకుతే అవి తమ ఫలాలన్నిటినీ రాల్చివేస్తవనీ, మొత్తం ప్రకృతినే స్తంభింపజేస్తుందనీ- యిలాటివే అనేక మూఢనమ్మకాలు చాలా జాతుల్లో వున్నవి.

లాభదాయకమైనవి కూడా బహిష్టయిన స్త్రీపట్ల వున్నవనే నమ్మకాలుకూడా లేకపోలేదు. ఆస్థితిలో ఆమెకు మానవాతీతమైన శక్తులుంటవని నమ్మేవారు. మామూలు స్థితిలోనే స్త్రీ నగ్నంగా చెట్టుచుట్టూ ప్రదక్షిణం చేసేట్టయితే ఆచెట్టును గొంగళీ పురుగులు అంటవనే నమ్మకం యిప్పటికీ యిటలీలోవుంది. బహిష్ఠయి నగ్నంగా వున్న స్త్రీని తుఫానులూ, సుడిగాళ్ళూ చివరకు వురుములు, మెరుపులు కూడా దరిజేరవని నమ్మేవారు. సముద్రయానంలో వొచ్చే తుఫానును ఆపేందుకు సాధారణస్త్రీని నగ్నంగా నిలబెట్టేవారు. బహిష్ఠయిన స్త్రీ గోధుమచేనుచుట్టూ నగ్నంగా తిరిగినట్టయితే మొక్కల్ని అంటిపెట్టుకొని పంటను పాడుచేసేందుకు వుపకరించే గొంగళీ పురుగులూ, యితర క్రిమికీటకాదులు కిందపడేవనే నమ్మకం వుండేది.

బహిష్ఠు రక్తంతో తడిసినగుడ్డ కత్తిపోటులకూ, గాట్లకూ రక్షణగానే కాక, మండేనిప్పును యిట్టే ఆర్పివేయ గలదని బవేరియాలో నమ్మేవారు. ప్రణయాన్ని వడబోతగా పరీక్షించుకునేందుకు బహిష్ఠురక్తం వుపయోగ పడుతుందని నమ్మేవారు. కుష్టువ్యాధి దీని పూతవలన నయమవుతుందనీ, బహిష్ఠురక్తాన్ని తన ప్రియుడికి ఏ కాఫీలోనో కలిపియిస్తే, యిక అతడు తనను విడవలేడనీ జర్మనులు నమ్మేవారు. క్రైస్తవుల్లో ఒక జాతివారు బహిష్ఠురక్తాన్ని క్రీస్తురక్తమల్లే అతి పవిత్రమైనదిగా భావించేవారు.

కాని చర్చ్‌వారు బహిష్ఠు స్త్రీల విషయంలో అమితంగా భయపడ్డారు. వారు బహిష్ఠయి చర్చ్‌కి రాకూడదని శాశించారు. మరికొంతమంది అసలు స్త్రీలే





రాకుండా వుంటే మంచిదని అభిప్రాయపడి అమలు జరిపారు. 2-వ గ్రిగరీ యీబహిష్ఠయిన స్త్రీలు చర్చ్‌కి రాకూడదనే నియమాన్ని రూపుమాపాడు.

ఏది ఏమైనా బహిష్ఠయిన స్త్రీ పట్ల ఒకానొక హానికరమైన అభిప్రాయం మానవజాతిలో లోతుగా పాతుకుపోయింది. వ్యాపారరీత్యానూ, సాంఘికంగానూ, చివరకు శారీర శాస్త్రరీత్యాకూడా యీ అభిప్రాయం మనలో పని చేస్తూవుంది.

ఉత్తరఫ్రాన్సులోని పెద్ద పంచదార ఫ్యాక్టరీలో పంచదార తయారయేముందు వేడి అయే సమయంలోనూ, తరువాత అది చల్లబడే సమయంలోనూ స్త్రీలు ఫ్యాక్టరీలోకి రాకూడదనే నియమంవుంది. ఒకవేళ బహిష్టయిన స్త్రీ ఆసమయంలో ఫ్యాక్టరీలోకి వొచ్చినట్టయితే, పంచదార నల్లబడిపోతుందని వారి నమ్మకం. సైగాన్ లోని నల్లమందు ఫ్యాక్టరీ-నల్లమందు తయరయ్యే సమయంలో స్త్రీలు ఫ్యాక్టరీలలోకి రాకూడదనే నియమంవుంది. బహిష్ఠయిన స్త్రీ అలావొచ్చినట్టయితే తయారయే నల్లమందు చేదుగా మారుతుందని వారి నమ్మకం. బహిష్ఠు సమయంలో నల్లమందు తయారయే గొట్టాల దగ్గర పని చేయటం చాలా కష్టమని అక్కడి ఆడ కూలీలు చెప్పేవారు. సున్నపుబట్టి పాడైనట్టయితే, ఆ ప్రాంతాల్లో బహిష్ఠయిన స్త్రీ వుందని అనుమాన పడేవారు.

1878లో బ్రిటిష్ మెడికల్ ఎసోసియేషన్ సభ్యుడొకడు-బహిష్ఠయిన స్త్రీ మృగమాంసాన్ని తయారుచేస్తే అదిపాడు కావటం నిజమేనా అని ప్రశ్నించాడు; ఇలా తన అనుభవంలో రెండుసార్లు జరిగిందట ! ఇది నిజమైతే బహిష్ఠయిన లేడీ డాక్టర్ తాలూకు రోగులసంగతి ఏమిటని ఇంకో సభ్యుడు అడిగాడు ! మూడో ఆయన యీ విషయమై తర్జన భర్జనలు అనవసరమనీ, బహిష్ఠయిన స్త్రీ మాంసాన్ని వండినట్టయితే అది పాడు అవుతుందనే సంగతి మెడకాయ మీద తలకాయ వున్న ప్రతివ్యక్తికీ తెలిసిన సాధారణ విషయమనీ రాశాడు ! ఒక విశేషం మాత్రం అందరూ గమనించవొచ్చు; బహిష్ఠయిన స్త్రీ వొండిన మాంసపురంగు మారుతుంది !

ఇలాటి ప్రాథమిక మానవుడి అభిప్రాయాలన్నీ కలిసి శాస్త్రజ్ఞుల్ని బహిష్ఠయిన స్త్రీని గూర్చిన పరిశోధనలకు ప్రోత్సహించినవి. డాక్టర్ విలియంగూడెల్ ఇలా అంటున్నాడు; “బహిష్ఠయిన స్త్రీకి శస్త్రచికిత్స చేయకూడదని నారోగులు చాలా మంది, అంటున్నారు. మన తాతముత్తాతల కాలంనుంచీ—బహిష్ఠయిన స్త్రీ మతైకంగా ప్రతిబంధకమనీ, ఆమెతాకిన పాలు విరిగిపోతవనీ, కాగే సారాయి పాడవుతుందనీ ఇలాటివే అనేకమైన మూఢనమ్మకాలు మనలో పాతుకుపోయినవి. నిజమైన కారణం తెలియక పోయినప్పటికీ, యీ నమ్మకం మనలో ఏర్పరిచిన యీవిధమైన భయంవల్లనే బహిష్ఠయిన స్త్రీకి జరగవలసిన శస్త్రచికిత్సలను మన వైద్యులు సామాన్యంగా ఆ స్థితిపోయేవరకూ వాయిదాలు వేస్తున్నారు. ప్రమాద స్థితిలో అత్యవస

ర్గంగా జరగవలసిన శస్త్ర చికిత్స విషయంలోకూడా ఇలాటి కాలయాపన దేనికి ? నా అనుభవంవల్ల నేను తెలుసుకున్న దేమిటంటే స్త్రీ రహస్యాంగానికి సంబంధించిన అంగ నిర్మాణంలోని భాగాలన్నీ ఉబ్బి ఉండటంవల్ల చికిత్స తేలికవుతుంది. ఒక్క గర్భాశయానికి సంబంధించిన శస్త్రచికిత్సలను తప్ప, మిగతావాటన్నిటికీ నేను యీ సమయాన్నే ఎన్నుకొంటాను. యీఎన్నికవిషయంలో నేనెన్నడూ విచారించలేదు.''

మూఢనమ్మకాల విషయం అటుంచి, శరీర శాస్త్రరీత్యా నరాల్లో కలిగే మార్పుల్ని గూర్చి విచారిద్దాం. బహిష్టు స్త్రీలో మార్పును తీసుకొని వొస్తుందా? ఏమైనా అసాధారణత ఆమెలో కనిపిస్తుందా? కనీసం ఆమె ఆవిధమైన మార్పును గమనించ గలుగుతుందా ?

కారెంట్ ఇలా అంటున్నాడు.'16, 17 సంవత్సరాల వయసున్న ఇద్దరు ఆడ పిల్లల్ని నేను ఎరుగుదును. వారిలో మామూలుగా నరాల బలహీనత్వం వుందికాని, హిస్టీరియా చిహ్నాలు మాత్రం లేవని చెప్పగలను. వారు బహిష్టయినప్పుడు, ఏదో ఉద్రేక పరిచే చక్కలగిలి లాటిది వుంటుందన్నారు. ఏదో విద్యుత్ శరీరమంతా పాకి నట్టుగా వుంటుందట. కొన్నివస్తువుల్ని తాకటంవల్ల ఆనందమూ, మరికొన్నిటి వల్ల భయంతో కూడిన గగుర్పాటు కలుగుతుందట. యీసమయంలో తమదుస్తులు తమ శరీర చర్మానికి అంటుకుపోయివుంటాయని వారి నమ్మకం. కాలికి వొదులుగావున్న పాదరక్షల్ని తీయవలసి వస్తే ఎంతోకష్టంమీదకాని అవిరావు, మేజోళ్ళు పట్టబలవం తంతో ఇంకోవ్యక్తి లాగవలసిందే! బహిష్టు సమయంలో బట్టఎక్కడ శరీరచర్మంలో ఐక్యమై పోతుందో ననే భయంవల్ల వారు చాలాసార్లు బట్టల్ని మారుస్తూంటారట!'

భార్య బహిష్టయి ఉండగా వీణవాయించేవాడు, దాన్ని వాయించేందుకు ప్రయత్నిస్తే తప్పకుండా తీగె తెగి పొయ్యేదని చెప్పుతున్నాడు. యీ కారణం చేతనే ఆ నాలుగురోజులూ, ఆ వాయిద్యాన్ని తనస్నేహితుని ఇంటికి మార్చేవాడట ఇంకో నాట్యకత్తె రెండేళ్ళ క్రితం ఇలాఅవుతుందని ముందుగా చెప్పినా వినకుండా, వీణవాయించటం వల్ల తీగెలు తెగినవని ఆ వాయిద్యగాడు చెపుతున్నాడు.

ఫిడేలు వాయించే ఇంకోఆమె బహిష్టుసమయంలో ఫిడేలు వాయిస్తూంటే మామూలుగా తీగెలు తెగటం ఆచారంగా ఉండటంవల్ల, ఆనాలుగురోజులూ ఆవృత్తిని వొదిలేశానని చెపుతోంది. కొచ్చిన్ చైనా నుంచి ఒకాయన ఇలాటి ఉదాహరణనే చెపుతున్నాడు.

ఇలాటివేగాక, గృహపరికరాల్ని వాడేప్పుడు బహిష్టయిన స్త్రీ వస్తువుల్ని ఎక్కువగా పగలకొట్టటమూ, మూతతిరగతొయ్యటమూ సాధారణంగా జరుగుతూండ టం చాలామంది అనుభవంలోనిది. వారిలో ఏదో నరాల బలహీనత్వం లాటిదో, నరాల ఉధృతం లాటిదో ఆసమయంలో ప్రవేశిస్తుందని చాలామంది నమ్మకం





గుడ్డతో తుడిచే గాజుగ్లాసు చిట్లి పగలటం, కుట్టేసూదులు ఇట్టేవిరగటం ఇలాంటివే. ఇలాటివేకాక, తాకినంత మాత్రాన తిరిగేగడియారం ఆగటంకూడా కద్దని నమ్మేవారు!

వీటిలో కొన్నిటికి కారణాల్ని వెతికి చెప్పవొచ్చు. కొన్నికండరాలు మానవుడి ఆజ్ఞలేకుండానే, తెలియకుండానే పనిచేయటంవల్ల ఆ పనులు మనను ఆశ్చర్య పెడుతవి. ఐతే లోకమంతటా వున్న మూఢనమ్మకాలన్నిటినీ సమర్థించాలంటే చాలా శ్రమతోకూడినపని; కనుక దాన్ని ఇక్కడ వొదిలేస్తున్నాము.

బహిష్టుకూ, ఎదవటానికి లేక వేడిని ఉద్భవింప చేసేందుకు సంబంధంవున్న దనే విషయం నిర్వివాదాంశం. "ఒకస్త్రీలోనే యీ ఎదకావటం ఎల్లవేళలా జరుగు తూంటుంది" అన్న జాన్స్టన్ మాటల్లో అతిశయోక్తి లేకపోలేదు. ఐతే బహిష్టు కావటానికీ, ఎదకావటానికీ చాలా దగ్గరి పోలికలు, శరీర సంబంధాలూ ఉన్నవనే మాటను మనం మరిచిపోకూడదు. ఇలాటిది స్త్రీ పురుషులకు పూర్వం ఉండేదనీ, అందుకనే వారిని యీ సమయంలో విడదీసేందుకు ప్రయత్నాలు జరిగేవనీ జంతు శాస్త్రజ్ఞులు చెపుతున్నారు.

బహిష్టువల్ల ముఖ్యంగా జరిగే శారీరకమార్పుల్ని పరీక్షిస్తే—కామోద్రేకాన్ని రెచ్చగొట్టేదిగా దీన్ని చెప్పవచ్చు. పుష్పవతికావటం మొదలుగా స్త్రీలో కామం ఉద్భవించటం అతిసహజంకదా ! అప్పుడే ఆమెను యీడుకువచ్చినదానిగా భావి స్తారు. ఇతర మానసికమార్పులు కూడా కలుగుతవి. అవి ఎంతచిన్నవైనప్పటికీ బహిర్గ తంకావటంలో పెద్ద మోతాదులోనే ఉంటవి. మనోనిశ్చలత లేకపోవటమూ, వృథాగా కోపగించు కోవటమూ, విసుక్కోవటమూ మొదలైనవి. వీటిబలంఆవ్యక్తిని బట్టి ఉంటవి. కామోద్రేకం విపరీంగా కలగటమూ, దాన్నిదాచేందుకు ప్రయత్నించ టంలో కనబరిచే అసహజమైన సిగ్గూ మొదలైనవి గమనించదగినవి. ఆడజంతువుల్లో యీవుద్రేకం విపరీతమైన కోపరూపాన బైటపడుతుంది.

బహిష్టు అయినప్పుడు సామాన్యంగా మైలవొచ్చే మొదటి 2, 3 రోజుల్లోనూ ఇలాటి ఉన్మృత కామం యూరపియన్ స్త్రీలలో అంతగా కనిపించదు. అంతేకాదు, అరేబియన్ పుస్తకంలో బహిష్టయినస్త్రీ సంభోగాన్ని ఏవగిస్తుందని చెప్పబడ్డది. కాని శుశ్రుతుడు ఇలా అంటాడు;'పురుషుల వెంటపడేస్త్రీ బహిష్టుచిహ్నాల్ని రూపిస్తుంది.'

యీవిధమైన ఉధృతం మైల అవుతూన్నప్పుడే ఉంటుందో, ఉండదో చెప్ప టం కష్టం. కాని ఆచిక్కులు బహిష్టుకు ముందో, స్నానాంతరమో తప్పక కనిపిస్తవి. ఎల్లిస్ విచారించి పరిశోధించినంతవరకూ మైలఅయ్యేప్పుడు కామోద్రిక్తత కలిగినట్లుగా వుంటుందని తేలింది. మైలకావటం ప్రారంభమై నప్పటినుంచీ కామ ప్రేరితమైన శక్తి పోతూన్నట్టుగా ఉండటంవల్ల ఉద్రిక్తత తగ్గుతుంది; కాని క్రమంగా కాలం గడిచేకొద్దీ మైలకావటంకూడా తగ్గటమూ, తనను ఆవరించిన ఆవహించిన అసాధా

రణాతలోనుంచి బైటపడుతూన్నట్టుగా ఉండటంవల్ల కామోద్రేకానికి తిరిగి ఒక అవకాశం ఏర్పడుతూవుంది.

మంచి ఆరోగ్యంలో వున్న కొంతమంది స్త్రీల విషయంలో—బహిష్టు సమయంలోనే వారికి విపరీతమైన కామోద్రేకం కలుగుతుందని చెపుతున్నారు. ఒకామె ఇలా రాస్తోంది; "బహిష్టుకుముందూ, తరువాత నాకు ఎక్కువ కామోద్రేకం కలుగుతుంది; అంతేగాక మైల అవుతూన్నప్పుడు ఆకలిగే ఉద్రేకం నేను తట్టుకోలేనంతగా వుంటుంది; కాని దురదృష్టవశాత్తూ అది ఆసమయంలో శాంతించే మార్గంలేదుకదా!"

కన్యగా జీవితాన్ని గడుపుతూ, హస్తప్రయోగాది దురభ్యాసాలకు అలవాటుకాని 19 సం. ల యువతి ఇలా అంటోంది; "బహిష్టు కాబోయ్యేముందు నాకు కామోద్రేకం కలుగుతుంది. బహిష్టు ప్రారంభమై మైల అయే ఆ 3, 4 రోజులూ అనేకరెట్లు యెక్కువ కామోద్రేకానికి గురవుతాను. శాంతించని యీ ఉద్రేకంవల్ల నాకుసరిగా నిద్రపట్టదు, ఆహారం హితవుగాఉండదు, మనస్సంతా చిందర వందరగా వుంటుంది. ఏదన్నా జబ్బుస్థితిలో ఉన్నట్టుగా నేను భావిస్తాను."

బార్నెస్, ఆలివర్ మొదలైన కొందరు- బహిష్టయినప్పుడు స్త్రీల రక్తపు పోటు (Blood Pressure) అధికమౌతుందనీ, దీనికి తోడుగా కామోద్రేకం అధికమవుతుందనీ చెపుతున్నారు. బహిష్టుసమయంలో అధికంగా బహిర్గతమయే నైట్రస్ ఆక్సయిడ్ గాస్ (Nitrous oxide gas) వల్లకూడా ఇలాటి వుధృతభావాలు కలుగుతవని మరికొందరి అభిప్రాయం. ఇందులో ఎంతో నిజంవున్నప్పటికీ తరతరాలుగా మానవుడు యీ విషయమై తెలుసుకోకుండానే వున్నాడు.

దీనికి ఇవీకారణాలు: బహిష్టయిన స్త్రీ ఇతర ప్రపంచానికి దూరంగావుండటం సామాన్యంగా ఒంటరిగా తన బాధనో, ఆనందాన్నో తనే అనుభవిస్తూండటమూ జరుగుతూంటుంది. బహిష్టు ప్రమాదమైనదనే తాతలనాటి భయం ఇతరులలో పని చేయటంవల్ల అసలు ఆమెవైపే చూడరు. స్త్రీలోకలిగే భావాలు గమనించబడే అవకాశం బహుతక్కువ. ఒకామె ఇలా అంటూంది. 'మైల అయేప్పుడు సంభోగంవుంటే ఎంతైనా బాగుండుననిపిస్తుంది. యీస్థితిలో అది అసంభవమనే మాట జ్ఞాపకానికి రాగానే ఎలాగో ఆవాంఛను చంపుకుంటాను'. ఇలాటి అభిప్రాయాలే చాలామంది స్త్రీలకు వుంటవని మనం నమ్మవొచ్చు. సంభోగానికి విరుద్ధంగా బహిష్టు స్త్రీవుంటుందంటే ఆవాంఛలేక కాదుకాని, అది అసాధారణమైనదీ, ఆచారం కాంది కనుకనే. కామోద్రేకం కలగటాన్ని శరీరశాస్త్రపరిణామంగానూ, దానికి విరుద్ధభావాన్ని ప్రకటించటం మనస్తత్వ పరిణామంగానూ మనం చెప్పుకోవొచ్చు.

( ఇంకా వుంది )






రచన: చౌడేశ్వరీదేవి

అంతకన్నా యింకేం చేయ గలుగుతాను?- ప్రొద్దుణ్ణుంచీ ఆయనా నేనూ కలిసి- శనగపప్పు వేయించి, సంపాయించి తెచ్చిన ఆనాలుగు డబ్బులూ ఏమూలకు వస్తాయి?

పైగా రెండురోజుల్నుంచీ మంచికూర లేదని ఒకటే సాధింపు! ఈవూరి మొహం చూడకముందు యిన్నిరుచులూ, కోరికలూ వున్నాయా? పగలల్లా పొలంలో పనిచేసి, చేసింది తిని-కడుపులో కాళ్ళు ముడుచుకునే ఆయన ప్రకృతి- యిక్కడికి రావడంతోనే, యీ వాతావరణానికి అలవాటు పడడంతోనే-ఎంత విచిత్రంగా మారిపోయింది!

వేదాంతుల్ని-సన్యాసుల్ని - కాంతం కనకాలు ఎంతగా ఆకర్షించి బాధపెడతాయో, పల్లెటూళ్ళనుంచి వచ్చిన తన భర్తలాంటి వాళ్ళను, బస్తీలలోని అలవాట్లూ, ఆచారాలూ సూదంటిరాయిలా ఆకర్షించి బోల్తా కొట్టిస్తాయి కామోలు! మానవ ప్రకృతిలో యీ నైజం మొట్టమొదట్నుంచీ ఎంత విచిత్రంగా హత్తుకుపోయింది!

ప్రొద్దుణ్ణుంచీ ఎవర్నడిగినా- ఆఖరికి పావలా డబ్బులుకూడా అప్పు పుట్టలేదు! ఆస్థి పాస్తులులేక, రెక్కలమీద ఆధారపడి జీవించే మధ్యతరగతి మానవులకు ఎవరూ ఏమీయివ్వరు. తమలాంటివాళ్ళే కళ్లముందు గిలగిల కొట్టుకు చస్తున్నా మానవజాతికేమీ చలనం కలగదు. ముందు చంటిపిల్లాడిమాట అటుంచి - పెద్దపిల్లాడికి బజార్లో వున్న పళ్లన్నీ కావాలి.

ఇద్దరు పిల్లలతో సంసారం గడవడమే అంతంత మాత్రంగావున్న పరిస్థితుల్లో- పిల్లాడి కోరికలన్నీ తీరేందుకు యింకో జన్మ విధిగా ఎత్తాలి! లేదా, దొంగతనమన్నా చేయాలి.

చూస్తూచూస్తూ ఎవరిస్తారు వూరికినే?

ఆలోచిస్తున్న కొద్దీ, చూస్తున్నకొద్దీ- సంసారం ఏయిబ్బందులూ పడకుండా దొర్లిపోవడం చాలా విచిత్రంగావుంది. ఆయన రెండుమూడు సార్లు 'నీచేతుల్లో- కాణీ రూపాయగా మారుతుందే! ఇంకోకతైతే! యీపాటికి నేనెక్కడో యినపకటకటాల వెనక వుండవలసి వచ్చేది. పొదుపుగా జరుపుకొచ్చే తెలివితేటలు

...యి గనకే- హాయిగా, దిగులు లేకుండా వున్నాను' అని అన్నారు.

ఆమాట నిజంగా నామనసుని ఎక్కడెక్కడకో లాక్కుపోయింది. ఎంతో విసుగుతో వున్నా, కష్టంగా వున్నా ఆయనగారిమాటలు బాధల్ని మరిపిస్తయ్ ! ఆ మాటల్నే ఎన్నోసార్లు అనుకుని - నిశ్చింతగా వూపిరి పీల్చుకుంటాను.

యీ సంసారంలోని పరిస్థితుల లాంటివి!- నాలాంటి ఆడది యింకెవరన్నా అయితే యీపాటికి ఎవరితోనన్నా, అబ్బిలెమ్మ లేచిపోయినట్లు చేసేదే!

నాలానే యీ బాధ్యతంతా ఆయనగారు తీసుకుంటే- యీ పరిస్థితి వచ్చేదే కాదు. ఆయనలా నేనుకూడావూరు కున్నట్లయితే- యీపిల్లలగతీ సంసారపుగోడూ ఏమయ్యేదో!

యివేమీ తన కక్కర్లేదన్నట్లు - తనవి కాదన్నట్లు, పట్టించుకోకుండా తిరిగే ఆయనవాలకాన్ని చూస్తున్నకొద్దీ మెల్లిమెల్లిగా అసూయ హృదయంలో మెదలడం ప్రారంభించింది.

అసలు సంగతి చెబుతాను__

పనిలోకివెళ్ళి నేను శనగపప్పు వేయిస్తున్నప్పుడల్లా_ఆయనగారు నా పక్కనే కూర్చుని గబగబా నాలికలు చాపుకుంటూ మండుతున్న ఆ పెద్ద పొయ్యిమంటను సరిజేస్తున్నా __ దూరంగా గోడకు ఆనుకు నిలుచుని ఏవేవోమాటలు చెబుతూ, కొండయ్య అదేపనిగా నావైపు చూసేవాడు. ఆకళ్ళు ఆశగా__వెర్రితో నావంటిని గుచ్చిగుచ్చి చూసేవి. ఆయనివేవీ పట్టించుకోకుండా చెప్పే ఆమాటలకు ఊకొడుతూ__అప్పుడప్పుడు ఆయనతోపాటు నవ్వుతూండేవాడు.

ఇప్పుడు ఆమాట అనుకుంటుంటేనే- ఏలానోవుంది !

గాడి పొయ్యిలోంచి పెద్దగా మండుతున్న మంట వెలుతురు కొండయ్య మొహంమీద పడి__నాలికలు చాపుతూ మెరుస్తున్నకొద్దీ, ఆపాడుపనికి రమ్మన్నట్లూ__ఆ కళ్ళెంతో యిదిగా, గిలిగింతలు పెడుతూ శరీరాన్ని తాకేవి! రెప్ప వేయకుండా చూసే ఆకళ్ళ కాంతిలో మనసు పరుగులు పెట్టేది.

మెరుస్తున్న మంట వెలుతుర్లో, ఆ కళ్ళ కాంతి__నా అవయవాలన్నీ వెదికేవి ! స్పర్శించేవి !

ఇద్దరు పిల్లలుపుట్టి __ ముప్ఫయ్యో సంవత్సరం నడుస్తున్న యీ వయస్సులో శరీర కాంతి __ అవయవాల పొందికా, మారినయ్ గాని __ యిరవయ్యో ఏడు వచ్చేంత వరకు, పిల్లలు కలగనంతవరకూ, నున్నగా __ మిలమిల మెరుస్తూ, యీ కళ్ళు వెన్నెలని కురిపించేవి !

మీరు నమ్మరు. కాని నిజం__

బస్తీ అలవాట్లకు గురై__దుబారాగా ఖర్చుచేస్తూ, ఆయన పొక్కడూ కష్టపడి సంపాదించి, యీ సంసారాన్ని పోషించలేక పోవడం మూలాన, ఆయనకూడా దగ్గరే వుంటాడు కదా__అనే ఉద్దేశ్యంతో నేనిలా ఆయనతోపాటు పనిలోకి వెళ్ళాల్సొచ్చింది.

బద్ధకంగా వుండి ఆయనగారు పనిలోకి రానప్పుడూ, పనిలోకివచ్చిఎక్కడికన్నా వెళ్ళినప్పుడూ — నాలికలు చాపుకుంటూ, సుళ్ళుతిరుగుతూ మండుతున్న పొయ్యి దగ్గరగా కూర్చుని, ముఖంమీద





పడుతున్న వెలుగులో నావంకచూసి, వూరికినే నవ్వుతూ__ఏదో చెప్పలేక గుటకలు మింగుతూ—డబ్బులు గలగలలాడిస్తూ, ఏవేవో వ్యాపారం సంగతులు మాట్లాడేవాడు కొండయ్య.

వ్యాపారంలో ఎంత లాభమొస్తే నాకేం వస్తుంది? నష్టంవస్తే నేనేంఇస్తాను? ఎందుకు చెప్పినట్లు. ఎందుకు చేసినట్లు? ఆ మాటలవెనక ఏదో నిగూఢమైన రహస్యం వుందని, వాంఛలకోసం, కోరికలకోసం__నక్కవినయాలు, చిరునవ్వులు గల గల మంటున్నాయని హృదయంలో ఎవరో చెప్పారు.

* * *

ఆరోజు యిప్పటికీ బాగాగుర్తు. ఏ విధంగా మరిచిపోగలుగుతాను ?

సాయంకాలం అవుతూండగా లోపలికి పిలిచి__"ఏమంటావ్?" అన్నాడు కొండయ్య.

ఆయనగారు పుగాకు కోసం బజారుకు వెళ్ళారు. గదిలో ఒకమూల శనగలు బఠానీల బస్తాలు వున్నయ్. దగ్గరగా__ఖాళీసంచుల రాసులు చిందర వందరగా పడివున్నయ్. పక్కగదిలో వున్న బఠానీల పొయి తాలూకు పొగ గోడలనిండా అలుముకునివుంది. పై డాబాకడ్డీల మీద నుంచి, పొగచూరిన బూజు నల్లగా__దయ్యపు జుట్టులా, చింపిరి చింపిరిగా వేలాడుతూవుంది. పాకుతున్న మసక చీకట్లు సంధ్యకాంతుల్ని కౌగిల్లోకి మెల్లిగా లాక్కుంటున్నాయ్.

వంటరిగా, గదిలో __ కొండయ్య దగ్గరగా నిలుచున్ననాకు రైళ్ళు పరుగెత్తినట్లు గాబరాగలిగింది. ఆ గాబరాలో భయంలో ఆమాటలేమీ అర్థంకాలేదు. "ఏమిటీ?" అన్నానునవ్వుతూ.

వంటరిదాన్ని ఏమిచేయాలన్నా — ఎలానడవాలన్నా, అకస్మాత్తుగా కలిగిన పరిస్థితిలో నాకేమీ పాలుపోనేలేదు. నవ్వుతూ కొండయ్య వేపు చూసానేగాని-భయం తగ్గనేలేదు.

యింకేం- నేను నవ్వడం......పైగా వంటరిగా వుండడం, అన్నీ ఆయనకు అవకాశాలు కలిగించినయ్ లాగుంది. ఆ అవకాశాల్ని పురస్కరించుకుని - చప్పున చేయిపట్టుకున్నాడు.

అనకూడదు గాని యీ మగవాళ్ళకు ఎంతధైర్యం! ఎంతసాహసం! ఆడది వంటరిగా వుంటేచాలు - తమ ప్రతాపాల్ని, ధైర్యాల్ని సాహసాల్ని వెంటనే ప్రదర్శిస్తారు. అందుకనే ఎంతమంచి మగవాళ్లనైనా ఆడదనేది ఓకంటితో తప్పకుండా కనిపెడుతూ - జాగ్రితగా వుండాలి. ఆత్మార్పణచేసి ఆమోహంలోపడిపోకుండా తమని తాము రక్షించుకోవాలి.

వంటరిగా వున్న ఆడవాళ్ళను చూస్తున్న కొద్దీ, రెచ్చిపోయి విచ్చలవిడిగా సంచరించే యీబుద్ధి మగవాళ్ళకు ఎందుకు ఉండాలి ?

రోడ్డుమీద జనం - అడపా తడపా అటూ, ఇటూ తిరుగుతూనే వున్నారు. ఎవరైనా చూస్తారేమోనని గిజగిజ లాడిపోయాను. పిల్లా జెల్లతో సంసారం చేసుకుంటున్న నన్ను, వంటరిగా చూసి యీ విధంగా అడగడం- ఎప్పుడన్నా ఆయనకి తెలిస్తే- ఎన్ని బుర్రిలు బ్రిద్దలవుతాయ్! ఎంత గంద్రిగోళం జరుగుతుంది.

క్షేమన్నా వుందా? ఎవరన్నా చూస్తారేమో !

హృదయం గడగడలాడింది. గాబరాగా అన్నాను. 'వదలండి. ఎవరయినా చూస్తారు?' కంఠంలోంచి జాలీ, ఆవేదనా సంసారపు స్త్రీ బాధా - అన్నీ బైటకు వచ్చినాయి.

అంతకన్నా ఏంచేయాలో, ఏవిధంగా వేడుకోవాలో ఏమనాలో నాకేమీ తోచలా! ఏవిధమైన ఆలోచనాకలగలా.



ఎప్పుడైనా నేనిటువంటి వ్యవహారంలోకి దిగి వున్నట్లయితే- అంత భయపడేదాన్ని కాదు. చెడిపోయిన వాళ్ల అనుభవాల్నయినా కనీసం విని వున్నట్లయితే కొండయ్యలాంటి మగపురుగులు నలుగురిని బోల్తా కొట్టించేదాన్ని. ఇటువంటి వ్యవహారాలలో ఎంత మొండితనం-ధైర్యం వుండాలి! అనగూడదుగాని బుల్లెమ్మ నాకంటే ఎంతోచిన్నది. దానికెన్ని గుండెలున్నయ్! ఆతురకాడితో రామరామ-! ఆపాడు బుద్ధి దానికెందుకు కలిగిందో!- పైగా మొగుడితో ఎంతయిష్టంగా వుండేది!- నల్లని ముహం పెట్టుకుని ఆరామకోటి నాతో మాట్లాడుతూ వుంటే-దాని మొగుణ్ని నేను తినేస్తున్నట్టు-ఎంత అసూయతో చూసేది!.

* * *

ఆరోజు ఎందుకనో వూరంతా పండుగ చేసుకున్నట్లుగా వుంది. అందరూ ముస్తాబులు చేసుకొని సినిమాలకు వెళ్తూంటే ఆయనగారితో కలిసి, నేనూ, సినిమాకు వెళ్దామనుకునిబుల్లెమ్మ వస్తుందేమో కనుక్కుందామని వెళ్ళాను. ఎనిమిదిగంటలైవుంటుంది. ఆదొడ్లో - చెట్ల ఆకుల మీద వెన్నెల కురుస్తోంది.

రామకోటి రెండురోజులునుంచీవూళ్లో లేడు. పెనిమిటి లేకపోయినంతమాత్రాన బుల్లెమ్మ సినిమాకు రాకపోతుందా? అనుకుంటూ, వాళ్లగుమ్మంలో కాలుపెట్టాను. సన్నజాజులూ- సంపెంగి పూలూ తమ వాసనలతో ఉక్కిరి బిక్కిరి చేసినయ్.





తేలిక పడిన మనసుతో . మెల్లిగా లోపలకు వెళ్ళాను. నవ్వుల కిలకిలలు సన్నగా మూసుకు పోయినయ్.

విస్తు పోతూ ముందుకు చూసాను. దొడ్లోని నీళ్ళు పోసుకునే రాళ్లకుండీ దగ్గర బుల్లెమ్మ నగ్నంగా నిలబడివుంది. పక్కనేవున్న జామచెట్టు ఆకుల సందుల్లోంచి-కొమ్మల సందుల్లోంచి తెల్లని ఆ వొంటిని తాకుతూ-అవయవాల్ని తడుపుతూ వెన్నెలజారుతూంది. ఎత్తయిన ఆ వక్షస్థలాన్ని, మెడ వొంపుల్ని- నున్నగా మెరిసే మెత్తని శరీరాన్ని గుంటలుపడే బుగ్గల్ని, మెరుస్తున్న తెల్లని తొడల్ని దూరంగా నిలుచుని ఆతురకతనునవ్వుతూ వొళ్లంతా కళ్ళు చేసుకుని అదేపనిగా చూస్తున్నాడు.

తనవంటిమీద అధికారంవుండి—నలుగురిలో పుస్తెకట్టి పెళ్ళిచేసుకుని పోషిస్తుండే భర్తకుకూడా రహస్యావయవాలను చూపించేందుకు సిగ్గుపడే, భారతీయ స్త్రీలోకాన్ని గుర్తుకు తెచ్చుకోకుండా, ఆ బుల్లెమ్మ ఎంతయిదిగా—నగ్నంగా ఆ వెన్నెల్లో నిల్చుంది! పరాయి పురుషుడు తన అవయవాల పొందికను చూడడంలోనే ఆత్మ సాఫల్యం—మనో తృప్తి కలిగినట్లు—నవ్వుతూ, రెచ్చగొడుతూ నిలుచున్న బుల్లెమ్మ వాలకం—నా మనసు నెక్కడికో లాక్కుపోయింది.

మెల్లిగా దగ్గాను! — పాదాలతో చిన్నధ్వని చేసాను. ఏమీ లాభం లేకపోయింది. ఏదో ఆకర్షణకు లోబడిపోయి—తనను తానే మరిచిపోయినట్లు మైకంలోంచి తప్పుకోకుండా ఆబుల్లెమ్మ యింకా నిశ్చలంగా, నిర్మలంగా నవ్వుతూ వాణ్ని కళ్ళతోనే కొంటెగా పలకరిస్తోంది !

“ఆడది తొందరగా ఏపనీ చేయదు. చేసేందుకు తయారైతే, లోకం ఏమనుకుంటుందో ననిగాని, బంధువులు తనను గురించి బాధపడతారనిగాని ఆలోచించదు. లేకపోతే రుక్మిణీదేవి వ్యక్తిగతంగా తనకు తెలియని కృష్ణుడితో, వంశమర్యాదల్ని, కీర్తి అపకీర్తుల్ని లెక్క చేయకుండా పారిపోయేంతపని చేసేదే కాదు. ఎన్నెన్ని నాటకాలు ఆడుతుందో—సాధ్యంకాని పనుల్ని ఎంత చాకచక్యంగా నెరవేరుస్తుందో” అని అందరూ స్త్రీలని గురించి అనుకుంటుండే విషయం బుల్లెమ్మ ద్వారాగాని అనుభవంలోకి వచ్చిందికాదు.

నన్నుచూసే, చూడనట్లు నటించి— ఎవరూ అక్కడ లేనట్లుగనే, తనలాంటి స్త్రీ ముందు — నగ్నంగా ఓమగవాడి ఎదుట నిలుచుని ఆవెన్నెల్లో, తన అవయవాల్ని ప్రదర్శించడం ... చూస్తున్నకొద్దీ, ఎందుకో ఓవిధమైన లజ్జా, భయమూ కలిగినయ్. నిలుచోలేక గిరుక్కున తిరిగి వచ్చేసాను.

శరీరంలోని లాలిత్యమూ, కళ్లలోని కాంతీ, చేతులనునుపూ — కోమలమైన శరీరంతోపాటు సౌందర్యమూ, అవయవాల పొందికా, ఆడదానికి యీ ప్రకృతి ఎందుకని అంటగట్టిందో ఆరాత్రల్లా నాకు పెద్ద సమస్యయి పోయింది. అవగాహనే కాలేదు.

ఏమిటేమిటో ఆలోచిస్తూ, ఓదారి తెన్నుకు రాకుండా, అంతూ పంతూలేని అటువంటిసమస్యలతో నేరాత్రి గడిచింది.

ఆ మరునాడుకూడా రామకోటి యింటికి రాలేదు. తెల్లవారకముందే బుల్లెమ్మ కుర్రాణ్ణి వొదిలిపెట్టి వెళ్ళిపోయింది. పాపం ఆకుర్రాడు ఒకటే ఏడుపు! ఎవరున్నారు సముదాయించేందుకు? ముక్కుల మీద వేలేసుకున్నారు అంతా !

ఎంతవిపరీతం !...

వీధి వీధంతా గుసగుసలతో ఒకటే గోల ! ఎన్ని గుండెలున్నై దానికి ? పిల్లాణ్ణి చూడకుండా తనకు పుట్టనట్టే ఆ వెళ్ళిపోవడం......

* * *

గుర్తుకు వస్తున్నకొద్దీ, మనసు ఎలానో అయిపోయింది. గుండెలు టవ్వు టవ్వు మంటున్నాయి. ఏమీ పాలుపోవడంలా !

ఆ తురకాడు వొళ్ళంతా కళ్ళు చేసుకుని బుల్లెమ్మను చూసినట్లు__కొండయ్య అదే పనిగా నావైపు చూస్తున్నాడు. వంటిమీద బట్టలున్నా, చూపుల్లోని ఆ కాంతి శరీరానికి తగులుతూన్నట్లేవుంది. ఎందుకనో సిగ్గూభయమూ కలిగింది. అరిచేందుకుకూడా శక్తిలేక పోయింది.

హరికథల్లో చెబుతుండే భారతంలోని కీచకుడుకూడా ద్రౌపదిని యిలా ఒంటరిగాచూసి పట్టుకున్నాడు. ఆమె కాబట్టి వాడికంట్లో మట్టికొట్టి__మెల్లిగా తప్పుకుంది. నాకేమీ ఆలోచన పాలుపోలేదు. ఏమీ చేయలేక పోయాను.

కొండయ్యా, నేనూ__యిలా ఒంటరిగా ఉండడం, బజార్నుంచివచ్చి చూస్తే__నాబతుకు యింకేమన్నా వుంటుందా? మగవాడు కాబట్టి__వేసుకున్న తెల్లబట్టలూ క్రాపింగూ, డబ్బూ, నాగరికతా అన్నీ కొండయ్యకే సహాయం చేస్తాయి. నిజం చెప్పినా నామాటవినే దిక్కుండదు.

కొండయ్య యింకా అలానే చూస్తున్నాడు. చేతిని మెల్లిగా లాక్కుని "మళ్ళీ వస్తానండి" అన్నాను. ద్రౌపది కీచకుణ్ని మోసగించినట్లే నమ్మించి మోసగించేందుకు ప్రయత్నించాను. నామాటలు బైటికి వచ్చినవోలేవో, రొద్దుగుమ్మం తలుపులుమూసి "ఎక్కడికి వెళ్ళాక ? మళ్ళీవస్తావా?" నవ్వాడు కొండయ్య తన ఆశ ఏదో నెరవేరిందన్నట్లు. ఆనవ్వు నామనసుని మరింత క్రుంగదీసింది.

గుండెల్నిండా__ఏదో తెలియని భయం నిండిపోయింది. ఏడుద్దామనుకున్నాను. కానీ_కంఠంరుద్ధమైపోయింది. అరిచేందుకూడా మాటపెకిలి రాలేదు. కేకలుపెట్టి గోలచేసినా, నామాటల్ని నమ్మే ప్రపంచమే అయితే _ ఎప్పుడో, ఎక్కడో అప్పుపుట్టేది. పిల్లాడికి కావాలసినవి కొని వాడికోరికలు నెరవేర్చే దాన్ని !_మాటలకే కట్టుబడిన ప్రపంచమే అయితే, యిన్ని కోర్టులూ, యింతమంది ప్లీడర్లూ, యీ పోలీసులూ వుండేవారు కారు. భగవంతుడనుకొని మానవలోకమంతా పూజిస్తున్న శ్రీరాముడు సీతను అగ్నిలో దూకమని, నలుగురిలానే ఎందుకు గోలచేస్తాడు ? ఎన్నోయుగాల్నుంచీ దొర్లుకుంటూ వస్తున్న యీసాంప్రదాయం ఒక్కసారిగా మాయమై పోతుందా !

"నువు గోలచేసినా నమ్మరుసుమా ? డబ్బుతీసుకొని, నమ్మించి_యిలా చేస్తున్నా వంటాను. రావడంతోనే మీఆయనకి ముందు చెబుతాను. బాగా ఆలో





చించుకో ! నువెన్ని చెప్పినా లాభం లేదు. నువ్వే ఆలోచించు నీ మాటలు నమ్ముతాడో, నామాటలు నమ్ముతాడో! గోలచేసుకున్నావంటే అందరికీ నువ్విటువంటి దానివని తెలిసి పోతుంది. నీమర్యాదని నువ్వే పోగొట్టుకుంటావ్__గోలపడి పోతావ్" అన్నాడు కొండయ్య.

నామనసులో అనుకుంటున్న మాటల్నే ఎంతనేర్పుగా కనుక్కుని బైటపెట్టగలిగాడు !

నా భవిష్యత్ జీవితాన్ని గురించి__ నాకంటే ఏంతో జాగ్రతగా ఆలోచించి చెప్పాడు. ఆమాటలకోవిధమైన హెచ్చుతగ్గులు ఏర్పడేట్లయితే, సంసారమనేది పోగొట్టుకోవడమటుంచి - ఎంతహీనంగా అమర్యాదగా బతకాలో, ఎన్నిఇబ్బందులూ, కష్టాలూ పడాలో ఒక్కసారి నా ముందు మెదిలినయ్. కొండయ్య చెప్పినట్లుగానే పరిస్థితులుఏర్పడుతాయ్ కామోలు! జీవితంలో సుఖదుఃఖాలు తారుమారవుతాయనే దృష్టాంతరం యీ క్షణాన, యీ విధంగా అనుభవంలోకి వచ్చింది.

"నామాటనమ్ము. యీఇరవై రూపాయలు తీసుకొని మంచి చీరకొనుక్కో. పిల్లలకి తర్వాత నేనింకొకసారి బట్టలు కుట్టిస్తాను. లోకంలో సామాన్యంగా జరిగే విషయంపట్ల నువ్విలా భయపడి చేతులారా నాశనం చేసుకోవడం మంచిది కాదు సుమా."

తెరమరుగున జరిగే రహస్యమైన విషయాలపట్ల__ఆడవాళ్ళను గురించి ఎంత తేలిగ్గా తనఅభిప్రాయాన్ని బైటపెట్టాడు చదువుకుని__వ్యాపారంచేస్తూ యింతో అంతో విజ్ఞానాన్ని సంపాయించుకున్న యువకులు, దేశాన్ని_సంఘాన్ని, స్త్రీలని డబ్బు గర్వంతో_ఎన్నో విధాల పాడుచేస్తున్నారనేందుకు కొండయ్య ప్రబల సాక్ష్యంగా నిలబడ్డాడు !

డబ్బుకు ఆశపడేరకమన్నట్లుగా పైకం యిస్తానంటూ ఎంత ఆశ చూపెడుతున్నాడు ! కష్టపడాలిగాని కొండయ్య యిస్తానంటూ చేతిలోపట్టుకున్న ఆఇరవై రూపాయలు వారంరోజుల్లో ఆయనగారూ నేనూ సంపాయించుకో గలుగుతాం !

'చాలాదూరం ఆలోచించు. యిరవై రూపాయలంటే మాటలు కాదు. ఎన్ని రోజులు కష్టపడాలో, ఎంతచాకిరీ చేయాలో గుర్తుంచుకో'

డబ్బే- మానవుడి జీవితాన్ని తారుమారు చేస్తున్నదన్నట్లు- డబ్బు మొహంతనేచూచినట్లు ప్రవర్తిస్తూ చెబుతున్న ఆ వాలకాన్ని చూస్తున్నకొద్దీ వొళ్లు మండిపోయింది.

బైటికి పోవడానికి వీలులేకుండా, నా జీవితాన్ని, కర్తవ్యాన్ని చేతులో పెట్టుకున్నట్లు తనేదిక్కున్నట్లు ఎంత తేలిగ్గా, నిర్లక్ష్యంగా మాట్లాడాడు!

దూరంగా వున్న బతాణీల పొయ్యలోని నిప్పుకణాలు, మంటలు చల్లారిసా- ఎర్రగా చూస్తున్నాయ్. మూలగా పేర్చివుంచినపచ్చిబతాణీలబస్తాలూ, తెల్లపోతూ వెర్రిగా చూస్తున్నట్లున్నయ్. మనసంతా గిజగజ లాడి పోయింది.

'ఏమంటావ్ ?' మళ్లీ అడిగాడు కొండయ్య

ఏవిధంగా నమ్మిద్దామని చెప్పినా, నామాట లెందుకూ పనికిరానివై గాలిలో

కలిసి పోతున్నాయ్. ఎంత ప్రార్థించినా వేడుకున్నా- నా ఆవేదనా, బాధా- అతన్ని ఏమీచేయక పోయినయ్.

'నామాట వినవా !' ఆ కంఠంలో ఎంతో గంభీరత తొణికిసలాడింది. చలనం లేకుండా అదే విధంగా చూస్తూ, కొండయ్య నిలుచున్నాడు. ఆ కంఠంలోనుంచి తొంగిచూసే తీవ్రతా, కళ్లల్లోని ఎరుపూ-వ్యంగ్యపు నవ్వూ - హృదయంతో పాటు శరీరాన్ని గజగజ లాడించినయ్. జాలిగా-బాధగా కళ్లనిండా నీళ్లు తెచ్చుకుని అతనివేపు చూసాను. నవ్వాడు.

కేకలు వేసి- నలుగుర్నీ పిలిచి గోల చేస్తే, అందరి దృష్టుల్లోనూ హీనంగా చూడబడతానేమోనని ఒకవంక అనుమానం!- ఆయనకి తెలుస్తుందేమో అని ఒక భయం. ఏమీచేయలేక పోయాను.

ఒంటరిగా ఆగదిలో చిక్కుపడడం, సమయానికి అక్కడ ఎవరూలేక పోవడమూ, జాలిగా కరుణగా వేడుకున్నా, బతిమాలుకున్నా, వినక బెదిరించడమూ- అక్కణ్ణుంచి బైటపడలేక పోవడమూ, యివన్నీ చేతకాని నాఅసమర్థతను వెల్లడి చేసినయ్.

ఆలోచిస్తూ నిలుచున్నకొద్దీ, సిగ్గుతో మరింత క్రుంగి పోయాను.

'అనవసరంగా టైం గడిచి పోతుంది' అంటూ కొండయ్య దగ్గరికి వచ్చాడు.

ఏమీ వినిపించలేదు. వణుకుతున్న గుండెలతో తలవంచుకున్నాను. అయిదునిమిషాలు గడిచినయ్.

మాట్లాడకుండా నిలుచున్న నామౌనాన్ని అంగీకారంగా తీసుకుని దగ్గరకువచ్చి యినప సమ్మెట చేతులతో హృదయానికి గట్టిగా అదుముకుని, పెదిమల్ని బుగ్గలకి తాకించాడు. మూర్ఛవచ్చినట్లయింది.

నాకు మళ్ళీ ఒళ్లు తెలిసేప్పటికి అక్కడెవరూ లేరు. నా ప్రక్కను మాత్రం రెండు కొత్త పదిరూపాయల కాగితాలు గాలికి రెపరెపమంటున్నాయ్ !







# స్వప్నసీమ

రచన : గిరీంద్ర శేఖర్ బోస్

ఇక ప్రస్తుతం మనం విశదీకరణ చేస్తున్న యీ కలవిషయంలో తండ్రీ కొడుకుల వైరానికి ప్రాధాన్యతవుంది. ఇది జీవశాస్త్రంలో అనాదినుంచీ వొస్తున్న స్వాభావిక వైరమే. మరీ ఏనుగుల్లోనూ, కోతుల్లోనూ యీ వైరం చాలా ఎక్కువగా, స్పష్టంగా కనిపిస్తుంది. యీ జంతువుల్లో ఏదో వొక్కటే మగజంతువు ఆడజంతువులన్నిటికీ నాథుడుగా, పాలకుడుగా ఉంటుంది. తమ మగపిల్లలు పెద్దవికాగానే వాటికి ఆ మందలో మరి తావులేకుండా పెద్దమగజంతువు తరిమికొడుతుంది. ఒక విధమైన పోటీతో యీర్ష్యతో ఇది జరుగుతుంది.

చరిత్రనుచూస్తే తండ్రిమీద తిరగబడి, అతన్ని బంధించో, చంపో, సింహాసనాన్ని ఆక్రమించిన కొడుకులు చాలామంది ఉన్నారు. కొడుకు పెద్దకావటంతోటే ఆలస్యంగా ఒకరకం వైరం ఇద్దరిహృదయాల్లోనూ కనిపించకుండానే రగులుకుంటుంది. అది సింహాసనానికి కావొచ్చు; లేదా ఇంకో ఆశతో కావొచ్చు. ఒకే స్త్రీ ప్రేమను రెండుదృక్పథాల్లో ఆశించిన తండ్రికొడుకుల మధ్య యీర్ష్య కావొచ్చు. సామాన్యంగా ఒక తరానికీ ఇంకోతరానికీ ఎన్నో అభిప్రాయ భేదాలుంటవి. వాటిల్లోని విచక్షణాజ్ఞానం, ఏదిమంచో, ఏది చెడో అనేదాన్ని ఎవరూ ఆలోచించరు. తండ్రి వెనుకటి తరంవాడుగానూ, కొడుకు ప్రస్తుత తరంవాడుగానూ ఉంటారు. తండ్రి, కాలంతోపాటు సాగిరాలేక, జీవితంలో ఎక్కడో ఆగిపోయి, మరి మార్పులేకుండానే ఉంటాడు. కాని కొడుకు నవ్యమార్గాల్లో పెరిగి కొత్త సంస్కారానికి అలవాటవుతాడు. దీన్ని యే తండ్రీసహించడు. పాతకాలం మనిషైన తన తండ్రి మారక పోవటాన్ని యే కొడుకూ సహించడు. ఇది లోక చరిత్రకు ఒక సర్వసామాన్య ఘట్టమని చెప్పవొచ్చు.

ఎదుటపడి తండ్రిని చంపటం, లేక బందీగా పట్టుకోవటంలో — తండ్రిమీద కొడుక్కున్న వైరం వ్యక్తమవుతూ వుంది. ఆ కోర్కె అవ్యక్తావస్థలో వుండలేక కట్టలు తెంచుకొని బైటపడిం దనవొచ్చు.

యీ సంగతి కలగన్న వ్యక్తికి చెప్పినప్పుడు చాలావరకు అతను తృప్తిపడ్డాడు. "లోగడ ఒకసారి తండ్రి చనిపోయినట్టు నాకు కలవొచ్చింది" అన్నాడు. "దగ్గరి బంధువులు చనిపోయినట్టు కలలు ఎందుకు వొస్తవి?" అనికూడా అడిగాడు.

కొంతమంది పాఠకులకు ఒక అనుమానం కలగవొచ్చు. యీ సంఘటనలన్నీ ప్రమాదవశాత్తూ సరిపోకూడదా? దానిక్కూడా అవకాశం వున్నదికాని, ఒకవ్యక్తి కన్న కొన్ని కలలను వరసాగ్గా విశదీకరణ పద్ధతినిచూస్తే ఇలాటి సత్యాలు బైట పడక మానవు. అంత అకాత్తుగా ఏ అభిప్రాయమూ మనసులో మెరవదు; దీనికి తార్కాణంగా అకాత్తుగా జరిగే సంఘటనల విషయంలో మానవుడు ఏవిధమైన చలనాన్నీ వెనువెంటనే ప్రదర్శించలేడు. వున్నట్టుండి పాముకనిపిస్తే, కర్రతీసుకొని దాన్ని చంపాలనికానీ, కనీసం ప్రాణరక్షణార్థం ఆ ప్రదేశంనుంచి పరుగెత్తాలని కానీ ఎవరికీ తోచదు. నిశ్చలంగా కొన్నిక్షణాలపాటు వుండి పొయ్యాక, అకాత్తుగా సంభవించి సంఘటనకు మానవుడు adjust అయ్యాకకానీ అన్ని అంగాలూ స్వాధీనం లోకిరావు. కనుక ప్రతి అభిప్రాయానికీ ముందు కొంత పరిసర వాతావరణం కారణమై తీరాలి. భయపడదగ్గదేదీలేకుండా, భయపడట మనేది ఎలా వుంటుంది?

'ఎ' అనే వ్యక్తికోర్కె అతని తండ్రిమృతి నొందటం. కాని అది నిత్య జీవితంలో సాధ్యంకానిది. దాన్ని ప్రభుత్వమూ, సంఘమూ ఒప్పుకోవు. మానవుడి నైతిక వర్తనమూ, సంఘమూ, ఒప్పుకోవు. మానవుడి నైతిక వర్తనమూ, అంతరాత్మ ఎదురు తిరుగుతవి కనుక అది అవ్యక్తావస్థలోనే వుండి, వ్యక్తావస్థ నిద్రిస్తూన్న సమయంలో దొంగ చాటుగా కలలో ఆ కోర్కె తీరేందుకు ప్రయత్నించింది.

ఐతే యీ విధంగా అవ్యక్తావస్థలోని కోర్కెలేనా, లేక వ్యక్తావస్థలోని కోర్కెలుకూడా కలలో తీరేందుకు అవకాశంవుందా? వ్యక్తావస్థలోని కోర్కెలు ఒక కొత్త రూపంలో, ఇంకో కోర్కెతోనో, ఇతర పరిసరాల్తోనో కలిసితీరేందుకు ప్రయత్నిస్తుంది. వ్యక్తావస్థలో కూడా మానవుడి కోర్కెలన్నీ తీరవు. క్రమంగా నిరాశతో అవి అవ్యక్తావస్థలోకి వెళ్ళవలసినవే. ఇవే ఇంకో విధానంలో కలలో ప్రత్యక్షమౌతవి.

కోర్కెలయొక్క వ్యక్తావస్థ రకరకాలుగా, ఎక్కువ తక్కువ బలాలను సూచిస్తూంటుంది. కోర్కె తీరే రెండు విధావాలు స్పష్టంగా ఉన్నప్పుడు అది వ్యక్తావస్థలోనే ఉంటుంది. అవ్యక్తావస్థలో మరుగు పడాల్సిన ఖర్మం దానికి పట్టదు. మన మామూలు దినచర్యలలోని అలవాట్లన్నీ వ్యక్తావస్థలోనే ఉండి మనం గమనించకుండానే తమ పనిని చేసుకుపోతవి. ఉదాహరణకు ఉదయానే మొహం కడుక్కోవటం, కాఫీతాగటం మొదలైన అలవాట్లు మనప్రయత్నం లేకుండానే జరుగుతవి; అందుకని అవి అవ్యక్తావస్థలో ఉన్నవనేందుకు వీల్లేదుకదా!

ఉద్రేకానికి గురై చేసేకొన్ని పనుల విషయంలో అవి అవ్యక్తావస్థలోనే ఉండి, పెరిగి పెద్దవై ఒక నిర్దుష్టరూపాన్ని దాల్చి వ్యక్తావస్థలో బైటపడుతవి. ఉదా





హరణకు పిల్లవాడు చేసే చిలిపి పనులకు క్రమంగా ఉద్రిక్తుడై కోపాన్ని ఇక ఆపలేక కుర్రాణ్ణి కొట్టటం. ఇందులో ఆ కొట్టటం అనేది కావాలని చేసిందే. అది వ్యక్తావస్థలోదే. కాని దాని పునాది, పెరుగుదలా అవ్యక్తావస్థనుంచే వొచ్చినవి. మరికొన్ని సందర్భాల్లో కోర్కెతీరే అవకాశం లేకనో, కాలం గడిచినకొద్దీ అది పాతబడిపోయో క్రమంగా అవ్యక్తావస్థలోకి వెళ్తుంది. దాన్ని గూర్చిన జ్ఞాపకం— ఏదోవిషయాన్ని తలుస్తూన్నప్పుడు తప్పరాదు. యాదాలాపంగా చేసే పనులు, అన్యమనస్కంగా ఉండి చెప్పే జవాబులూ వ్యక్తావస్థనుంచి పూర్తిగా మాయమైన వేనని చెప్పొచ్చు. ఒకపని చేశామంటే, అది ఎందుకు చేయవలసి వొచ్చిందో, దాని తాలూకు కోర్కె ఏదో తెలుసుకునేందుకు విశదీకరణ పద్ధతి అత్యవసరం. ఒక్కొక్కప్పుడు కోర్కెకూ చేసిన పనికీ సంబంధమే లేనట్టు తోస్తుంది కానీ జాగర్తగా పరిశీలిస్తే ఆ 'లింక్' అంతా తెలుసుకుంటే సత్యం బైటపడుతుంది.

అన్యమనస్కంగా మాట్లాడిన మాటలకు ఇంకోరు హెచ్చరిక చేసినప్పుడు, అలా ఎందుకు మాట్లాడవలసి వొచ్చిందో జాగర్తగా విచారిస్తే దాని తాలూకు ఉద్దేశం ఏది మనలో పనిచేస్తూవుందో గుర్తుకు తెచ్చుకుంటే ఆ రహస్యం తెలుస్తుంది. ఉదాహరణకు భోజనంచేస్తూ ఏతీపిపదార్థమో వడ్డనకు వచ్చిందనుకుందాం: అదే సమయంలో భుజించేవ్యక్తి మనసు ఏరైలు టిక్కెట్ కొనే కిటికీదగ్గరో వున్నదనుకుందాం. ఆవ్యక్తి చప్పున 'ఒక్కటే' అంటాడు. వడ్డించేవాడు ఒకటి వేస్తాడు; ఇది ప్రమాదవశాత్తూ సరిపడ్డా, నిజానికి ఆవ్యక్తి అవ్యక్తావస్థలోని కోర్కె వేరు. వ్యక్తావస్థలో దాన్ని బైటపెట్టే విధానం వేరుగా ఉండిపోయింది.

ఇలాటి అవ్యక్తావస్థలోని కోర్కెలెన్నో కలలలో తీరుతూంటవి. ఇందాకటి సందర్భంలోని 'ఎ' తాలూకు తండ్రిచావు ఇలాటికోర్కె. తనకున్న బాకీలవిషయాన్ని మరిచిపోలేని ఒకపెద్దమనిషి చాలాసార్లు తన బాకీల్ని తీర్చటాన్ని మరచిపోవచ్చు; అది అన్యమనస్కంగా ఉండడంవల్ల సంభవించేది. ఇక్కడ ఇంకోరకంగా చెప్పుకోవొచ్చు. వ్యక్తావస్థలో ఆపెద్దమనిషికి బాకీలు ఎగేద్దామని లేకపోయినా, అవ్యక్తావస్థలో ఆకోర్కెవుంది. అది ఉండిఉండి యీరూపాన బైటపడుతుంది; చాలామంది పెద్దమనుషులు దీన్ని ఒప్పుకోరు కాని ఇదిమాత్రం నిజం! తనకు బాకీ సంగతి జ్ఞాపకమే లేనట్టు నటించేరకంకూడా ఇందులోనే జేరుతుంది. ఇలాటిదానికి ఆ పెద్దమనుషులు అనేక కారణాలు చెపుతారు. ఏదో పని తొందరలో మరిచి పొయ్యాననటం సర్వసామాన్యం. ఆ కారణం ఒక విధంగా పనిచేయవొచ్చు; పని తొందర బాకీ సంగతి మరిచిపొయ్యేట్టు చేసినప్పటికీ, బాకీని జ్ఞాపకం వుంచుకునేందుకు అడ్డం పడలేదు. పనివుండికూడా జ్ఞాపకం వుంచుకోవాల్సిన బాధ్యత యెవరికైనా వుంది కదా! అలా జ్ఞాపకం వుంచుకునేవారూ వున్నారు! యీ విధంగా, అవ్యక్తావస్థలో మరుగుపడ్డకోర్కెను, వ్యక్తావస్థలోని క్రియసహాయంతో బైటికి లాగవొచ్చు.

మామూలువ్యక్తిలోని అవ్యక్తావస్థలోని కోర్కె తనపనిని నిర్వర్తించుకొనేందుకు అనేక రకాలుగా పనిచేస్తుంది. షెల్లీ అనే మహాకవి తగిన జాగ్రత్తతీసుకోకుండా సముద్రంలోకివెళ్ళి మునిగిపోయ్యాడు. చద్దామనే కోర్కె అతనికిలేదు. అందుకని ఇది పూర్తిగా ప్రమాదమనేందుకు వీల్లేదు. అవ్యక్తావస్థలో ఆత్మహత్య చేసుకుందామనే కోర్కె. ముందుజరిగే దానికి లెక్కచేయకుండా తొందరపడిచేసే పనులన్నిటికీ అవ్యక్తావస్థలో యెంతో సహాయం వుండివుండాలి. అవ్యక్తావస్థలోని కోర్కెను వ్యక్తావస్థలోని ఇంకోకోర్కె అటకాయించినప్పుడు — వ్యక్తావస్థలో భయంఏర్పడి, కోర్కెబదులు భయం మిగులుతుంది. అవ్యక్తావస్థలో చద్దామనే కోర్కెను, వ్యక్తావస్థలో బతుకుదామనేకోర్కె అటకాయించినప్పుడు చావును గూర్చిన పెద్దభయం వుండిపోతుంది. ఆత్మహత్యలుచేసుకునేవారి విషయంలో— అవ్యక్తావస్థలోని ఆకోర్కె క్రమంగా బలమై ఏదోకాస్త సందు చూసుకొని వ్యక్తావస్థలోకి ఎగిరిదూకి తీరేందుకు ప్రయత్నిస్తుంది.

ఇప్పుడు 'కోర్కె'ల్ని మూడు భాగాలుగా చేయవొచ్చు;

1. వ్యక్తావస్థలోనికోర్కె : మనకు స్పష్టంగా తెలుస్తూంది, మనం క్షణక్షణమూ అనుభవిస్తూండేకోర్కె.
2. వ్యక్తావ్యక్తమైన కోర్కె : ఏదో కోర్కె అవ్యక్తావస్థలో వున్నప్పటికీ వ్యక్తావస్థకు అందుబాటులోనే వుండేది. కొద్దిప్రయత్నంతో దాని వునికిని కనిపెట్టవొచ్చు.
3. అవ్యక్తమైన కోర్కె : లోలోన ఎక్కడో వుండిపోయినకోర్కె. దాని సంగతి అసలు తెలియనే తెలియదు. మనస్తత్వ విశదీకరణతో మాత్రమే దాన్ని కనుక్కోవచ్చు. లేదా వుండి వుండి జీవితంలో ఎప్పుడో అది వ్యక్తావస్థలోకి రావొచ్చు.

మొదటి రెండురకాలకోర్కెలే స్వప్నానికి పునాదులు. వాటిమీద మొదలైన స్వప్నం - అవ్యకావస్థలో కోర్కెల్ని తీర్చటంలో అంతమవుతూంటుంది.

అవ్యక్తావస్థలోని కోర్కె బైటపడేమార్గాలు ఎన్నో ఉన్నవి. బాహాటంగా బైటపడి ఆకోర్కె వెంటనే తీరేందుకు వీల్లేదు. ఎందుకంటే అవ్యక్తావస్థలోని కోర్కె సర్వసామాన్యంగా సంఘానికీ, నీతికీ విరుద్ధమైంది కనుక ! నైతికంగానూ, సాంఘికంగానూ ఏర్పడ్డ నిబంధనల తాకిడికి తట్టుకోలేక అజ్ఞాతంగా అవ్యక్తావస్థలోకి జోరబడుతుంది. ఎప్పుడన్నా పైకిరావాలని ప్రయత్నిస్తే వ్యక్తావస్థలోని నీతి, నియమం దాన్ని మళ్ళీ లోపలికి తోసేస్తూవుంటుంది. ఐతే ఇక్కడ వ్యక్తావస్థ ఇంత పని చేస్తూ వున్నదనే విషయం మనకు తెలియదు. అదిదానంతటదే జరుగుతుంది.

ఇది ఎప్పుడైతే సాధ్యంకాదో అవ్యక్తావస్థలోని కోర్కె తనతీవ్రతను తగ్గించుకొని రూపాన్ని మార్చుకొని వొస్తుంది. అప్పుడు ఆ 'కోర్కె' నైతిక, సాంఘిక విరు





ద్ధంగా ఉన్నదా లేదా అనే అనుమానం వొస్తుంది; లేదా ఏఅనుమానాలూ లేకుండానే సామాన్యమైన కోర్కెకింద చలామణీ అవుతుంది.

లోగడ మనం విశదీకరణచేసిన కలవిషయంలో - 'ఎ' తాలూకు వ్యక్తావస్థ అవ్యక్తావస్థలోని కోర్కె - అతని తండ్రి మరణాన్ని పైకి రానీయకుండా తొక్కిపారేసింది. అందుకని ఆకోర్కె దొంగచాటుగా కలలో తీరింది. అదీకాక దాని రూపం వేరు. 'ఎ' తండ్రి మరణాన్ని కోరినాకోరకపోయినా ఆమరణం దానంతటదే ఏదో ఒకప్రమాదంలో సంభవించింది. దానికి 'ఎ' బాధ్యత ఏమీలేదని సామాన్యులు అభిప్రాయపడతారు. కాని అతని తండ్రి చావు స్వభావ సిద్ధమైనదికాదు. 'ఎ' తాలూకుకోర్కె తృప్తి పొందేందుకుగాను అన్వేషించుకొన్న ఒకమార్గం.

ఇలాటి మార్గాలు అనేకం ఉంటవి. ఉదాహరణకు: మధుమేహంతో బాధపడే ఒకరోగి ఉన్నాడు. • డాక్టర్ అతన్ని పంచదార ముట్టకూడదని ఆజ్ఞాపించాడు. ఇప్పుడు రెండురకాల కోర్కెలు అతనిలో యుద్ధంచేయ సాగుతవి: ఒకటి కొన్నాళ్ళపాటు ఆరోగ్యవంతంగా బతుకుదామనే ఆశ - ఇది పంచదార జోలికి పోనీయదు. రెండు: తియ్యటి పంచదారను రుచిచూసే భాగ్యం తనకులేదు. ఎలాగైనా ఆరుచిని చూడాలనే ఆశ.ఇలాటిరోగి యీకింద చూపిన ఏదో వొక విధానంలో ప్రవర్తించవొచ్చు.

1. డాక్టర్ ఆజ్ఞను అతిక్రమిస్తూ పంచదార తిందామని నిశ్చయించుకోవటం, ఇక్కడ అనుభవిద్దామనేకోర్కె, ఆరోగ్యాన్ని కాపాడుకుందామనే కోర్కెను జయించింది. శారీరకంగా ఒకబలం ఇంకో బలాన్ని ఏలా జయిస్తుందో, మానసికంగా కూడా ఈ ఎక్కువ తక్కువలూ, ఒకదానితో ఒకటి పోట్లాడి గెలవటాలూ, ఓడటాలూ వున్నవి. ఆ ఓడిపోయినకోర్కె వ్యక్తావస్థలోనుంచి పారిపోయి అవ్యక్తావస్థలో దాక్కుంటుంది.

2. పంచదార తిందామనే కోర్కెను నిరోధించలేనిరోగి, తన ఇంట్లో పంచదారను వాడకుండా వుండే ఏర్పాటు చేస్తాడు. తనతోపాటు ఇంటిలోని ఇతరకుటుంబీకులక్కూడా పంచదారవాడే అవకాశం లేకుండా పోతుంది. యీ సందర్భంలో పంచదారపట్ల బలమైన నిరాకరణ—బలమైన కోర్కెను సూచిస్తున్న విషయం గమనించ దగ్గది.

3. ఎక్కడో విందుసందర్భంలో మరిచిపోయి అన్యమనస్కంగా వుండటం వల్ల తీపిపదార్థాల్ని తినేశాడు. ఇక్కడి 'అన్యమనస్కత' పంచదార తినాలనే కోర్కెకు విరుద్ధమైంది మాత్రంకాదు. నిషేధాన్ని ఒకవిధంగా తొక్కిపట్టింది.

4. మాటిమాటికీ పంచదార తినాలనే కోర్కెను బలవంతాన ఆపుకుంటూండటంవల్ల చిరాకు, కోపమూ కలిగి అది ప్రతివిషయంలోనూ ప్రతివ్యక్తిమీదా వృధాగా ప్రతిఫలిస్తూండటం.

5. ఏదోవిధంగా కొంత మనశ్శాంతిని సంపాయించుకునేందుకు కొత్తరకం ఆలోచన చేస్తాడు: ఇంతా ఏడుస్తే వెధవ పంచదార తినకపోతే ప్రాణంపోదు. అదే కావాలని ఏమిటి—దానిబదులు ఆరోగ్యాన్ని పాడుచేయనివి ఏవన్నా తింటే సరిపోతుంది.

6. పంచదారకుబదులు 'సాక్రిన్' కానీ తియ్యనిపళ్ళుకానీ తిని తృప్తిపడటానికి అలవాటు పడతాడు. యీ ప్రత్యామ్నాయంగా వుండే ప్రతివస్తువూ అసలు వస్తువుగుణగణాల్ని చాలావరకు పంచుకొనే వుంటుంది — లేకుంటే అది అనవసరం! కనుక ఆమానవునిలోని అసలుకోర్కె రూపం మాసిపోయిందనేందుకు వీల్లేదు.

పై ఉదాహరణలన్నిటిలోనూ పంచదారను నిరోధించిన కోర్కె ఏదో ఒక రూపాన దూసుకొని బైటపడడం గమనించదగ్గది. పంచదార కావాలనే కోర్కె చాలాబలమైంది. అందుకనే బలమైన నిబంధనలు అవసరమయినవి. ఇతర ఆలోచనల్లో-కాల్పనిక సంఘటనలతో రోగిమనశ్శాంతిని సంపాదిస్తున్నాడు. ఉదాహరణకు-

7. నిజంగా పంచదార తీసుకొనే అవకాశంలేదు. అందుకని రోగి కళ్ళు మూసుకొని తను పంచదారను తింటూన్నట్టు భావించి తృప్తిపడతాడు. పడకకుర్చీలో పడుకొని అట్లాగే నిద్రపోయి కనే పగటికలలు యీజాతికి చెందినవే!

8. పంచదార తింటూన్నట్టు ఆలోచించటానిక్కూడా రోగికి భయమైతే - 'సాక్రిన్' కానీ తియ్యటిపళ్లుకాని తింటూన్నట్టు ఆలోచించుకుంటాడు. ఏదోఒక రూపంలో ఆతీపి తగలాలి.

9. యీవిధమైన నిరోధం ఇంకా బలంగాఉంటే తీపి పదార్థాల్ని కాకుండా కారపు పదార్థాల్ని మాత్రమే తింటున్నట్టు ఊహించుకుంటాడు.

10. ఇంకో విధానంలోకూడా తృప్తి కలగొచ్చు. తను పంచదారతినటం మానేసి ఇతరులచేత తినిపిస్తూ ఆనందించటం. తన కోర్కెను ఇతరులద్వారా తీర్చుకోవటం, తనే ఆపని చేస్తున్నట్టు భావించుకోవటం. ఇతరులు తనకన్న ఆనందంగా ఉన్నారు; వాళ్ళనుచూసి యీర్ష్యపడటానికి మారుగా, వారి ఆనందంలో పాలు తీసుకోవటం. ఇది ఎలాటిదంటే - నవలలోని నాయకుడికి కానీ, నాయకికి కానీ కలిగే కష్టాలు పాఠకుడు తనవిగా భావించి తగినట్టు ఫీలవటం; వారి ఆనందానికి తనూ ఆనందపడటం!

11. పంచదార తిందామనే కోర్కెను జయించేందుకుగాను రోగి కొత్తరకంగా ఆలోచించటం - పంచదార చప్పన దొరికేదికాదు - బజారుపోయి నానాఅవస్థాపడి రేషన్ కార్డుమీద తీసుకురావాలి. అదీకాక అది ఉప్పులాగు చౌకబారు సరుకుకాదు. కనుక సామాన్యంగా బతికే తను దాన్ని వొదిలెయ్యటమే మంచిది. ఇది నక్క-'పుల్లద్రాక్షలు' లాటి మన స్తత్వం.





12. పంచదార తియ్యగా ఉన్నంత మాత్రాన తినటం మొదలెడితే మామూలు వ్యక్తి ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది; అనేకరకాల జబ్బులకు అది కారణభూతమౌతుంది. దానివల్లకలిగే చెడుగుల్ని చిలవలు పలవలుగాఊహించి దాని జోలికి పోవటంలో ఏదో పెద్ద ప్రమాదం వున్నట్టు భావించి కొంతవరకూ చలించే మనస్సును కట్టేసేందుకు ప్రయత్నించటం. స్త్రీ జోలికి పోకుండా వ్రతం పట్టిన బ్రహ్మచారులూ మతప్రచారకులూ—స్త్రీ శక్తిఅనీ, కాళీఅనీ, సమస్త పాపాలకూ నిలయమనీ ప్రచారం చేయటం లాటిది యీజాతికి చెందిందే.

13. పంచదార ఆరోగ్యానికి మంచిది కాదనే విషయంలోని ఆలోచనలు మాటిమాటికీ వొస్తుండటంవల్ల వాటిమీద ఒకవిధమైన నమ్మకం కలుగుతుంది. నిజానికి అది అపనమ్మకమనే చెప్పవొచ్చు. దాన్ని ఇంకా బలంగా చేసుకునేందుకు ఇతరులకు ప్రచారం చేయవలసిన అవసరపడుతుంది. అందుకని తనస్నేహితుల్లో పంచదార కాస్త ఎక్కువగా వాడేవాళ్ళదగ్గరకు పనికట్టుకొని వెళ్ళి వాళ్ళకు దాని చెడుగుల్ని గూర్చి నూరిపోయటం. వారిని ఎలాగైనా ఒప్పించేందుకు ప్రయత్నించటం. తన బాధను ఇతరులక్కూడా పంచి కొంత తేలికపడేందుకు మానవుడుచేసే ప్రయత్నం ఇది!

14. యీ పంచదారను ఎలాగైనా వొదిలించుకోవాలి. అందుకని దాన్ని తన ఇష్టదైవానికి అర్పితంచేస్తాడు. యే కాశీలోనో విశ్వనాథుడికి వొదిలేసి వొస్తాడు. మతైకమైన నమ్మకాలు పంచదారకు అంటగట్టబడటంవల్ల అదంటే ఒకవిధమైన బెరుకు—దేవుడికి అర్పించినందువల్ల దానికొక పవిత్రత అపాదించబడి కొంతదూరాన ఉంచేందుకు ప్రయత్నిస్తవి.

15. తనవలెనే మరికొంతమంది రోగులు పంచదార జోలికి పోకుండాఉన్నారు. ఎంతోమంది బీదలకు అదిలభ్యంకాదు. ఇంతమంది తనకుతోడు ఉండగా విచారమంతా తనదేనని బాధపడటం వెర్రితనం.

16. యీపైవన్నీ వ్యక్తావస్థకు సంబంధించినవి. యీపైచెప్పిన విధానాల్లో ఏదో వొకటి కలలో ప్రత్యక్షమై ఆకోర్కెను తీర్చవొచ్చు. స్వప్నంలోక్రియ దాని తాలూకు ఇతర ఆలోచనలమీద ఆధారపడి వుంటుంది.

అవ్యక్తావస్థలోని కోర్కె తన బలాన్ని పూర్తిగా ప్రదర్శించకుండా వేరొక రూపంలో ఏదో అంతరార్థాన్ని ఇముడ్చుకొని స్వప్నంలో బైట పడుతుంది. దీన్నే 'స్ఫురణధోరణి' అనొచ్చు. నిజమైన వస్తువులకూ, పదార్థాలకూ మారుగా ఇంకోటి-అసలు వస్తువును స్ఫురించేవి కనిపిస్తవి. యిలాటివి మన నిత్యజీవితంలో వ్యక్తావస్థలో కూడా అనేకం వున్నవి. యూనియన్ జాక్ జండా బ్రిటిష్ అధికారాన్ని, త్రివర్ణ పతాకం కాంగ్రెస్ నూ సూచిస్తవి. ఐతే మన స్తత్వ పరిశీలనలోని 'స్ఫురణత' అంత తేలిగ్గా వుండదు. ఫలానావస్తువు ఫలానా దానికి మారుగా వున్నదని ఖచ్చితంగా ఒకరూలు ప్రకారం వుంటుందనీ చెప్పేందుకు వీల్లేదు. యూనియన్ జాక్ లాటిదాన్ని

మనస్తత్వ పరిశోధకుడు బ్రిటిష్ అధికారాన్ని సూచిస్తోందని అనడు; దానికి మారుగా బ్రిటిష్ అధికారానికి యూనియన్ జాక్ ప్రతినిధిగా, ప్రత్యామ్నాయంగా వున్నదని అంటాడు. మిగతా వస్తువులన్నిటికన్నా ఒకజండాకు యింత గొప్పస్థానం, ప్రాధాన్యత ఎందుకు ఇవ్వవలసి వొచ్చిందో వ్యక్తావస్థలో మనకు తెలియదు. ఐనప్పటికీ దానికా ప్రాధాన్యత వున్నదని తరతరాలుగా మనం ఒప్పుకుంటూనే వున్నాం. అదే కలలో కనిపించినట్టయితే ఒక అధికారానికి మారుగా ఇది వున్నదని మనం చెప్పుకోవాల్సి వొస్తుంది. కనుక ప్రతి చిహ్నమూ అవ్యక్తావస్థలోని మనో వికారాన్ని తెలియపరుస్తూనే వుంటుంది.

ఇది కారణంగా ప్రతిచిహ్నానికీ అసలు వుద్దేశమూ, అర్థమూ ఏదో కనుక్కోవటం కష్టం. ఒకవ్యక్తికి కలలో గదికనిపిస్తే—అది గదిమాత్రమే కాకుండా ఏదో ఇంకోదానికి మారుగా కనిపించి వుండాలి; ఆ ఇంకోటి ఏదో తెలుసుకోవాల్సి వుంటుంది. దాన్నే మనస్తత్వ పరిశోధకుడు 'గది' మానవ శరీరానికి మారుగా వున్నదని అర్థం చెప్పుకుంటాడు. ఐతే ఇది ఏ ఆలోచనమీద రూఢిగా తెలుస్తుంది ?

మనకుకలిగే ఒక్కో ఆలోచనా, లేక మనంచూసే ఒక్కోరూపమూ మన మనస్సులో ఒకవిధమైన అనుభవాన్ని రేపుతుంది. అది బాహ్యరూపంలో అంత స్పష్టంగా కనిపించకపోవొచ్చు. అప్పులంటే పైకి భయపడని వ్యక్తికికూడా లోపల బెరుగ్గానే వుంటుంది. ధనవంతుడైన పిసినిగొట్టు కొద్ది మొత్తాన్ని ఖర్చుపెట్టినప్పుడు లోపల ఎంతో బాధపడతాడు. పైకి విగ్రహం బాగుండొచ్చు. కనుక 'డబ్బు' అనేది పీనాసి వాడికి అన్వయిస్తుంది. డబ్బు కనిపించినప్పుడు మనిషిలో కలిగే మార్పులూ, విచిత్రానుభూతుల్నిబట్టి దానివిశిష్టరూపం యేమైవుంటుందో కనుక్కోవాల్సివుంటుంది.

యీ పద్ధతి ఒక్కోచోట తప్పిపోతుంది. కనిపించిన వస్తువును దేనితోసరి పోల్చవొచ్చో చూసుకుంటూ ఆ తరువాత సంఘటనలకూ మొదటిదానికీ ఒకలింక్ కలుపుకుంటూ పోతే ఇది అర్థమౌతుంది. గదికీ మనిషి శరీరానికీ పోలికలేకపోలేదు. మానవశరీరాన్ని తొమ్మిదికిటికీలున్న గది (నవరంధ్రాలు)గా వేదాంతులు పేర్కొన్నారు. వేదకాలంనాటి సాహిత్యంలో మానవ శరీరం 11 తలుపులున్న గదిగా చెప్పబడింది. మనస్తత్వ పరిశోధకులు గది ఇంటినికానీ, ఇల్లాలినికానీ సూచిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

మనస్తత్వ పరిశోధనలో కొన్ని చిహ్నాలకు ఖచ్చితంగా 'ఇది' అనే అర్థం అందరూ ఒప్పుకున్నదే ! లోకమంతటా అనాగరికుడు మొదలూ, నాగరకుడివరకూ కొన్ని చిహ్నాల్ని ఒకేవిధంగా భావిస్తున్నారు. భాష రాకపోయినా మూగగా సౌజ్ఞలుచేసి యెదుటి వ్యక్తికి అర్థమయేట్టు చేయగలం. ఇది ఎలాసాధ్యం ? మానవుడి తలలోని పై పొరలలోనుంచే ఇలాటివి ఉద్భవించినవి. ఆ పై పొరలు విద్యాహీనుడిలోనూ, విద్యావంతునిలోనూ ఒక్కటే ! మరికొంతమంది చెప్పే కారణం






ఇవి; తరతరాలుగా యీ సౌజ్ఞలు వొస్తున్నవి. భాషకు పూర్వం ఇవే ఉండి ఉండాలి. వాటి వంశపారంపర్యత వాటికొక విశిష్టరూపాన్ని ఇచ్చివుంటుంది. దాన్నే మనమందరమూ అనుసరించటమూ, అర్థంచేసుకోవటమూ చేస్తున్నాం. యిది ఆధారంగానే అందరికీ సరిపడే కొన్ని చిహ్నాలు కలల విషయంలో స్థాపించబడి వుంటవి. ఒక్కొక్కప్పుడు గుడ్డిగా చిహ్నాన్నిపట్టి మాత్రమే పోతే అది స్వప్నం అంతటా అతకక పోవొచ్చు.

అంతటా సరిపడే చిహ్నమే ఐతే దాని నిర్ధారణకు కళ, సాహిత్యము లోకంలోని ప్రవర్తనా మొదలైనవికూడా దాన్ని బలపరచవలసివుంటుంది. యీచిహ్నాల్ని చాలామంది విమర్శకులు ఒప్పుకోలేదు. కాని ఎంతోమంది మనస్తత్వవేత్తలు వేరు వేరుగా చేసిన పరిశోధనల ఫలితంగా కొన్ని చిహ్నాలు సరిగ్గా సరిపోయినవి. ఇలాటి దాన్ని మనస్తత్వవేత్త కలగన్న వ్యక్తికి చెప్పినప్పుడుకూడా వెంటనే అతను అర్థం చేసుకోలేడు. చప్పున ఒప్పుకోడు. అదే విధంగా యీ చిహ్నాలకు వ్యతిరిక్తులు వున్నారు. అందుకని ఒక్క చిహ్నాన్నే ఆధారంగా కాకుండా మిగతా విషయాల్ని కూడా అనుసరిస్తూ స్వప్నాన్ని విశదీకరణ పద్ధతిలో చూడవలసి వుంటుంది.

[ ఇంకా వుంది ]





# చీకటి తప్పులు

ఆ పెద్ద మైదానంలో దీక్షితుల ఇల్లు బిక్కు బిక్కుమంటూ ఉండేది. ఒక మైలు దూరంలో ఎత్తయిన కొండలు—వాటిని దాటగానే గ్రామం. గ్రామానికి వెళ్ళేవాళ్ళు దీక్షితులు ఇంటిదగ్గర కాస్త విశ్రాంతి తీసుకోటం ఆచారం. అలసిపోయిన పాంథులకు ఇంత మజ్జిగ ఇవ్వటమూ, అవసరమైతే భోజనం పెట్టటమూ దీక్షితులు చాలా కాలంగా చేస్తున్నపనే! తృప్తిపడి తనకు తోచిన తృణమో పణమో దీక్షితులకు ఇవ్వటం ఒక మామూలైంది.

దీక్షితులు బీదవాడైనా చాలా గౌరవమైన కుటుంబంలోని వ్యక్తి. జీర్ణించిన అతని ఇల్లు చాలా చిన్నది. భార్య ఇద్దరు బిడ్డల్తో ఆ పక్కనే ఉన్న బీడును పండించేందుకు విశ్వప్రయత్నం చేస్తూ ఎలాగో పొట్ట పోషించుకుంటూ కాలం గడిపేవాడు. ఒక కుమార్తె నవయవ్వనవతి. ఇంకోబిడ్డ తల్లి రొమ్ముల్ని వొదిలేయిాడు ఇంకా దాటలేదు.

దీక్షితులు పెద్దకూతుర్లో యవ్వనరేఖలు ఉదయించినప్పటినుంచీ ఆమెకు వివాహం చేయాలనే పట్టుదల అతనికి లేకపోలేదు. కాని 'వివాహం' అంటే మాటల్తో అయేదికాదు. అది అనుకున్నంత త్వరలో చేసే సామర్థ్యం దీక్షితులకు లేదు. అందుకనే కాలయాపన జరిగింది.





ఐతే పెళ్ళయేదాకా ఆడపిల్లలు పెరక్కుండా ఉండరు కనుక, ఆమె యవ్వనకళలు దినదినానికీ కొత్తరూపురేఖల్ని దిద్దుకోసాగినవి. ఆమె అందం, అవయవసౌష్టవం యువకుల్ని—(పురుషుల్ని అనికూడా అనొచ్చు) ఇట్టే ఆకర్షించ గలిగేది. తన అందచందాల్ని మెచ్చుకొనే వాళ్లు ఉన్నారన్న సంగతి గ్రహించినప్పటినుంచీ ఆమెలో వింత వింత కోర్కెలు బయలుదేరినవి. అవి యెన్నాళ్ళుగానో కలలరూపాన మాత్రమే తీరుతూన్నవి. తన తల్లి మహాలక్ష్మమ్మ అందమంతా కూతురిలో అచ్చులాగు దిగిందనే మాటలో అబద్ధమేమీా లేదు. ఒక్క వయసులో మాత్రమే స్పష్టంగా భేదం కనిపిస్తుంది.

ఎంతోమంది వొస్తున్నారు—పోతున్నారు, కాని అందరూ ఆ అమ్మాయి రూపాన్ని చూసి మనసులో బొట్టలు వేసుకుంటూ వెళ్ళిపోయేవారు. వారికూడా ఆమెను అనుభవించాలనే కోర్కె లేదని కాదుకాని, అదంతా చాలా ఇబ్బందికలిగించే విషయమని నిరాశతో మళ్ళి పొయ్యేవారు. మరికొంతమంది ఆమె పేరును తెలుసుకొని 'సుందరరూపానికి తోడు సుందరి పేరుకూడా మధురంగానే వుంది' అనుకొని మనసా వ్యభిచరించి తృప్తిపడేవారు.

ఒకసారి ఒక యువకుడు ఆమెకు తటస్థపడ్డాడు. అతను ఆ గ్రామంలోని ఒక ధనిక కుటుంబంలోని వ్యక్తి. ఆ సంగతి తెలిసికాదు కాని, అతని రూపురేఖలే ఆమెను ఆకర్షించినవి. ఎన్నిపదాలు ఖర్చయినా అర్థంకాని భావం ఏదో వారిద్దరి మనసుల్లోనూ మెరుపల్లే మెరిసి ఇద్దర్నీ ఒక్కచోటికే లాగటానికి ఎక్కువ కాలయాపన చేయలేదు. కాని మనసులుకలవటంతో నేతృప్తిపడేతత్వం ఆఇద్దరిలోనూ లేదు. అతని పేరు మూర్తి అని మాత్రం ఆమె తెలుసుకోగలిగింది. ఆపైన పెదవులు కలిపే వీలు లేకపోయింది.

ఆ క్షణంనుంచే మూర్తి పిచ్చివాడయ్యాడు. ఆమెను అనుభవించే విధానాలెన్నో ఆలోచించాడు; ఏదీ సరైన రూపాన్ని తీసుకో

లేదు. చివరకు ముఖ్యస్నేహితుడు దాసుతో ఆలోచించాడు. యెలాగైనా ఒకరాత్రి ఆ ఇంట్లో గడిపేమార్గం వుంటే కొంత క్రియాకాండ జరగొచ్చని ఇద్దరూ నిశ్చయించుకున్నారు.

అనుకొన్నప్రకారం సూర్యాస్తమయ సమయమయాక దీక్షితులు ఇంటిముందు ఇద్దరూ హాజరయ్యారు. ఒకపక్క వాన తరుముకు వొస్తోంది. దీక్షితులు యీ అభ్యాగతుల్ని ఆహ్వానించాడు.

''ఇప్పటికే చాలా అలసిపొయ్యాము. యీ రాత్రికి, యీ వానలో, గాలిలో గ్రామంజేరటం అసంభవం. మీ ఇంట్లో ఆశ్రయం ఇచ్చితీరాలి'' అన్నాడు మూర్తి.

''అందుకేమీ అభ్యంతరంలేదు కాని నాఇల్లు చాలా చిన్నది. మీలాటివారికి ఇక్కడ సుఖంగా ఉండదు''అన్నాడు దీక్షితులు.

''ఇప్పుడు సౌఖ్యం గోల ఏం పట్టిందీ ? యీ రాత్రి గడుస్తే చాలు—''

ఏవో ఊరగాయల్తో భోజనాలయినవి. మూర్తినిచూసిన క్షణం నుంచీ సుందరి తన స్వప్నాలన్నీ నిజమయే సమయం దగ్గరవుతూన్నట్టు ఎంతో ఉత్సాహంతో వుంది.

కాస్సేపు ఆమాటా యీమాటా మాట్లాడుకున్నాక, నిద్రా సమయమైంది. దీక్షితులది అసలే చిన్న ఇల్లు. అందులో చిన్న పడక గది. బైట వరండా కురుస్తూండటంవల్ల యీ అతిధుల్ని విధిగా గదిలోనే పడుకోబెట్టవలసి వొచ్చింది. ఉన్నవి మూడే మంచాలు. దీక్షితులు బాగా ఆలోచించి ఒక పద్ధతి చేశాడు.

రెండు మంచాలు ఒకవైపున వేసి, మూడోది దానికి యెదురుగా వేశాడు. యెదురుగా వేసిన మంచంమీద మూర్తినీ, దాసునూ పడుకోమన్నాడు. ఒకవైపున వేసిన ఒక మంచం సుందరికివొదిలి తనకూ తన భార్యకూ ఒక మంచాన్ని ఉంచుకున్నాడు. చిన్నబిడ్డ





ఉయ్యాల తన మంచానికి దగ్గరలో తల్లికి వీలుగా ఉండేట్టు అమిర్చాడు.

స్నేహితులిద్దరూ త్వరలోనే నిద్రిస్తూన్నట్టు నటించారు. ఇద్దరి మనసుల్లోనూ ఏమౌతుందోననే ఆదుర్దా వారిని నిద్రపోనివ్వటంలేదు. అసలు నిద్రపొయ్యేందుకు వారిక్కడకు రాలేదుకూడాను.

వారు నిద్రపొయ్యారనే ఊహతో కుమార్తెను ఆ మంచం మీద పడుకోమన్నాడు; కాస్త ఆగి, ఆమెకూడా నిద్రిస్తూన్నట్టు నటించటాన్ని నిజమనుకొని, భార్యను తన మంచంమీదికి రమ్మని—యీ తతంగమంతా తెలియకుండా ఉండేందుకు గదిలోని లాంతర్ను ఆర్పివేశాడు.

దీక్షితులూ, అతనిభార్యా నిద్రపోతున్నారని గ్రహించేగానే మూర్తి మెల్లిగా సుందరి మంచందగ్గరకు వెళ్ళాడు. యీ సమయం కోసమే వేచివున్న సుందరి, అతన్ని ఆహ్వానించింది. వారిద్దరూ త్వరలోనే తమ లోకంలోకి వెళ్ళిపోయారు.

ఇంతలో వంటయింట్లో పిల్లి ఏవో గిన్నెల్ని పడదోసింది. మహాలక్ష్మమ్మ పిల్లిని తోలేందుకు లేచివెళ్ళింది. యీ సమయంలో దాసు ప్రకృతి శాసనాన్ని నిర్వర్తించుకొనేందుకు లేచి బైటికి వెళ్తూండగా, ఆ ఉయ్యాల అడ్డమొచ్చింది. దాన్ని అవతలివైపుకునెట్టి, అవసరం తీర్చుకొని వొచ్చి తన పక్కమీద పడుకొన్నాడు.

మహాలక్ష్మమ్మ తన గుర్తుతో భర్త మంచందగ్గరికి వొచ్చి, అక్కడ ఉయ్యాలలేకపోవటంవల్ల తను పొరపాటున అతిధుల పక్క దగ్గఱకు వొచ్చాననుకొని, ఉయ్యాలపక్కనే ఉన్న దాసు పక్కమీదికి వెళ్ళింది. కోరకుండానే తనకు వొచ్చిన యీ అదృష్టాన్ని దాసు వృధా పోనివ్వలేదు. ఆమెను తనివితీరా అనుభవించి ఆమెకు తృప్తి నివ్వటంలో అతను తీసిపోలేదు.

తెల్లవారుజాముదాకా పరిస్థితి అలాగే ఉండిపోయింది. మైమరచి సుందరి పక్కలోపడి నిద్రపోతానేమోననే భయంతో మూర్తి తన మంచంకోసం వెతుక్కోసాగాడు. దారిలో ఉయ్యాల వుండటంవల్ల అది దీక్షితుల పక్కయివుంటుందని భ్రమించి, అవతలివైపున వున్న దీక్షితుల్ని తన స్నేహితుడిగా తీసుకొని ఆ పక్కలో పడుకొన్నాడు.

అంతతో ఊరుకోక "ఎంత ఆనందం! నిజంగా స్వర్గంలోని రంభాసంభోగంకూడా ఇలా ఉంటుందనుకోను! ఏం సుందరిరా!" అన్నాడు దీక్షితుల్ని ఊపుతూ.

దీక్షితులు మండిపడి "ఏమిట్రా వాగుతున్నావ్?" అని మొదలుపెట్టాడు.

తన పొరపాటును తెలుసుకొని మూర్తి అన్నాడు: "ఏమిటీ? మీరు మాట్లాడేది---?"

మహాలక్ష్మమ్మ ఇప్పుడు తన పొరపాటును తెలుసుకుంది. వెంటనే ఆమె అంది: "ఆయన్ను వొదిలిపెట్టండి. ఏదో నిద్రలో కలవరించినట్టున్నారు!"

యీ మాటల్తోపాటు ఆమె లేచి పిల్లిలాగు అడుగులు వేసుకుంటూ తన కూతురి పక్కదగ్గరికి వెళ్లింది.

"చూశావా—వీడు ఏం వాగుతున్నాడో?" అన్నాడు దీక్షితులు.

"అదంతా అమ్మాయినిగూర్చి అనుకుంటున్నారా? రాత్రంతా నేను దాని పక్కలోనే ఉన్నాను" అంది మహాలక్ష్మమ్మ.

"మూర్తి బహుశా నా పక్కను తన స్నేహితుని పక్కగా పొరబడి ఉంటాడు" అనుకొని దీక్షితులు సమాధానపరుచుకున్నాడు.





యీ గోలకు ఇప్పుడే మేలుకొన్నట్టు దాసు "ఒరేయ్ మూర్తీ! యెక్కడవున్నావురా? సగం మెలుకూ రాగానే పక్కమీదినుంచి లేవటందేనికీ?" అన్నాడు.

యీ మాటలువిన్నాక ఇదంతా పొరపాటున జరిగిందేకాని ఇంకేమీ కాదని దీక్షితులు మారుమాట్లాడలేదు.


ఉదయాన మూర్తీ, దాసూ వస్తూవస్తూ తమకుజరిగిన మర్యాదకు దీక్షితులకు పది రూపాయలు బహూకరించారు.

మహాలక్ష్మమ్మ రహస్యంగా కూతుర్ని అడిగింది; "ఆ యువకుల్లో నీ పక్కలో జేరింది ఎవరే?"

"నాకేం తెలుసూ? ఆయన కలవరించాడుకాబోలు!" అంది సుందరి. యీవిషయాన్ని మహాలక్ష్మమ్మ మళ్ళీ ఎత్తలేదు.

[ బొకాషియో ఆధారం ]






## తల్లిపాలు

రచన : డా. బెంజిమన్‌స్పోక్, ఎం. డి.

ఈ రోజుల్లో చాలా కొద్దిమంది బిడ్డలు తమ తల్లులపాలమీద పెరుగుతున్నారు. ఇది ఎక్కువగా పట్టణాల్లో జరుగుతూండటంవల్ల ఇది వొక ఫ్యాషన్‌గా నాగరికతా లక్షణంగా భావించబడుతోంది. చాలా తేలిగ్గానూ, శ్రమలేకుండానూ పోతపాలతో బిడ్డను పెంచేవిధానం ఉండగా, విశేషించి యీ విధానాన్నే చాలామంది అనుసరిస్తూండటంవల్ల ఇది వొక ఆచారంగా కూడా ఉండిపోయింది.

ఐతే పోతపాలతో బిడ్డను పెంచడం రెండువిధాలుగా తేలిగ్గా కనిపిస్తుంది. తల్లి పాలను బిడ్డ పీల్చకపోవడంవల్ల ఆమె బలహీన మవదు; బిడ్డకు తగినన్నిపాలు ఇవ్వబడుతూన్నవో లేదో! విచారంలేదు; ఎందుకంటే కావలసినన్ని పాలనుఇవ్వొచ్చు.

అధునాతనప్రపంచంలో మరికొన్ని దురభిప్రాయాలున్నవి. కొంతమంది తల్లులు స్తన్యమివ్వటంవల్ల తమరొమ్ముల అందం చెడుతుందనీ, తమ యవ్వనం జారిపోతుం దనీ తమ భర్తలకు ఆకర్షణగావున్న రొమ్ములు ఇకముందు అతని ప్రేమను ఆహ్వానించ లేవనీ అభిప్రాయపడటంకూడాకద్దు. ఐతే శరీరంలోనుంచి విడుదల కావలసిన శక్తిని పట్టి శరీరం ఆహారం తీసుకుంటుంది. తల్లితోపాటు బిడ్డకు కావలసిన ఆహారాన్ని కూడా ఇవ్వవలసినప్పుడు తల్లి తగినంత ఆహారాన్ని తీసుకుంటుంది; అందుకని ఆమె ఆరోగ్యం చెడే అవకాశంలేదు. ఇక రొమ్ముల అందం చెడుతుందనటంలో కూడా సత్యంలేదు. ఏదో తాత్కాలికమైన మార్పువొచ్చినా, ఆమార్పు ఎల్లకాలమూ ఉండేదిమాత్రం కాదు. ఒక్కొక్కప్పుడు సరిగా అందంగా లేని రొమ్ములకు సరైన ఆకారం రావటంకూడా సంభవించవొచ్చు. గర్భవతిగా ఉన్నప్పటినుంచీ రొమ్ములు పెద్దవి కావటం మొదలైనప్పటినుంచీ బిగుతుగా బాడీని కట్టటానికి అలవాటైనట్ట





యతే అక్కడి చర్మం సాగిపోకుండా, లోని చిన్నచిన్న గ్రంథులు మార్పుచెంద కుండా ఉండే అవకాశంకూడా వుంది. గర్భవతిగా ఉన్నప్పుడే అధికంగా బలవ కుండా చూచుకోవటంకూడా అవసరం; శరీరమే పెరిగేపక్షంలో, ఒక భాగమైన రొమ్ములుకూడా పెరుగుతవి. ఒక్కొక్కప్పుడు గర్భం రాకుండానూ, బిడ్డను తన పాలతో పెంచకుండా కూడా రొమ్ముల అందంచెడటం సామాన్యంగా లోకంలో జరిగేదేకదా !

కొంతమందికి బిడ్డలకు పాలివ్వటం ఇష్టంలేకుండా వుంటుంది. ఎలాగైనా ఆ ఇష్టాన్ని కలిగించుకోవటమే మంచిది. లేకపోతే తల్లికి బిడ్డకూ మధ్య ఉండవలసిన సంబంధం కొంతవరకూ చెడే అవకాశం ఏర్పడుతుంది.

విధిగా పనిచేసుకొని పొట్టపోషించుకోవలసిన తల్లి సంగతేమిటి? అది ఆమె పనిచేయవలసిన కాలాన్నిబట్టి వుంటుంది. రోజుకు 8 గం.ల కాలం పనిచేయవలసి వున్నా బిడ్డకు ఒక్కసారితప్ప మిగతాసార్లు తనపాలను ఇవ్వగలిగి ఉంటుంది.

తన పాలను ఇవ్వటంవల్ల తల్లి బలహీనమైపోతుందనీ, తల్లినుంచి యెంతో బలం పాలరూపంలో బిడ్డ లాక్కుంటుందనీ, కొంతమంది అభిప్రాయం. కాని ఇందు లో నిజంలేదు. సామాన్యంగా బిడ్డకు కావలసిన పాలకోసంగాను తల్లి యెక్కువ ఆహారాన్ని తీసుకోవాల్సి వుంటుంది. ఒకవేళ ఏ కారణంచేతనైనా తల్లి తన బరువును కోల్పోతూన్నట్టయితే—అప్పుడు తన పాలతో బిడ్డను పెంచటం ఆపవొచ్చును.

తల్లిపాలతో బిడ్డను పెంచటం సాధారణ, స్వాభావికమైన పద్ధతి. ఇంతకన్న మంచిపద్ధతి లేనంతవరకూ ఇదే శరణ్యం. యీ పద్ధతివల్ల శరీరకంగా తల్లి ఆరోగ్యం బాగుపడుతుంది. బిడ్డ పాలు తాగుతూన్నంత కాలమూ గర్భకోశపు కండరాలు విపరీతంగా ముడుచుకొని పోతవి. దానివల్ల తల్లి కాన్పుపూర్వస్థితికి త్వరలో వొచ్చేందుకు వీలున్నది. ఇక మానసికంగా తల్లికీ బిడ్డకూ ఒకవిధమైన 'దగ్గరిసంబంధం' ఆపేక్ష వృద్ధవుతుంది. ఏదో నిజమైన ఆహారం, స్వభావసిద్ధమైనది, డబ్బుకులోకం లో దొరకనిది, ఇతరులెవ్వరూ ఇవ్వలేనిది తనే యివ్వగలుగుతున్నాననే తృప్తితల్లికి వుంటుంది. బిడ్డ పెద్దవాడయ్యాక—తనకు లభ్యంకాని అమృతమేదో తన తల్లి తనకు యివ్వగలిగిందనే విశ్వాసానికి ఆపేక్షకు గురికాకమానడు.

పాలు రావటానికి ముందుగా వొచ్చే ఒక ద్రవపదార్థం **(Colostrum)** వల్ల బిడ్డ అంటువ్యాధులనుంచి కాపాడబడుతుందని మరికొందరి నమ్మకం; యిది నిరూపించబడని సత్యం. పోతపాలమీద పెరిగిన బిడ్డలకన్న తల్లిపాలమీద పెరిగిన బిడ్డలు తక్కువగా అనారోగ్యానికీ, అజీర్తికీ గురవుతారు. తల్లిపాలవల్ల ఇంకా యెన్నో లాభాలున్నవి. ఆ పాలు ఎప్పుడూ పరిశుభ్రమైనవి. బైటి ప్రపంచంలో వున్న అంటువ్యాధుల తాలూకు క్రిములేవీ ఆ పాలవల్ల బిడ్డను ఆవహించవు. పోత

పాలను తయారుచేయటంలో వృథాచేయవలసిన కాలాన్నీ, శ్రమనూ తల్లిపాలు తప్పించగలుగుతేవి. మరీ ప్రయాణాల్లో ఉన్నప్పుడు యీ పద్ధతి ఎంతో సహాయకారిగా వుంటుంది. బిడ్డకోసం యెప్పుడూ పాలుసిద్ధంగా ఉండేందుకే ప్రకృతి స్త్రీకి రొమ్ముల్నిచ్చిందనేదాంట్లో సత్యం లేకపోలేదు. తల్లిపాలు డబ్బు ఖర్చులేనివి. యెన్నో బీదకుటుంబాల్లో పిల్లలకు ప్రకృతి యేర్పరచిన ఆహారంగా వుంటూన్నవి. బిడ్డల్లో చెలరేగే చప్పరించాలన్న ప్రకృతి సహజమైన వాంఛ తల్లిపాలవల్ల చాలావరకు తృప్తిపరచబడుతుంది. అందుకనే పోతపాలతో పెరిగిన పిల్లలకన్న, తల్లిపాలతో పెరిగిన పిల్లల్లో బొటనవ్రేలిని చప్పరించే అలవాటు యెంతో తక్కువగా ఉంటుంది.

తల్లులకు ఉండే కొన్ని దురభ్యాసాలూ, కొన్ని మందులుతినే అలవాట్లూ పిల్లలకూడా వొస్తవనే నమ్మకం కూడా చాలామందికి వుంది. ఇది అనుకున్నంత నిజం కాదు. తల్లికి చుట్టతాగే అలవాటు వున్నంతమాత్రాన అది బిడ్డ ఆరోగ్యాన్ని పాడుచేస్తుందని రుజూచేయలేము. తల్లి కొంచెం యెక్కువగా తింటే బిడ్డకు అజీర్తి వొస్తుందని అన్ని విషయాల్లోనూ రూఢిగా చెప్పేందుకు వీల్లేదు. ఒకవేళ యేదో ఒక ప్రత్యేక ఆహారాన్ని తినటంవల్ల అనేకసార్లుగా బిడ్డ ఆరోగ్యంలో మార్పు వొస్తే తప్ప మార్చవలసిన అవసరంలేదు.

యెప్పుడైనా మానసికంగా నరాల బలహీనత్వం తాత్కాలికంగా తల్లిలో కలిగినప్పుడు బిడ్డకు తగినన్ని పాలుండవు. బిడ్డకు ఆహారం తక్కువకావటంవల్ల ఎక్కువగా ఏడవటం, కొంత అసాధారణతను చూపటంకూడా ఉండొచ్చు. కొంతమంది స్త్రీలు తమ పాలతో బిడ్డల్ని పెంచుతూన్నంతకాలమూ బహిష్టు అవరు; మరికొంతమంది అప్పుడప్పుడూ అవుతూంటారు. ఒక్కొకప్పుడు బహిష్టయిన స్త్రీ పాలను బిడ్డ తీసుకోక పోవటంకూడా కద్దు.

నాలుగుగంటలకు పైగా ఏపనన్నా వుండి తల్లి బిడ్డదగ్గరలేని పక్షంలో, లేక యితర యిబ్బందులు కలిగినప్పుడు తాత్కాలికంగా పోతపాలతో బిడ్డను సముదాయించవొచ్చు.

తల్లి తను తీసుకొనే ఆహారంలో బిడ్డకు అత్యవసరమయిన ధాతుపుష్టికి అనువైన పదార్థాలు వున్నవో లేవో చూడవలసిన అవసరం వుంది. బిడ్డ తల్లిపాల నుంచి విపరీతంగా 'కాల్షియమ్'ను తీసుకొని ఎముకల్ని పెంచుకుంటుంది. యీ కాల్షియమ్ తల్లి తగినంతగా తీసుకోకపోతే, తల్లిపాలు, తల్లి శరీరంలోని ఎముకల్లోని కాల్షియమును తీసుకుంటుంది. తల్లి ఎన్ని పాలను బిడ్డకు ఇస్తూవుందో అన్నిపాలనూ తీసుకోవటం చాలా వుత్తమమైనమార్గం. యితర ఆహారపదార్థాలు విటమిన్లు బాగా వున్నవికూడా తీసుకోవాల్సి వుంటుంది.





పిండిపదార్థం యెక్కువగా వున్న ఆహారాల్లో శరీరాంగాల్ని బాగా పెంచే గుణం వుంది: బంగాళాదుంపలు, బియ్యము, పంచదార మొదలయినవి తగుమాత్రంగా తీసుకోవాలి. తల్లి బరువు తగ్గకుండా ఉండటమే ఆమె తీసుకునే ఆహారం సరిగ్గా సరిపడుతూన్నట్టు తెలియజేస్తుంది. బరువు అధికమౌతుంటే పిండిపదార్థాల్ని తగ్గిస్తూ, తక్కువౌతూంటే ఎక్కువగా తింటూ సరిపెడుతూండాలి.

చాలామంది పిల్లలు తల్లిపాలకు చప్పున అలవాటవుతారు. పుట్టిన 4, 5 వారాల వరకూ తల్లిపడుకొని పాలివ్వటమే మంచిపద్ధతి. బిడ్డకు ఎదురుగా ఒక భుజంమీద పడుకొని, రొమ్ము బిడ్డ పెదవులకు తగిలే వరకూ జరగాలి. చనుమొన బిడ్డ పెదవులకు తగలగానే దాన్ని పట్టుకునేందుకు ప్రయిత్నిస్తాడు. ఒక్కొక్కప్పుడు ఊపిరి పీల్చుకునే వీలుండేట్టుగా స్తనాన్ని వేలితో ఒత్తిపెట్టి వుంచవలసి వుంటుంది. రెండు వారాలు గడిచాక బిడ్డ కోరినంత కాలమూ పాలు యిస్తూవుండొచ్చు. మొదటి వారాల్లో 15 నిమిషాలు పాలిచ్చి ఆపుతూండటం మంచిది. కాస్త అలవాటయే దాకా జాగర్తగా చూస్తుండాలి.

కొంతమంది బిడ్డలు పాలతోపాటు కొంతగాలికూడా మింగుతారు. కొంతమంది అదేమీ చేయరు. మరికొంతమంది పిల్లలకు కొలమారుతుంది. అప్పుడు బిడ్డవీపు మీద చేతితో రాస్తూండాలి. పాలివ్వటం పూర్తయాక ఒకసారి బిడ్డను నిలువునా ఎత్తి పొరపాటున మింగుడుపడ్డ గాలిబుడగల్ని బైటికి పంపించి వేయటం మంచిది.

సరిగ్గా పాలు వొస్తవో రావోననే అనుమానం అక్కర్లేదు. బిడ్డ ఏడుపే చాలు తేలిగ్గా తల్లిపాలు ప్రవహించేందుకు. మనోవికారాలవల్లా, కోపగించుకోవటమూ విసుక్కోవటంవల్లా పాలు నిరోధించబడవొచ్చు. కనుక మనశ్శాంతి వొకటి అవసరం. పాలిచ్చేముందు 15 నిమిషాలు వేరే పడుకొని ఏ పుస్తకం చదువుతూనో బాధారకరమైన ఇతర ఆలోచనల్ని పారద్రోలుకోవటం మంచిది.

రాత్రిపూట బిడ్డకు పాలివ్వటంలో కొంత జాగ్రత అవసరం. తల్లి నిద్రమత్తులో వుండటంవల్ల తన చేతితోనో రొమ్ముతోనో బిడ్డకు ఊపిరాడకుండా ఉండేట్టు చేయవొచ్చు. అందుకని నిద్రవొస్తున్నట్టు అనుమానం వుంటే పడుకొని పాలివ్వటం కన్న కూర్చొని పాలివ్వటం ఎంతో మంచిపద్ధతి.

ఒక్కొబిడ్డ తనకు ఆకలైనప్పుడు చనుమొన తన నోటికి తగలలేదనే బాధతోనూ, ఆలస్యమైందనే కోపంతోనూ ఎక్కువగా ఏడుస్తాడు. ఆ బిడ్డను సముదాయించి ఎలాగైనా చనుమొనను అందించి ఊరడించవలసి ఉంటుంది. చనుమొన పట్టుకునేందుకు వీలుగాలేనట్టయితే శుభ్రంగా వున్న వేలితో దాన్ని తల్లి అందించవలసి వుంటుంది. లేదా నల్లభాగమంతా బిడ్డ నోటికి అందించి కాస్త వొత్తి పాలను వర్షించినట్టయితే బిడ్డ ఊరుకుంటాడు.

బిడ్డ తలను గట్టిగా పట్టుకొని రొమ్ముల దగ్గరికి లాగటం చాలా దురలవాటు. బిడ్డకు ఇలాటివి ఇష్టం వుండవు. స్వేచ్ఛకోసం తన్నుతాడు. సామాన్యంగా బిడ్డ బుగ్గను తాకినట్లయితే ఆవైపు చప్పున తిరుగుతాడు. అందుకని తల్లి బిడ్డకు పాలివ్వవలసినప్పుడు బిడ్డ బుగ్గను నలపటం లేక గిల్లటం చేస్తుంది. ఈ పద్ధతిలో రెండుబుగ్గల్నీ పట్టుకోవటమూ, బిడ్డకు నెప్పి కలిగించటమూ జరుగుతుంది.

బిడ్డ తనకు కడుపు నిండకముందే పాలను విసర్జించటం జరుగుతూంటుంది. అంతమాత్రంచేత తల్లి విసుక్కోని ఊరుకోవటంకన్న సౌమ్యంగా ఒకటికి రెండు సార్లు ప్రయత్నించి బిడ్డకు అర్థమయేట్టు చేయాలి.

సామాన్యంగా బిడ్డ పుట్టిన 12 గంటలతరువాత తల్లి పాలను ఇస్తుంది. మొదట్లో బిడ్డ 5, 10 నిమిషాలకన్న యెక్కువసేపు పాలు తాగడు. నిజానికి మొదట్లో పాలుకాక వేరే ద్రవపదార్థం (Colostrum) వొస్తుంది, బిడ్డ దానికి ఇష్టత చూపడు. అదీకాక చనుమొనలకు బిడ్డ అలవాటయేందుకు కొంతకాలం పడుతుంది. మామూలుగా ప్రతి గంటకూ ఒకసారి బిడ్డకు పాలు కావాలి. తెల్లారుజామున 2 గంటలకు ఇవ్వవలసినది మొదట్లో మినహాయించబడుతుంది.

3, 4, 5 రోజుల్లో ఏదో ఒకనాడు తల్లిపాలు వొస్తవి. చనుమొనలు దెబ్బ తినకుండా వుంటే క్రమంగా పాలిచ్చే కాలం 20 నిమిషములదాకా పెంచబడుతుంది. అప్పుడు తెల్లారికట్ట 2 గంటలకు ఇవ్వవలసిన పాలుకూడా ఇవ్వబడుతవి. బిడ్డకు చాలకపోయినట్టయితే 4 గంటలకొకసారి బదులు 2 గంటలకొకసారి పాలను యివ్వవలసి వుంటుంది. పాలనుబట్టి యీమార్పు జరుగుతుంది.

ఒకే రొమ్ములోనుంచి వొచ్చే పాలు సరిపడినట్టయితే ఒకసారికి ఒకేరొమ్మును యివ్వటం మంచిది. పాలుపడిచే విధానాన్ని తృప్తిపరిచేందుకు ఇది మంచి పద్ధతి. రెండు వారాలు పెరిగాక బిడ్డ తృప్తిపడేవరకూ పాలను తాగించవొచ్చు. సామాన్యంగా యీ కాలం 20 నిమిషాలు వుంటుంది. ఒక్కొక్కప్పుడు ఇంకా యెక్కువ కాలమైనా యిబ్బందిలేదు.

తల్లులు చనుమొనల్ని గూర్చిన జాగ్రత ఎక్కువగా తీసుకోవాల్సిన అవసరం వుంది. ఆ ప్రదేశం మకిలగా వుండటం, లేదా మురికిచేతుల్తో ఆ ప్రదేశాన్ని తాకటం మొదలైన పనులు చేయరాదు. పాలిచ్చేముందు వేడినీళ్ళతో సబ్బుతో ఆ ప్రదేశాన్ని శుభ్రపరచటం మంచిది.

ఒక్కొక్కప్పుడు కాన్పు అయిన మొదటి రెండురోజుల్లోనూ చనుమొనలు బాధగా వుండటం లేదా పగుళ్ళను చూపటం జరుగుతుంది; సున్నిత శరీరాలకూ, సన్నని చర్మంగలవాళ్ళకూ యిది సంభవిస్తూ వుంటుంది, దీన్ని తప్పించుకునేందుకూ, దీన్నుంచి రక్షించుకునేందుకూ జాగర్త తీసుకోవాలి. కాన్పు యింకో నెల వున్నదనగానే చనుమొనల్ని నలుపుతూ, బిడ్డకు తగినట్టుగా వాటిని సిద్ధపరచటాన్ని కొంత





మంది వైద్యులు ప్రోత్సహిస్తారు. యిది చేసేప్పుడు చేతులు చాలా శుభ్రంగా వుండాలి.

పాలివ్వటం కాగానే బిడ్డను బలవంతాన అవతలకు తోసెయ్యటం ఒక దురలవాటు. దానివల్ల చనుమొనలు నెప్పిచేస్తవి. బిడ్డకూడా నిరాశతో యేడుస్తాడు. క్రమంగా వేలితో బిడ్డ పెదవులనుంచి రొమ్మును తప్పించేందుకు ప్రయత్నించటం మంచిది.

కొంతమంది పిల్లలు పాలుతాగేందుకు ప్రయత్నించటానికి బదులు చనుమొనలు యెక్కువగా చప్పరించటం చేస్తారు. మరీ మొదటి వారాల్లో బిడ్డ యీ పనిచేస్తాడు. దీనివల్లకూడా చనుమొన బాధగా వుంటుంది. యీ పని చేయనివ్వటంకన్న, మెల్లిగా పైవిధానంలో తప్పిస్తూ తిరిగి పాలను యిచ్చేందుకు ప్రయత్నిస్తూ క్రమంగా పాలు తాగటాన్ని బిడ్డకు నేర్పవలసి వుంటుంది.

చనుమొనలు బద్దలై బాధగా వుండే పక్షంలో పాలిచ్చే కాలాన్ని తగ్గిస్తూ రెండు రొమ్ములకూ పంచుతూ, డాక్టర్‌ను చూడవలసి వుంటుంది. అది మరీబాధగా వుండేట్టయితే చనుమొనను రక్షించే సాధనను (Nipple Shield) ను కానీ **Best pump** ను కానీ వుపయోగించవలసివుంటుంది. ఒకవేళ పగలకుండా ఒక్క బాధాకరంగా మాత్రమే వుంటే బిడ్డను 8 నిమిషాలసేపు పాలు తాగనివ్వటం మంచిది—పాలు బాగా వున్నప్పుడు అవి బైటపడవలసిన మార్గాన్ని చూడవలసి వుంటుంది. తల్లిపాలు చాలనిపక్షంలోనూ, తల్లి పాలను యివ్వలేనిస్థితిలోను పోతపాల మీద బిడ్డను తాత్కాలికంగా పెంచవొచ్చు.

ఒక్కొకప్పుడు రొమ్ము లోపలిభాగంలో ఏదో మార్పు రావటంవల్ల పై చర్మం యెర్రబడుతుంది. లోపల యేదో అంటువ్యాధిలాటిదివున్నదనీ, పైభాగంలో పుండు ఐనట్టే లోపలిభాగంలో ఐందనీ గ్రహించాలి. వెంటనే డాక్టరును చూడవలసి వుంటుంది. ఆధునిక చికిత్సలను అనుసరించి, తాత్కాలికంగాకూడా బిడ్డకు పాలివ్వటం ఆపనక్కర్లేదు.

ఒక్కొక్కప్పుడు మెత్తగా వుండే రొమ్ముపాలు చాలా యెక్కువ కావటంవల్ల చాలా గట్టిపడుతుంది. ఆ సమయంలో చనుమొనను పట్టుకునేందుకు బిడ్డ చాలా అవస్థ పడతాడు. ఆ సమయంలో మెత్తపడేవరకూ **Breast pump** ను వుపయోగించటం మంచిది. మెత్తపడగానే బిడ్డకు పాలివ్వవొచ్చు.

యీ రొమ్ముల్లో నవనాగరికులైన తల్లులు పాలివ్వలేరనీ, అది చాలా యాతన మేళామనీ దురభిప్రాయంచాలామందిలో వుంది. శక్తిహీనత, నరాల బలహీనత్వమూ పాలు రాకుండా ఆపగలవుకాని అవొక్కటే కారణం కాదు. ఇంకా ముఖ్య కారణాలు : తల్లి తగిన ఆహారాన్ని తీసుకోకపోవటం, త్వరలోనే పాలివ్వలేనని నిరు

త్సాహపడటం, పాలు రావటం మొదలయాక రొమ్ములకు తగిన విధానంలో చేపలేక పోవటం (Stimulate).

బిడ్డ పుట్టిన మొదటి 3, 4 రోజులూ పోతపాలతోనే పెంచుటచే తల్లి పాలకు విముఖత్వాన్ని సూచిస్తాడు. తనకు సరిపడే ఆహారం తేలిగ్గా పోతపాలతో వొస్తుంటే బిడ్డ తల్లిపాలను తీసుకునేందుకు ఇష్టపడడు. మానవుడు అలవాట్లకు బానిస. యేది అలవాటైతే అదే సాగుతూంటుంది. అందుకని యెంత త్వరలో వీలైతే అంత త్వరగా తల్లిపాలకు మార్చవలసిన అవసరం ఎంతైనా వుంది.


మరికొంతమంది తల్లులు బిడ్డకు కావలసినన్ని పాలను ఇవ్వలేకపోతున్నామని నిరుత్సాహపడతారు. ఒక్కొక్కసారికి ఒక్కొక్క ఔన్సు పాలు ఇవ్వగలుగుతే చాలు. ఆ పద్ధతిని కొనసాగిస్తే నేతప్ప క్రమంగా క్షీరంకూడా పెరిగే అవకాశం వుండదు.

పగటివేళల్లో పాలివ్వటం ఎంత ముఖ్యమో, రాత్రులందు కూడా పాలివ్వటం అంతే ముఖ్యం. బిడ్డ తాగుతున్నకొద్దీ క్షీరవృద్ధి అవుతుంది. ఆవుపాలు లభ్యంకాని చోట్ల బిడ్డ రొమ్ములకు అలవాటుకాక తప్పదు.

ఈ సూత్రాలన్నీ సర్వసామాన్యంగా సరిపడేవి. డాక్టర్ లేనిచోట్ల వెంటనే డాక్టర్‌సలహా లభ్యంకానిచోట వుపయోగించతగినవి. ఐతే శరీర శాస్త్రంలో ఒక చట్టబద్ధమైన విషయమని దేన్నీ ఇదమిద్ధంగా చెప్పలేం. శరీర తత్వాన్నిబట్టీ ఇతర పరిస్థితుల్నిబట్టీ మార్పులు అవసరమౌతవి. ఒక్కొక్కప్పుడు బిడ్డ సైజునూ, తూకాన్నీ చూసి తల్లిపాలుకన్న పోతపాలే మంచిదని సలహా చెప్ప వొచ్చు. లేదా తల్లి ఆరోగ్యం పాలను ఇవ్వతగినదిగా లేకపోవచ్చు. అదివరకు ఆమెకు కలిగిన సంతానం విషయంలో కొన్ని రుజూఐన శరీరతత్వ సత్యాలేవో డాక్టర్‌కు తెలిసివుండి, వాటిని అనుసరించి ఇక్కడ చెప్పనివి, లేదా ఆచరించకూడని సలహాలకు బదులు—స్వంతసలహాలను యివ్వొచ్చు. తల్లిపాలే యిచ్చితీరాలన్న నియమాన్ని అతి జాగ్రతగా అమలుపరచటంవల్ల బిడ్డ ఆకలితో బాధపడటం, బరువు తగ్గిపోవటం తగిన ఆహారంలేక అనారోగ్యం కావటం జరుగుతుంది. తల్లికి తగిన విశ్రాంతిలేక బలహీనత కలగటం, చనుమొనల బాధ యెక్కువకావటం జరిగి నప్పుడు బిడ్డకు పాలు యివ్వటం తాత్కాలికంగా ఆపవొచ్చని ఇదివరకే చెప్పాం, అందువల్ల పెద్ద నష్టమేమీ వుండదు. మూఢనమ్మకాలనేవి పనికిరాని యీశాస్త్రంలో డాక్టర్ సలహా అవశ్యమూ అనుసరణీయమని మనం గుర్తుంచుకోవాలి.

ఇంకోసారి పోతపాలనుగూర్చి తెలుసుకుందాం.






'ఏమండీ, రాజమండ్రి పోయేబండి మళ్ళీ ఎప్పుడున్నదండి?'

లింగరాజును, బండిలో పంపించేసి, పరధ్యానంగా నడుస్తున్న నా చెవిలో వాయించి నట్లుంది. వీణకు తల ఎత్తేను. చూచేను ప్రక్కకు, ఎంక్వైరీ ఆఫీసువద్దనే నిలబడి పోయి.

ఒక్క క్షణం ఆశ్చర్యంతోటో, ఆనందంతోటో గాని మాటలకు తడుముకోవలసి వచ్చింది. ప్రశ్నను నేను విననట్లు గ్రహించినట్లుగా ఆమె తిరిగి అడిగింది, అదే మృదు స్వరంలో.

ఆమె చేతిలో 'దయాల్ బాగ్' సంచీ, కండ్లలో కోర్కెలను రేకెత్తించే విచిత్రాకర్షణ. సంచీనుంచి కండ్లవైపోసారి చూచి అనుకున్నా 'ధన్యుడెవడో' అని.

'ఆ! రాజమండ్రి బండీయా! అరే, యిప్పుడే వెళ్ళిపోయింది ఒకటి. ఇక తర్వాతది రాత్రి ఒంటిగంటన్నరకే.' అన్నాను గాని, యిక వెళ్ళి పోతుంది గామాల్ను అన్న దిగులు ప్రారంభమయ్యింది వెంటనే. 'బందర్ బండి కొచ్చేనండి. ఒక్క పదినిమిషాల వ్యవధిలో పోయింది బండి' అంది.

ఆమె అట్లాగే అక్కడే, ఎందుకు నిలిచి మాట్లాడ కూడదు మరి కొంతసేపు.

'ఎంక్వైరీ' ఆఫీసు గుమాస్తా అప్పుడే ముందుకు వంగి పదిగజాలదూరంలోవున్న నావైపే చూస్తున్నాడు—

'ఎవరోయ్ లలన?' అన్నట్లు. 'మీ మొహంలే. మీకెప్పుడూ, యిదే దృష్టి మంచీ చెడ్డా లేదికి' అన్నట్లు కొంచెం సీరియస్‌గ చూచి, మాటల కోసం. ఏదైనా సరే మాట్లాడటం కోసం మనస్సునో సారి తిరగేసి వెతుక్కో సాగేను.

చటున అడిగేను, ఆమె వెనకే అడుగు వేస్తూ "పాపం, మళ్ళీ అర్ధరాత్రిలేచి ఎక్కడ్నుంచో రావాలి కావాల్ను."

టికెట్ కలక్టరును సమీపిస్తున్నాము. బయటికే వస్తూంది ఆమెకూడాను. బ్రిడ్జి దాటేస్తాం, మరోక్షణంలో. ఆమె దారి ఆమెది, యికనాదారి నాదేనా? ఒంటరి గది, పుస్తకాలూ నేనూను...రాత్రంతా! నిద్ర రానివ్వని ఆలోచనలు. ఎన్ని ఆలోచనలు...ఎన్ని దోమలు...ఎన్ని గంటలు!

దాటేం టికెట్ కలెక్టరును. దాటుతూన్నాము బ్రిడ్జిని కూడా, అదృశ్యమవుతుంది యిక ఆమె-! ఇంకో పది నిమిషాల్లో వక్కడినీ బస్సుల దుమ్మును మొహాన పూసుకుంటూ, యీదురోమంటూ గది తాళాన్ని తీసి, లాంతరు కోసం చీకట్లో తడుము కుంటూ వుంటాను.

మెట్లు దిగుతూ ఆమెవైపు చూస్తూ 'బంధువులు వున్నారనుకుంటామీకిక్కడ! ఇంటికి వెళ్ళి పోయి, ప్రొద్దున్నే మెయిలుకు వెడితే నిద్రదండగవ్వదు" అనేసేను.

బ్రిడ్జి దిగేసేము. తటపటా యిస్తూం దామె వక్క-క్షణం అక్కడే నిలబడి.

'ఏమైనా మరచిపోయేరా ప్లాట్ ఫారం పయిన? "దూకించేను ప్రశ్నను. లేదండి. లేదు. సూర్రావుపేట ఎటువైపో ...అని "సూర్రావుపేటలోనా. మీబంధువులువుండేది? చాలాదూరమే! ప్రొద్దున్నే లేచి మెయిలు అందుకోడం మీకు—ఇంపాజిబుల్, మాయింటికి రాకూడదూ.. ఆ ప్రక్క సందులోనే, ఆకనపడే హోటలు వెనక సందులోనె, మెయిలు స్టేషన్ లోకి వచ్చేక మీరు లేచి వెళ్ళొచ్చు కూడాను." గుండెలు దడదడ లాడేయి. (తప్పు) అర్థంచేసుకుని అల్లరిచేయదుకదా!

చిరునవ్వు నవ్వి 'అబ్బే! సూర్రావు పేట పోవాలి. పొద్దున్నే మా మేనల్లుడొచ్చి దిగ విడుస్తాడు స్టేషన్‌లో. యీ రోడ్ తిన్నగాపోతూందికదూ అక్కడికి.

ఏమిటీ మనిషి, చెబుతూంటె! ఆమె చిరునవ్వు ఎంతో దగ్గరగా జరిగేందుకు అవకాశమిచ్చినట్లు 'ఫీలయ్యేను'. చేతులు పట్టుకుని బ్రతిమాలనా! బ్రతిమాలితే కనికరిస్తుందని ఏమిటో ధీమా.

'ఈ' రోడ్ తిన్నగా వెళ్ళదు; వంకర్లు తిరగాలి లెండి. నామాటవిని చక్కగా యింటికి రండి. ప్రొద్దున్నే నేను టికెట్ తెచ్చి మిమ్మల్ని బండిలో కూర్చోపెట్టి పంపిస్తాగా."

డింపిల్సును వదల్తూ "నేను రానంటూంటే- మావాళ్ళున్నారిక్కడ- అర్థంకాదా మీకు."

ఎందుకు అర్థంకాదూ. నేనుమీవాణ్ని కాదూ, లేక నువ్వు నాదానివి కాదూ అనాలనిపించింది వెంటనే.

"సరే అయితే. ఒరే రిక్షా! యీవిణ్ణి రిక్షా ఎక్కించరా...తిన్నగా పోనియ్"

కృతజ్ఞతగా నావైపు చూచి రిక్షాలో కూర్చున్నదామె.

ప్రక్క నేనడుస్తూన్న, నా ప్రక్కనే కదులుతూవున్నదామె. సిగరెట్ వదుల్తూ ఆలోచిస్తున్నా! ఆలోచిస్తూ నడుస్తున్నా ఆమె సౌందార్యాన్నే చూస్తూ. 'కెఫీ' దాటింది రిక్షా. నేను పోతానను కున్నది కాబోలు...నావైపు మరోసారి కృతజ్ఞతగా తలెత్తి చూచిందామె...ఆఖర్ సారి చూచినట్లు, చూడనట్లు బ్రిడ్జివరకు నడచి, 'పోస్టాఫీసువైపు పోనీరా అబ్బీ' అన్నాను ఆమె చేతిలోని పత్రిక పేజీలు పరధ్యానంగా తిరుగుతున్నయ్—యింకా.

'ఆపరా అక్కడ!'





"ఏమిటీ! ఇక్కడ కొచ్చేం?"

"ఇదేమా యిల్లు."

"నేను సూర్రావుపేట పోతానంటుంటే యిదేమిటీ?"

"ఫర్వాలేదు. ఒకపూట మాయింట్లో వుంటే మాకు మరేం కష్టంకాదు."

'మాకుండవచ్చుగా."

డబ్బులు చేతులో వేసుకుని రిక్షావాడు వెళ్ళిపోయాడు. తాళం తీస్తున్నాను గది తలుపుది.

'మిమ్మల్నందర్నీ బాధపెట్టడం ఏమీ బాగుండలేదు నాకు"

"పోనీ నన్నొక్కణ్ణీ బాధపెట్టండి."

చీకట్లో. గదిలోకితడుముకుంటూపోయి లాంతెరు వెలిగించేను. లోపలకుఅడుగు వేస్తూ ఆగిపోయి "మీరొక్కరే వుంటున్నార్లేవుందే—" ఏమిటీ సంశయాలు! ఏమిటీ యక్షప్రశ్నలు! ఇప్పుడేం ఆరు నెలలనుంచీ వక్కణ్ణే వుంటున్నా యీ 'బారు' మనే కొంపలో.

చప్పున భయమేసింది—'వెళ్ళిపోదు' కదా!

ఏదో 'యిన్ స్టిన్క్టు' పనిచేసి నట్లయి వెంటనే అన్నాను "పోనీ నేను బయట అరుగుమీద పడుంటా. మీరు తలుపులు వేసుకోండిలోన."

బయటకు వేస్తున్న అడుగు ఆగిపోయింది. 'కన్విన్సు' అయి ఆగింది అనుకున్నా గాని, చప్పున అడిగిందామె సంచీని నేలను వదిలి, ఓ అడుగు నా మోటర్ సైకిలు వైపు కేస్తూ "ఇది మీదేనా?"

"కాక" ఎంత గర్వం అందులో!

"తొక్కడం చేతనవునా మీకు."

"నేనూ నా—"

ముఖంలోకి చూచింది చప్పున ఆగిపోయిన నా ముఖంలోకి. పెదిమ కొరుక్కున్నా! ఏం మాట్లాడుతున్నాను నేను?

"ఊఁ! తర్వాత."

"ఏమీ లేదులెండి."

"కాదు. చెప్పాలి. నేనూ—నా... తర్వాత?"

"నేనూ-నా స్నేహితురాలు 'లూసీ' తిరిగేవాళ్ళం దానిపైన."

ఎంత జెలసీ ఆకండ్లలో వెంటనే ఆమెను దగ్గరగా లాక్కొని, ఆ కండ్లలోని జెలసీని తుడిచివేస్తే!

తళతళలాడే మోటర్ సైకిలు భాగాలను స్పృశిస్తూ, వింతగా పరిశీలిస్తూ "తర్వాత! ఆమె ఏమై పోయిందో?" తిరిగి డింపిల్సు ఆచిర్నవ్వులో. వెంటనే ఆ డింపిల్సు మాయమవ్వకుండానే వాటిని యీ పెదిమల్తో అట్లాగే ఆపివేస్తే!

"ఈ వూరినుంచి వెళ్ళిపోయింది—వాళ్ళ నాన్నకు బదిలీ అయితే."

"పోతే పోనీ-నేనులేనూ" అనదేం! ఏమిటి అట్లా వెతుకుతుంది? సంచికోసమా! వెళ్ళిపోదుకదా-మళ్ళా భయం.

"ముఖం కడుక్కోడానికి నీళ్ళు లేవూ, కనపడవేం."

ఇంతేకదా. "అవతల గదిలో వున్నాయి గంగాళంలో. లాంతర్ తీసుకు పోయి, ఆపైగదిలో కడుక్కోండి." ఈజీ చైరులోకూలబడ్డాను...చిక్కిన రిలీఫ్‌తో.

ముఖం కడుక్కొని వచ్చిందామె. టవల్ యిచ్చేను. విచిత్రంగా రూమ్ నలుమూలలా చూస్తూ ఖాళీగావున్న మంచంమీద కూర్చున్నదామె చనువుగా.

* * *

"ఏమండీ" చెవిలో స్త్రీమృదుస్వరం.

ఉలిక్కిపడి లేచేను ... నిద్రనుంచి, ఘనకార్యం చేసినట్లు కిలకిలా నవ్వుతూ "ప్రొద్దున్న బండికి పంపించేరు కదూ?" అన్నది.

టైం ఎంతయి వుంటుంది, ఆలోచన పోయింది. కిటికీలోంచి పడే సూర్యరశ్మి వ్యైపుదృష్టి పాకింది. "అప్పుడే ఎనిమిదా?" అంటూ లేచేను.

"ఏమండీ బండి దాటిపోయింది. ఎట్లా? మా వాళ్ళు నేనేమై పోయేనో అని ఖంగారు పడుతూంటారు."

"మరేం ఫర్వాలేదులే" అన్నానన్నమాటేగాని మనస్సులో దిగులుగావుంది. ఇంకోమూడు గంటల్లో మరోబండివుంది. ఆమెను వదిలి, ఆమెను చూడకుండా వక్కక్షణం వుండగల్నా? ఆలోచనలు తియ్యగా బాధించసాగినయ్.

"మీకేం...మగవారు."

"ఆడ వారికే గాబోల్ను..."

"పోనీలెండి. ఇక్కడే వుండిపోతా హాయిగా, యిట్లా నే."

"ఉండుశుభ్రంగా..." లేచి ముఖం కడుక్కోడానికి పెరట్లోకి నడిచేను.

కాలకృత్యాలు తీర్చుకొని నేను హోటలునుంచి కాఫీ తెచ్చేసరికి ఆమె యింకా అట్లానే 'యీజీచైరు'లో పుస్తకం చదువుకుంటూ కూర్చొని వుంది.

కాఫీత్రాగేక నేను స్నానముచేసి దుస్తులు మార్చుకుని, అవతల గదిలోంచి చూచే ఆమెవైపు. ఇంకా అట్లాగేచదువుకుంటూంది ఆమె దీక్షగా. ఇంకోగంటలో బండి వుంటే బయలుదేరే ప్రయత్నాలేం చెయ్యదేం?

"టైం, అవుతూంది. మరి ముస్తాబవ్వరేం?" అన్నాను. నాఅంతట నేనేఆమాట అనవలసిన అవసరం కల్గినందుకు మధన పడుతూ.

"ఆ! ఎక్కడికి! నేనెక్కడికి పోతా? ఇక్కడేవుంటా"

ఆశ్చర్యపోయేను. ఏమిటా మాటలు! నిజంగానేనా? అంతసీరియస్‌గా అంటుందేం? నిజంగా వుంటుందా!

ముఖానికి అడ్డుగావున్న పుస్తకాన్ని తీసేస్తూ ఆమె నావైపు చూస్తూ అన్నది "ఏం వుండకూడదా!"

తల్రకిందులయిన నేను తికమకగా "ఎందుకు వుండగూడదూ?...కాని మీ వాళ్ళు..."

"మావాళ్ళెవరూ జంతువులు! నేనిక్కడే వుంటా." నిశ్చితంగా అనేసిందామె.

చచ్చేంరా భగవాన్! ఇప్పుడెట్లా యీమెను వదిలించుకోవడం! మనస్సు తీవ్రంగా నిశితంగా పనిచేయసాగింది. ముఖ్యంగా, బంధువుల నోళ్ళ...తర్వాత 'వాళ్ళవాళ్ళ'కు తెలిస్తే...! పరుగెడుతున్నయ్ ఆలోచన్లు, నిశ్శబ్దంగా కాలం పరుగెడుతూంది. వ్యవధానం ఎక్కువైన కొద్దీ నా మౌనాన్ని ఆమె అంగీకారంగా భావించొచ్చు. ఈ సమయంలో నే నా బుర్రనంతా వినియోగించి ఆమె యిక్కడ తిష్టవేసే ప్రయత్నం మాన్పించాలి. ఏం చెప్పను? మాటలూ, ఆలోచనలు తోచవేం?

ప్రక్కనే వున్న కుర్చీని ఆమె వద్దకు లాగుకుని కూర్చుంటూ అన్నాను, ఆమె అరచేతిని తాకుతూ "మీరునాదగ్గర వుండటం మీ వాళ్ళకు తెలిస్తే సహిస్తారా?"

"సహించక పోతే వురెట్టుకోనీండి. నా ప్రాణం ఎక్కడ హాయిగా వుంటే అక్కడేవుంటా నేను. ఆజంతువుతోకంటె చస్తేమేలు."

"ఏ జంతువు...?"

"ఆయనే...మా..."

"నిజంగా! చెప్పేరు కారేం? చాలా మంచివారు మీరు, బండీ టైం అయిపోతోంది—లేవండీ." ఆ ఆయన కరాళ దంష్ట్రిలతో నామీదమీద కొస్తున్నట్టు ఫీలయాను.

దిగులుగా నావైపు చూచిందామె, కాని నేనేం చెయ్యను. అసమర్థుణ్ణి, బీద వాణ్ణి, పోలీసు కోర్టులచుట్టూ తిరగలేని వాణ్ణి.

లేచినిలబడ్డాను. ఆమెకూడా లేచి సంచీపుచ్చుకుంది. కళ్ళు చెమ్మగా వున్నయ్. మేంకూర్చున్నగదిని వోసారి కలయ చూచి, వెళ్ళలేనట్లు బయటకు నడిచిందామె. నేనూ యింటికి తాళంవేసి స్టేషన్ వైపు నడిచేను ఆమెతో.

♦ ♦ ♦

బండీ అయినా కదలకుండానే ప్లాట్ ఫారంనుంచి యివతల పడ్డాను. యివతల పడీపడకుండానే మామేనల్లుడు కేశవాయ్ అగుపించేడు. అగుపించి వాడి పెళ్ళికి నేను గుంటూరు రావాలంటూ కూచున్నాడు.

నేను యింతకీ చెప్పొచ్చేది, ఆమెను గురించి నాకు ఆలోచించే అవకాశంలేక పోయింది మరోవారంవరకు. బహుశా ఆమెను క్రమంగా మరచిపోయే వాడినే కూడాను, ఆనాడు గనుక వుత్తరాన్ని పోష్టుచెయ్యటానికి స్టేషన్‌కు సరిగ్గా మూడు గంటలకు రాకపోతే.

ఉత్తరం డబ్బాలో పడేసి బ్రిడ్జిఎక్కుతున్నాను. బ్రిడ్జిమీద నిలబడి వున్నారు సుందర్రావు, సత్యమూను. వాళ్ళప్రక్కనే నల్లటి యువకుడొకడు నిలబడి ప్రార్థనాపూర్వకంగా అంటున్నాడు "ఆమెవద్దకు నన్ను తీసుకెళ్ళండి. నేనుబ్రతిమాలుకుంటా. ఒక్కసారి తీసుకెళ్ళండి."

సత్యం ఏదోఅనబోతున్నవాడు నన్ను చూచి ఆగిపోయేడు. సత్యాన్ని అర్థం చేసుకోని సుందరం, నన్ను చూడంగానే వికసించిన ముఖంతో "ఒరేయి యిట్రా రా వోసారి" అన్నాడు. వెళ్ళేను అటు వైపు—'ఏమిటీ హడావుడి' అంటూను. క్రిష్టియన్‌లావున్న అతన్ని మరోసారి చూచి, సుందరంవైపు తిరిగేను. ఏమని చెప్పాలో అర్థంకానట్లు సుందరం నీళ్లు నములుతున్నాడు.

కాగా క్రిష్టియన్‌లా కనిపించే అతను "నాభార్య వీరివద్ద వుంటూంది. పంపించేసెయ్యమంటున్నా — నాతో. వారువీలు లేదంటున్నారు. మీరేచెప్పండి—సబబు."

ఒక్కక్షణం తెల్లబోయేను అప్పుడే సంబాళించుకుని 'ఏంరా' అన్నట్లు సుందర్రావువైపు తిరిగేను.

"అవునాసంగతి నిజమే. ఎవరిభార్యో నాకు తెలియదు, ఒకామె నావద్ద వుంటూంది. నిన్న సాయంత్రం యీయనొచ్చి 'నాభార్య నీవద్ద వుంటూంది, పంపించు వెంటనే నాతో' అన్నాడు. సరే, వెంటనే, పంపిస్తానని యింటికొచ్చేను. ఆమెను ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నా. బయట మీఆయన వున్నాడు ... ఆయనతో

వెళ్ళాలి...అన్నాను. ఆమెవకటే ఏడుపు. తలుపులు బిగించుకొని ఆత్మహత్యఅన్నా చేసుకుంటాగాని ఆయనతో వెళ్లనంటుంది, కారణం చెప్పదు. నేనేం చేసేది?"

"అది అంతేనండి. దానికి తిక్క వస్తూంది మధ్య మధ్య. నన్నామెవద్దకు తీసుకుపొండి. నేనామెతో మాట్లాడతా. నచ్చచెబుతాను."

"ఆమె తలుపులు వేసుకుని ఏడుస్తూ వుంటే...! చావనయినా చస్తాగాని ఆయనతో పోనంటూంటే..." సత్యం అన్నాడు.

"అయితే పరాయివాళ్ల భార్యను తెచ్చి యింట్లో పెట్టుకుంటావుట్రా — చెప్పుచ్చుకు కొట్టే వాళ్లు లేక ఏడుస్తున్నారు గాని...నడు ఎందుకు వెళ్లదో చూదాం...రండిసార్."

నడిచేము నలుగురమూ సుందర్రావు గది వైపు. క్రిష్టియన్‌లా వున్న ఆయనను బయటే వుండమని ముగ్గురమూ గదిలోకి వెళ్లేము. ఆమెకూర్చుని జడ వేసుకుంటూ కూనిరాగం తీసుకుంటూన్నదల్లా మమ్మల్ని చూడగనే ఆగిపోయింది. అల్లిన జడసగంలోనే ఆగిపోయింది ఆమె చేతిలో అట్లానే.

నేను స్తబ్ధులా నిలబడిపోయేను అట్లానే. బందర్ బండి దిగి నారూమ్‌కు యిదివరలో వచ్చిన వెంకటరత్నమే ఆమె! ఇక్కడికెలా వచ్చింది? నాలో యీ ప్రశ్నకు సమాధానం దొరకకుండానే మరో ప్రశ్న. ఆమెలోని ఆశ్చర్యం వక్క క్షణంలో మాయమయిపోయింది. ఎన్నడూ చూడనట్లు ఆమె అగుపించ యత్నిస్తూంది ఎందుకో! ఇదే మొదటి పర్యాయంగాచూచినట్లునన్ను చూస్తోంది విచిత్రంగా!

ముగ్గురమూ క్రిందపరచి వున్న 'బెడ్' పైన కూర్చున్నాం. సుందర్రావు గది యింత శుభ్రంగా వుండటం చూడటం యిదే మొదటిసారి నాజన్మలో. ఎక్కడ పడితే అక్కడ దొర్లుతూండే పుస్తకాలు చొక్కాలు, సిగరెట్ పీకలు యీనాడు శుభ్రంగా వాటివాటిస్థానాల్లో వున్నాయి. టేబిల్ పైన అద్దమూ, దువ్వెనా, హెయిర్ ఆయిల్సు, పౌడర్సు, 'స్నో'సు చక్కగా వర్సగా అమర్చబడి వున్నాయి. నిజంగా ఆడదిక్కున్న గదే...గదంటే!

జడను పూర్తిచేసుకుంటూన్న ఆమె వైపు తిరిగి సుందరం చెప్పేడు "నలుగురినోళ్లలోనూ అల్లరి పడటం మంచిది కాదు. ఎందుకు చెబుతున్నానో విని, మీ ఆయనతో వెళ్ళి సలక్షణంగా వుండు, నాకిష్టం లేదంటే మరి ఆబంధం తెగిపోతుందా?"

ఆమె ముఖంలో బాధద్యోతకమయింది తెరలాగ. పెదవులు కంపించాయి. తెల్లబోయినట్లు చూస్తూ — వక్క క్షణం అట్లానే ఆగిపోయింది. మరో క్షణంలో కన్నీరు కారుస్తూ అన్నదామె "అవును, వెళ్లిపోవాలి నేను. బాధపడాలి నేను. అంతేగా మీ రనేది?"

"అది కాదమ్మా. ఇష్టంవున్నా లేకపోయినా, కష్టమైనా సౌఖ్యమైనా మనం వక నీతికి కట్టుబడి వుండాలని శాస్త్రము. అది నరకమే అవొచ్చు. అతను పశువే కావొచ్చు. పెద్దలుచేసిన తప్పుకు కర్మఫలం మనది. అనుభవించ వలసిన వాళ్లం మనం. నీ కిక్కడ స్వర్గంలా వుందంటే వుండొచ్చు. కాని ఆయన, ఆయనబాధ, లోకం, నీతి, అన్నీ వూరుకుంటాయా! ఆలోచించుకో బాగా ... బయటే వున్నారాయన...నీ కిష్టమైతే లోపలికొచ్చి నీతో మాట్లాడతాడట..." చెప్పేడు సత్యం.

నేనేం మాట్లాడలేక పోయాను. ఆమె స్థితికి బాధపడాలో, అతని అవస్థకు ఆనందించాలో అర్థం అవటములేదు నాకు. ఆమెను ఆనందింప చేయడం నాచేతిలో ఏమైనా వుందా అనే ఆలోచనలు పోతున్నయి...

ఆమె అన్నది కన్నీరు తుడుచుకుంటూ "ఎందుకూ...మీరు చెప్పేది మీరుచెప్పేసేరు. ఇక నేను చెయ్యాల్సిందల్లా వెళ్లిపోవటమే. సరే, అట్లాగే వెడతాను!" చిన్న చేతి సంచిని పుచ్చుకుని బయటకు నడిచిందామె, ముగ్గురివైపు దీనంగాచూచి ఓసారి.

నేను బయటకు నడవలేక అక్కడే కూర్చుండిపోయేను దిగాలున.


* * *

తర్వాత సుందర్రావును, అడిగేను... విషయమంతా టూకీగా చెప్పమని. వాడు చెప్పినది ఎక్కువేమీ లేదుగాని సారాంశం మాత్రం: ఆమెది రాజమండ్రట! ఆమెను బందరువద్ద పల్లెలోని చిన్న ఎలిమెంటరీబడి మేష్టర్ కిచ్చి మూడేళ్ల క్రితం వాళ్లవాళ్లు పెళ్లిచేసేరట. అతనికి ఆమె అంటే అపరిమితమైన ప్రేమట. చాలా మోట్లుగా ప్రవర్తిస్తాడట—వట్టిజంతువులా, జీతం కొద్దిఅవటంవల్ల ఆమెకు సినిమాలు చూపించటంగాని, ఆమెకు కావలసిన పౌడర్సు, స్నోలు, చీరలుగాని యేవీ యివ్వడట. ముఖ్యంగా సెక్సు విషయంలో చాలా అమానుషంగా అతను ప్రవర్తించడమే ఆమె విముఖత్వానికి కారణమట.

స్టేషన్‌లో వాడికి ఆమె ఎట్లా పరిచయమయ్యిందీ అడిగేను. "యేముందీ! ఇంటర్‌లో కూర్చొని వున్న ఆసుందరాంగిని చూచి టక్కున ఆగిపోయేను అట్లానే. ఆమె నన్నుచూచి భుజాలు ఎగరవేసి, పౌరుషంగా అటు పక్కకు చూస్తున్నట్లు నటిస్తూ కవ్వించింది. సంగతిచూద్దామని పలకరించేను — యేవూరని. చెప్పింది. సినిమాచూద్దురుగాని 'ఆగిపోండి అని బ్రతిమాలే, పాతస్నేహితురాలిలాగ. ప్రాణం లేచివచ్చినట్లు, లేచివచ్చింది బండి లోంచి."

అనుకున్నాను ఆమె ప్రవర్తనకు కారణం భర్తయొక్క మొరటు ప్రవర్తనేఅని అతనేగనుక, కోపం తెచ్చుకోకుండా ఆమెను బుజ్జగించి, కొంచెం నెమ్మదిగా ప్రవర్తిస్తే ఆమె యీగతికి వచ్చివుండేది కాదుకదా అని.

పదిహేను దినాలన్నా గడవలేదు. ఒక ఆదివారం తిన్నగా చిన్నచేతి సంచీతో ఆమె నాగది లోపలికి వచ్చి, నన్ను చూచీ చూడంగానే వెక్కి వెక్కి ఏడుస్తూ కౌగలించుకొని అన్నది "మీకు దణ్ణం పెడతా — వెళ్లిపోమనకండి. మీకు దణ్ణం..." కౌగిలిలో వున్న నేను ఏమీ మాటాడలేకపోయాను. ఆశ్చర్యంతో, ఈసారయినా ఆమెను పూర్తిగా అర్థంచేసుకుందామనే నిశ్చయంతోను. బహుశా రేపో, ఎల్లుండో ఆమెభర్త వస్తాడు వెతుక్కుంటూ అన్నతలంపు కొంత సంతృప్తి నిచ్చింది హృదయసీమలో మూల




## ఎస్. కె. మోహన్‌బాబు

ఆప్తస్నేహితులు మూర్తి, రావు పబ్లిక్ పార్కులో పేవ్‌మెంటు దగ్గఱ సమావేశమయ్యారు.

'ఒరేయ్, రావూ! నేను చక్కని చుక్కని లవ్ చేశానురోయ్!' అన్నాడు మూర్తి సిజర్స్ సిగరెట్టుతో ఒక్క దమ్ములాగి....

'నిజం?....' అని అడిగాడు రావు సందేహంగా....

'నిస్సందేహంగా!' అన్నాడు నిస్సంకోచముగా....

'.... .... .... ....'

'అంతేకాదు....ఆమెకూడా నన్ను లవ్ చేసిందిరా అన్నాడు లొట్టలు వేసుకుంటో—మూర్తి.

'ఓ...అలాగా!' అన్నాడు రావ్.

'అవు'నని తలవూపాడు మూర్తి.

'అయితే యింకేం? నీవు చాలా అదృష్టవంతుడవురా!' అని అసూయను వెలిగ్రక్కాడు రావ్.





'నిజముగా ఆమె అందాన్ని వర్ణించాలంటే మన తెలుగు లాంగ్వేజీలోని వర్డ్స్ చాలవుకూడా....'అన్నాడు మూర్తి, సంభాషణ పొడిగించే ఉద్దేశముతో.

'ఆ!....అంత అందంగా వుంటుందేమిట్రా?' ఆతృతతో అడిగాడు రావ్.

'అంతవరకూ ఎందుకూ? దేవకన్యలు రంభా, ఊర్వశులు కూడా ఆమె అందంముందు బలాదూర్ అన్నమాటే!' అన్నాడు మూర్తి నిక్కచ్చిగా....రంభా, ఊర్వశుల అందము తెలిసినవాడిలా.

'అలాగా!' అన్నాడు రావ్.

'నల్లత్రాచునుబోలు నీలంపువేణి!....'

'ఆహా!...'

'చంద్రబింబాన్ని సైతము ధిక్కరించే చిరునగవుల చక్కటి మోము!'

'ఓహో!...' గుటకలు మింగటం మొదలుపెట్టాడు రావ్.

'కలువరేకులబోలు ఆ నయనద్వయం!....'అన్నాడు మూర్తి.

'వహ్వా!' అన్నాడు రావ్.

'ఆ అరమోడ్పు చూపులు!...'

'ఓహో!'

'ఆ చక్కని నుదురూ...పచ్చని ముక్కూ....'

'ఓహో....' తందాన తాన పాడాడు రావ్.

మూర్తిమాత్రం యింకా కంటిన్యూ చేస్తున్నాడు...

'అరుణవర్ణపు మృదుమధురాధరాలు!...'

'వహ్వా!' అన్నాడు రావ్.

'ఆ ఎత్తయిన వక్షోజాల బిగువులోని సొంపు!!!'

'భలే....భలే....ఏం వర్ణించావురా?' అని అభినందించాడు రావ్ మూర్తిని.

'వంపులు తిరిగిన అవయవములతో కూడిన శోభ...'

'ఓహ్హో...'

'వలపులు కులుకు వయ్యారపు నడకలు!!!'

'ఆహా....'

'దేవతలు ధరించే దేవతావస్త్రాలా అన్నట్లుగా ఆమె ధరించిన ఉల్లిపొర సిల్కు చీర!!

మూర్తి వర్ణించే వర్ణనపై వినుగుపుట్టింది రావ్‌కి. మూర్తి మాటలకు అడ్డువచ్చి రావ్ ఆతృతగా అడిగాడు 'ఇంతకీ ఎవరురా ఆ సుందరాంగి?' అని.

వెంటనే మూర్తి తడుముకోకుండా 'నీకు తెలియదుటరా? ఇంకెవరున్నారు? నీ చెల్లెలే!!!' అన్నాడు.

'ఆ....' అంటూ నిర్ఘాంతబోయాడు రావ్.

అంతటితో సంభాషణ ముగిసింది.





# సందేహాలకు.... సమాధానాలు.

ప్రతిశీక పాఠకుల సందేహాలను ఆహ్వానిస్తుంది. సెక్స్‌కూ శారీరక శాస్త్రానికీ సంబంధించిన సమస్యలు ఎన్నో సమాధానాలు లేకుండానే చాలా కాలంగా మానవుల మనసుల్లో ఉండిపోయినవి. వాటిని తీర్చేందుకే ఇక్కడ ప్రయత్నం జరుగుతుంది.

అనుభవశాలిఐన ఒకడాక్టర్ శరీరతత్వ రీత్యానూ, మానవమనస్తత్వ శాస్త్రరీత్యానూ, యీ జవాబుల్ని ఇస్తున్నాడు. ఒకొక్కచోట జవాబు సూచన మాత్రంగానే ఉండిపోతుంది. ఇతర కారణాలు ఎన్నో వున్నా, ఒకవ్యక్తి నమ్మగలిగే కారణం మాత్రమే ఇవ్వబడుతూవుంది. శాస్త్రస్వరూపం పరిపూర్ణ రూపం దాల్చినంత వరకూ ఇలాటిది తప్పదు.

పాఠకులు పంపే ప్రశ్న లన్నిటికీ జవాబులు ఇవ్వటం కష్టం సాధ్యమైనన్ని ప్రశ్నలకు జవాబులు ఇవ్వబడుతవి. మీరు త్వరపడినందువల్ల లాభంలేదు. క్రమపద్ధతిలో ఇదిజరుగవలసి వుంటుంది.

సం॥ అభిసారిక]

'క్రాస్ బ్రీడింగ్' (Cross Breeding) అంటేఏమిటి? దానివల్ల లాభనష్టా లేమిటి?

'క్రాస్‌బ్రీడింగ్' అంటే, ఒకే జాతిలోని వేరువేరు తెగల కలయిక. మానవుల్లోనే అనేక దేశాలకు చెందినవారున్నారు. వివిధ శీతోష్ణస్థితుల్లో— జీవించటం వల్లా— వంశపారంపర్యా వొచ్చే లక్షణాలవల్లా వారివారి ప్రత్యేకతలు కొన్ని ఉన్నవి. చర్మం రంగు, ముఖనిర్మాణంలోనూ, ఇతర శరీరాంగ నిర్మాణంలోనూ మార్పు మొదలైనవి స్పష్టంగా కనిపిస్తవి. ఒక జాతిని ఇంకొక జాతితో కలపటమే క్రాస్‌బ్రీడింగ్. తెల్లజాతి నల్లజాతుల కలయిక పరిణామంగా జన్మించిన వారిని ఆంగ్లో ఇండియన్స్ అంటారు. ఆశిశువులో తండ్రినుంచి కొన్ని లక్షణాలూ తల్లినుంచి కొన్ని లక్షణాలూ వొచ్చి ఒక కొత్తజాతి ఏర్పడుతుంది.

ఇది ఎక్కువగా వృక్షజాతుల్లోనూ జంతుజాతుల్లోనూ క్రియారూపాన పెట్టబడింది. బలిష్టంగా పెరిగే ఒకరకం చెరకుమ వేళ్లు తక్కువగా ఉన్నవి, బలహీనంగా పెరిగే ఇంకోరకం చెరకుమ వేళ్ళు చాలా నిడివిగా ఉన్నవి. యీ రెంటినీ కలపటం వల్ల—బలిష్టంగా పెరిగే పొడుగాటి వేళ్ళున్న కొత్తరకం వొస్తుంది. ఇలాటిది భూమిలో చాలాలోతునకాని, నీరుదొరకని ప్రదేశాల్లోకాని నాటేందుకు ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఇలాటి లాభాలు క్రాస్ బ్రీడింగ్‌లో ఎన్నో వున్నవి.

ఇక జంతువుల్లో కూడా 'క్రాస్‌బ్రీడింగ్' మీద అనేక జంతుప్రదర్శనశాలాధికారులు ఎన్నో పరిశోధనలు చేశారు. గుర్రాన్నీ గాడిదనూ కలిపి కొత్తరకం జంతువును (mule) సృష్టించారు. అదే విధంగా మొగ సింహాన్నీ, ఆడపులినీ కలిపి కొత్త రకం జంతువును సృష్టించారు. దీనికి '**Liger**' అని పేరు పెట్టారు. యీ బొమ్మ దానికి సంబంధించినదే !



పులుల్నీ సింహాల్నీ అనేక దేశాల్లో కలిపి చూశారు. మొగపులికీ, ఆడసింహానికీ కలిగిన జంతువును '**Tigon**' అన్నారు. వీటిల్లో ఎక్కువగా తల్లిపోలికలు కనిపిస్తవి. ఐతే స్వజాతివల్ల కలగని యీరకం పిల్లను తల్లి విసర్జించింది. అందుకని ఇతర పాలమీద ఇది పెరిగినది.

పులులూ, సింహాలూ, చాలావిషయాల్లో పోలికలు కలిగి ఉన్నవి. రెండింటి పుర్రెల్నీ విడదీయగలగటం చాలా కష్టం. ఆపోలికల వల్లనే క్రాస్‌బ్రీడింగ్ సాధ్యమౌతుంది.

బలమైన జాతిని బలహీనమైన జాతితో కలిపి కొత్తరకం జంతువుల సృష్టించి దాన్ని ఉపయోగించుకోవటంలో మానవుడు తన తెలివి తేటల్ని ఉపయోగించాడు. పక్షుల్లో కూడా ఇది వుందికాని స్వజాతి కానంటే అవి గర్భనిరోధాన్ని నిరూపిస్తవి. క్రాస్ బ్రీడింగ్ పక్షుల్లో అంతవిజయవంతం కాదు.

దీనివల్ల నష్టాలుకూడా ఉన్నవి. రెండు తెగల కలయికవల్ల, రెంటి గుణగణాలు వొస్తవి. అవి చెడుగుణాలు కావొచ్చు; లేక మంచిగుణాలు కావొచ్చు. అలాగే కలిగే సంతానం చెడుది కావచ్చు. మంచిదీ కావొచ్చు.





**2. గర్భధారణ నుంచి బిడ్డను కనేదాకా మనుష్యులకు ఎంత కాలం పడుతుంది ? ఇతర జంతువులక్కూడా అంతేనా ? పెరుగుదలలో ఇతర జంతువులకూ మానవులకూ పోలికలున్నవా ? బిడ్డల సంఖ్యలో కూడా ఎక్కువమార్పు వుంటుందా ?**

మానవులకు సామాన్యంగా 280 రోజులు శిశువు పూర్తిగా పెరిగేందుకు కావాలి. ఒక్కో కాన్పుకు ఒక్కోబిడ్డ సర్వసామాన్యం. నూటికి ఒకకాన్పులో కవలలు కలగటం కద్దు. పదివేల కాన్పుల్లో ఒక్కరు మాత్రం ముగ్గుర్ని కనటంకద్దు, ఆపై సంఖ్యలుకూడా సాధ్యమేకాని, అవన్నీ చాలా అసాధారణమైన కేసులు.

జంతువులకూ, మానవులకూ చాలా భేదంవుంది. వివిధ జంతువులు గర్భాన్ని ధరించటంలో తక్కువ ఎక్కువలు ఉన్నవి. వుదాహరణకు:-

కుందేలుకు:— 30 రోజులు గర్భం— 8 పిల్లల్ని ఇస్తుంది.

అడవిపిల్లి:— 11 రోజులగర్భం—18 పిల్లల్ని ఇస్తుంది.

ఏనుగు:— 600 రోజుల గర్భం—ఒకే పిల్లను ఇస్తుంది.

ఆడసింహం:— 110 రోజుల గర్భం—2 నుంచీ 4 పిల్లల్ని ఇస్తుంది.

గుర్రం:— 346 రోజుల గర్భం (ఒక సంవత్సరం!) ఒకే ఒకపిల్లను ఇస్తుంది.

గొర్రె:— 150 రోజుల గర్భం ఒకటి లేక రెండు పిల్లల్ని ఇస్తుంది.

సీల్ చేప 350 రోజుల గర్భం ఒక సీల్ చేపను ఇస్తుంది.

గినియాపంది: — 62 రోజుల గర్భం 2 నుంచి 6 పిల్లల్ని ఇస్తుంది.

కుక్క, నక్క:— 63 రోజుల గర్భం 6 నుంచీ 8 పిల్లల్ని ఇస్తుంది.

ఆడపులి:—154 రోజులగర్భం 2 నుంచీ 5 పిల్లల్ని ఇస్తుంది.

ఒంటె:—395 రోజులగర్భం ఒకే ఒక పిల్లను ఇస్తుంది.

మేక:—151 రోజుల గర్భం 3, 4 పిల్లల్ని ఇస్తుంది.

పంది:—120 రోజుల గర్భం పదినుంచీ పదిహేను పిల్లల్ని ఇస్తుంది.

పెరుగుదల విషయంలో—నిర్ణీత కాలానికి తక్కువలోనే మానవశిశువు జన్మిస్తే బలహీనంగా ఉంటాడు; కాని జంతువుల్లో నిర్ణీతకాలం దాటినకొద్దీ 'పిల్ల' బలహీనంగా వుంటుంది.

మానవ శిశువు పెరుగుదల యీ ప్రక్క పేజీలో 12 బొమ్మల్లో సూచించబడింది. రెండో వరస (నిలువు)లో పెరుగుదల వరసగా యీ జంతువుల్ని పోలి ఉంటుంది— పంది, దూడ, కుందేలు—మనిషి ! ఒక్కోబొమ్మ 24 రోజుల పెరుగుదలను సూచిస్తుంది (నిలువుగా చూడండి)




3. నగ్నత్వాన్ని అమలుజరిపే ప్రచార సంస్థలు ఎక్కడన్నా ఉన్నవా? అవి బహిరంగ స్థలాలా? రహస్యస్థలాలా? దీని మంచి చెడ్డ లేమిటి?





అమెరికా, ఇంగ్లడు దేశాల్లో నగ్నత్వాన్ని ప్రచారంచేసే సంస్థలు ఉన్నవి. ఇది రహస్య స్థలాల్లోనే అమలుజరుగుతుంది. ఏ ప్రభుత్వమూ ఏ సంఘమూ బహిరంగంగా నగ్నత్వ ప్రచారాన్ని ఒప్పుకోలేదు. వివిధమతాచారాలుకూడా నగ్నత్వాన్ని ఆమోదించడంలేదు.

యీ సంఘాలలో ఆడమొగ విచక్షణ లేకుండా దిగంబరులుగా ఏ తోటలోనో నగ్నంగా కాలాన్ని గడుపుతారు. స్నానంచేస్తూ సూర్యరశ్మికి ఎదురుగా నిలబడో, లేక ఏదన్నాచదువుకుంటూనో క్లబ్బుల్లోవలెనే కొంతవరకూ తమ కాలాన్ని వెళ్లబుచ్చుతారు.

నగ్నత్వాన్ని అవలంబించేందుకు వారు చెప్పేకారణాలు ఇవి: సూర్యరశ్మి తక్కువగావున్న చలిదేశాల్లో ఆ కిరణాలు శరీరమంతటా తాకేందుకు నగ్నత్వం ఉపయోగ పడుతుంది. జీవపదార్థాలకూ సూర్యరశ్మికీ సంబంధంవుంది. కనుక ఇది చాలా అవసరం. దీన్నే Sun Bathing అన్నారు. అంటే సూర్యుని వేడిలో స్నానంచేయటమన్నమాట! దీన్ని ఆరోగ్యశాస్త్రరీత్యా మంచిదిగా పేర్కొంటూ అవలంబించేవారు అనేకులు ఉన్నారు. దీన్ని ప్రచారంచేసే సంస్థలు కొన్ని పత్రికల్నికూడా నడుపుతూన్నవి. అదినగ్నత్వ ప్రదర్శనమే ఐనా ఆ బొమ్మలు వికారాన్ని పుట్టించవు.

ఇంకో కారణం—ఇది మానసికమైంది. జననేంద్రియాల్ను గుడ్డల చాటున మరుగు పరచటంవల్ల మూసివున్న గుప్పెటకున్న విలువలాటిది దానికి వొస్తుంది. అది కూడా మనిషికొక సమస్యగావుండి మనిషిని విపరీతంగా చెలింపజేస్తుంది. నగ్నత్వాన్ని అవలంబించటంలో ఇక యీ ఇబ్బంది ఉండదు. అంతేకాదు — కాస్త అలవాటుపడ్డ మనిషి అంత తేలిగ్గా చలించడు. మనస్సు ఎంతో తేలిగ్గా వుంటుంది. భౌతికమైన ఆలోచనలు పోయి—మానసిక పరిణామం హెచ్చుతుంది; అప్పుడు నిజమైనదానికోసం ప్రయత్నం జరిగితీరాలి. అంటే 'కామం' 'శరీరవాంఛ' మాత్రమే కోరదగ్గది కాకుండా, మానసికమైన ప్రణయానికి జరగవలసివుంటుంది. యీవిధంగా మనో వికాసం సాధ్యమౌతుంది.

మరోకారణం—నగ్నత్వం ప్రకృతి సిద్ధమైంది. మనం పుట్టినప్పుడు దిగంబరులుగానే వున్నాం; సృష్టిలోని జంతుజాలమూ, జీవకోటి అంతా నగ్నంగానే జీవితాల్ని గడుపుతున్నాయి; ఒక్కమానవుడే వస్త్రధారణను కనిపెట్టి దాన్ని అమలు పరిచాడు. యీ విధంగా శతాబ్దాల తరబడిగా మానవుడు ఒక కృత్రిమ వాతావరణానికి అలవాటైనాడు. ప్రకృతిని ఎదిరించి బతకటంకన్న, దాన్ని అనుసరించి బతకటంలోనే ఎక్కువ ఆరోగ్యాన్ని నిలుపుకోవచ్చు. దీనికి తార్కాణంగా మానవుడి కన్న ఎక్కువ కాలం బతికేజంతువులు సృష్టిలో అనేకం!

దీని మంచిచెడ్డల్నిగూర్చి చెప్పవలసివొస్తే—కొన్ని తరాలబట్టి వస్త్రధారణకు అలవాటుపడి ఉండటంవల్ల ప్రస్తుతం ఇది మనకు మింగుడుపడదు. అదీకాక దేశాల

శీతోష్ణస్థితులనూ, ప్రకృతి బాధలనూ తట్టుకునేందుకు వస్త్రధారణ ఉపయోగ పడుతోంది. నగ్నత్వంలోనుంచి వస్త్రధారణలోకి వొచ్చేందుకు మానవుడికి కొన్ని శతాబ్దాలు పట్టింది. మళ్ళీ నగ్నత్వంలోకి పొయ్యేందుకు అంతకన్న ఎక్కువ శతాబ్దాల కాలం పడుతుందేమో ?

**4. స్త్రీ పురుషవీర్యాన్ని స్వీకరించినట్లే పురుషుడుకూడా స్త్రీ నుంచి ఏమన్నా స్వీకరిస్తాడా ? అలాంటిది వుంటే అది ఆరోగ్య సూత్ర ప్రకారం దాని అవసరమేదన్నా వుందా ?**

స్త్రీ నుంచి పురుషుడు ఏమీ స్వీకరించడు. సృష్టిలో సంతానోత్పత్తికోసం స్త్రీయే ముఖ్యంగా తీసుకోబడ్డది. కనుక పురుషుడు నామమాత్రమే ! అతని భాగమల్లా సంతానోత్పత్తికి అనుకూలించే వీర్యాన్ని స్త్రీకి ఇవ్వటంవరకే !

ఆరోగ్య విషయంలో—పురుషుడు సంభోగానంతరం సొమ్మసిల్లి నిద్రపోతాడు; లేదా విశ్రాంతి తీసుకుంటాడు. ఇదినరాలకు చాలామంచిది. నరాలు బాధ తీరి శాంతిపడుతాయి. మనస్సుకూడా ఏదో పెద్దభారంతిగ్గి తేలికైనట్టువుంటుంది. యీ విధమైన శాంతి కృత్రిమ సాధనవల్ల కానీ, స్వప్నాలవల్లకానీ కలుగుతుంది. ఐతే కృత్రిమ సాధనలు ఎక్కువైనకొద్దీ ఆరోగ్యంకూడా చెడుతుంది: యీపద్ధతిలో మనస్సుకు తృప్తిఉండదు సరికదా ఒకవిధమైన బాధ ఏదో పాపం చేశామనే మనక్షోభ కలుగుతుంది. సంభోగంలో స్త్రీనుంచి పురుషుడు గ్రహించేది ఏమీ లేనప్పటికీ మనస్సుకు ఎంతో తృప్తివుంటుంది. ఇదేవిధంగా పురుష సాంగత్యం లేకుండా కృత్రిమ సాధనలవల్ల స్త్రీ కామశాంతికి ప్రయత్నిస్తే మానసికమైన తృప్తి వుండదు.

సృష్టిపరిశీలిస్తే పైతరగతి జీవకోటిలో ఒక విశేషం కనిపిస్తుంది. క్రమంగా స్త్రీ లోని పురుషభాగాలు విడగొట్టబడినవి. అంటే స్త్రీ సృష్టికారిణిగా, సృష్టి విస్తరణకు అత్యవసర పరికరంగా ఉండిపోయింది. పురుషుడు మాత్రం నామ మాత్రుడిగా ఉండిపోయినాడు. మరికొన్ని శతాబ్దాలు గడిస్తే పురుషుని అవసరంలేకుండానే సృష్టివిస్తరణ అవుతుందేమోననే అనుమానం శాస్త్రజ్ఞులకు లేకపోలేదు.

**5. ఆమధ్య పత్రికల్లో చూశాను. "పదేళ్లపిల్ల రజస్వల అయిందట" ఇది ఎంతవరకూ నిజం ? ఇది సంభవమేనా ? ఎందువల్ల ?**

ఇది నిజమనేందుకు సందేహంలేదు. సృష్టిలో జీవజాలంలో అప్పుడప్పుడు కొన్ని విపరీతాలు సంభవిస్తూంటవి. ఎల్లీస్ చెప్పినట్టు ఆడపిల్ల రజస్వల కాకపూర్వం కూడా అలాటి చిహ్నాల్ని వేరొక రూపంలో ప్రదర్శించటాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కనిపిస్తుంది. ఇది నెలలో ఏమూడు రోజులో ఎంతోచురుగ్గా ఉండటం, లేకమగతగా సుస్తిగా ఉన్నట్టు వుండటం రూపంలో కనిపించవొచ్చు. ఇది వొక విశిష్టరూపాన్ని దాల్చి ఎప్పుడైనా బహిష్టురూపాన వెలువడవచ్చు.





కొంతమంది ఆడపిల్లలు పుట్టినప్పుడే రహస్యాంగం దగ్గర కాస్త రక్తం రావటంకద్దు. కాని దానంతటదే, ఆగిపోతుంది. ఇక చెమ్మ రావటం సర్వసాధారణం. ఓవరీస్ పని చేస్తూనే వుంటవి కనుక రజస్వలకావటానికి ఒక కాల నిర్ణయాన్ని ఇదమిద్ధంగా చెప్పటం కష్టం. సామాన్యంగా రజస్వలయే యీడును ఇలాటి కేసులు అతిక్రమించవొచ్చు.

యీ వార్త శాస్త్రజ్ఞులకు అంతగొప్ప విశేషం కానేరదు. 1939లో పెరూ దేశంలోని మెస్టిజో కులంలోని లినా మెడినా అనే 5 సం.ల ఆడపిల్ల బిడ్డను కన్నది. ఆవిశేషాలు ఇవి:

1939లో లినావయస్సు 5 సం॥లు. ఆమె ఆతల్లి తండ్రులకు ఎనిమిదో సంతానం. ఆసంవత్సరమే ఆమె ఆరోగ్యంలో పెద్దమార్పువొచ్చింది. ఆకలిలేక పోవటం, చురుకుగా లేక పోవటం, కడుపు పెరగటం, డోకులతో బాధపడటం ఆమె తల్లిదండ్రుల్ని కలవరపెట్టింది.

ఆమె పిస్కో ఆసుపత్రిలో డాక్టర్ జిరాడో లొజాడా పర్యవేక్షణకింద ఉంచబడింది. ఆయన మొదట్లో ఇదేదో కడుపులో కురుపేమో ననుకున్నాడు—కాని—ఆమె రొమ్ములు కూడా వడివడిగా పెరగటంవల్ల అమిత జాగ్రతగా పరీక్షించాడు. అది గర్భం కాకుండా ఇంకేమీ అయేందుకు వీల్లేదని ఆయన నిశ్చయించాడు. ఆమె జననం తాలూకు సర్టిఫికెట్ చూస్తే 1933 సెప్టెంబరు 23న ఆమెజన్మించినట్టు రుజూ అయింది. ఆమెతల్లి— లినా 8 వ మాసంనుంచే ప్రతినెలా బహిష్టు అవుతూందని డాక్టర్‌కు చెప్పింది. 1939 వ సంవత్సరం మే 14 వ తేదీన లినాకు పుత్రుడు జన్మించాడు. చాలామంది డాక్టర్ల సమక్షంలో ఆమె తల్లి అయింది. కుర్రాడు వొస్తాడని ఎవరూ అనుకోలేదు.

పురిటికి ముందు లినా బరువు 66 పౌనులు. పుట్టిన కుర్రాడి బరువు 6 పౌనులు ఆశిశువు తగిన వయస్సున్న స్త్రీ కనే శిశువు వలెనే వున్నాడు. లినాయే ఆమెబిడ్డను పెంచుకునేది. కాని డాక్టర్ దీనికి సమ్మతించలేదు. లినా క్రమంగా పెద్దదైన కొద్దీ ఆమెకు లోకవ్యవహారాలు అర్థమైనకొద్దీ మనశ్శాంతికి భంగం వాటిల్లుతుందనీ, ఆ వయస్సులో కుర్రాడి పెంపకంవల్ల ఆమె ఆరోగ్యం చెడుతుందేమోననీ డాక్టర్ భయం. ఆమె మాత్రం శిశువును ప్రాణంవున్న బొమ్మగానే నమ్మింది.

డాక్టర్ "ఇది చాలా స్వాభావికమైన గర్భం" అని నిశ్చయించి నప్పుడు— యీ పాపానికి వొడిగట్టుకున్న పురుషుణ్ని వెతికేందుకు ప్రభుత్వం ఆజ్ఞాపించింది; కాని ఎవరూ దొరకలేదు. అంతమాత్రంచేత ఇది అస్వాభావికమైనదని అనలేము.

యీ తల్లీ శిశువూ 1939లో ఆటవస్తువులతో తీయించుకున్న ఫొటో యీ పక్క పేజీలో వేస్తున్నాము.


ఆ కుర్రాడికి మాత్రం తనతల్లి ఎవరో ఇప్పటికీ తెలియదు. తల్లిని కూడా తన సహోదరి అనుకుంటాడు. ప్రస్తుతం గొడ్లను కాచుకోవటం అతని దినచర్య.

ఇలాటి విపరీతానికి కారణం చెప్పటంకష్టం. మామూలుగా రతిక్రీడ జరిగిందనేందుకు వీల్లేదు. ఎందుకనంటే ఆవయస్సులో రతికి తగినట్లుగా ఆమె అంగాలు పెరిగిఉండవు. ఏదైనా ప్రమాదవశాత్తూ కానీ, లేక ఏ పురుషుడైనా 'శిశునింద'కు పాల్పడటంవల్లకానీ ఇది జరిగిందేమో?



ఇదికాక చాలా తక్కువ అవకాశం వున్నకారణం వొకటివుంది.- ఎంతో ఉద్రేకానికిగురై స్త్రీ తనంతట తానుగా పురుషుని వీర్యకణాన్ని తనలోనేతాను సృష్టించుకోవటం. సృష్టిమొదట్లో యీ నిశ్చితమైన, అచంచలమైన మనోనిశ్చలత వల్లనే లిఖిత్ అనే స్త్రీ పురుషుణ్నీ, స్త్రీనీ కన్నదని బెర్నార్డ్‌షా 'బాక్ టు మెతుసెలా'లో రాశాడు. జీసెస్‌కూడా మేరీకి యీ విథంగానే కలిగి ఉండొచ్చు. ప్రస్తుత దేశాచారాలూ, మనవ ప్రవృత్తులూ, వాతావరణమూ ఆలోచిస్తే దీనికి 1% ఛాన్సు మాత్రమే ఉన్నదేమో ననిపిస్తుంది...వింతప్రపంచం






కవిత్వంరాయడం ప్రారంభించినదగ్గర నుంచి, వాసులో కలుగుతున్న మార్పుల్ని గమనిస్తున్నా-ఆరోజున అతని ప్రవర్తన నాకుచాలా చిత్రంగా కనబడింది. భార్య మీనాక్షి కాఫీరెండు కప్పులనిండా తెచ్చి మాముందుపెట్టి వెళ్లిపోతూవుంటే, వాసు అదోరకంగా మొహంపెట్టి యేదో గొణిగాడు. బహుశా ఆ సమయంలో నేను పక్కనవున్నాననే సంగతే అతడు మరిచిపోయివుంటాడు.

కాఫీకప్పు నోటిదాకా పోనిచ్చి తాగకుండానే దాన్ని తిరిగి టేబిలుమీదపెట్టి అతడు సాభిప్రాయంగా నావంక ఓమారు చూశాడు. యేదో చెప్పడానికి ప్రయత్నిస్తూన్నట్టు గ్రహించాను. బహుశా నా సహాయం అతడికి కొంత అవసరం వున్నదేమో !

"యేమిటి విశేషం?"

"వున్నదోయ్ విశేషం చాలావుంది. యిక్కడకాదు." వాసు తలపంకించి, ఒక్కగుక్కతో కప్పు ఖాళీచేసి, లేచి నుంచున్నాడు.

"ఎక్కడికి?"

"తోటలోకి వెళ్దాంరా!" అతడు నాజవాబు వినకుండానే, తలవంచుకుని పెరటి తలుపుతీసి గబగబా వెళ్లిపోతున్నాడు. యేదో గొప్ప విశేషమేవుండి వుంటుంది ! కాఫీ ముగించి నేను అతన్ని అనుసరించేందుకు లేచాను.

"మీాస్నేహితుడెక్కడ!" మెట్లుదిగివస్తూ మీనాక్షి ప్రశ్నించింది.

"తోటలోకి వెళ్ళాడు."

ఆమె మాట్లాడలేదు. మౌనంగా తలవంచుకొని, టేబిలుమీదినుంచి కప్పులు తీస్తోంది. నాకు సంగతి తెలిసిపోయింది. భార్యాభర్తలు కీచులాడుకుని వుంటారు.

"వాసువంట్లో కులాసాయేనా ?"

ఆమె తల ఎత్తి నావంక చూసింది. ఆ గుండ్రని చిన్నకళ్లల్లో యేదో పెద్దవిచారం గూడుకట్టుకున్నట్టుగా నాకుతోచింది. ఆమె తిరిగి తలవంచుకుంది. కప్పులు చేతిలోకి తీసుకుంటూ అన్నది.

"మీరే ఆయన్ని అడగండి."

నేను యిక ఆమెను ప్రశ్నించదలుచుకోలేదు. తన హృదయాన్ని అంకితంచేసిన పురుషుడి ప్రాణానికి సంబంధించిన వ్యవహారాన్ని స్నేహితుణ్ని అడిగి తెలుసుకోమనేవరకు యే స్త్రీ అయినా పోవడమంటే — అక్కడ యేదో పెద్ద బెడద వుండివుంటుంది. అందులో— అన్ని తెలివితేటలూ వున్న కవిభార్య అలా జవాబు చెప్పడం !

నేను తోటలోకి వెళ్ళాను. వాసు బాదంచెట్టుకిందవున్న పెద్దబెంచీ మీద కూర్చుని అస్తమించే సూర్యుడు, ఆకాశానికి పూస్తున్న వివిధ రంగుల్ని చూస్తున్నాడు. గాలితీవ్రంగా వీస్తోంది. వాన వచ్చే సూచనలు కనబడుతున్నై.

"చూడు! అక్కడ ఆమబ్బులు ఆకాశాన్ని ఎంత అందంగా, ఎన్ని రకాలగా మార్చుకుంటున్నదో" వాసు తనచూపుడువేలుతో, వేగంగా పరుగెత్తుతున్న మబ్బుల్ని చూపెడుతూ అన్నాడు.

అసలు మబ్బుల్నీ, సూర్యచంద్రుల్నీ కావాలనిచూసే అలవాటు నాకెప్పుడూ లేదు. నా దృష్టి ఎన్నడూ రెండుమూడు అంతస్తులమేడల ఎత్తును మించిపోలేదు. అయినా వాసు చెప్పదలుచుకున్న స్వవిషయాన్నుంచి- మబ్బులవరకు ఎగిరిపోవడం నాకు నచ్చలేదు. వ్యంగ్యంగా అన్నాను.

"బాగానే వున్నై గాని- సినిమామేఘాలంత అందంగా మాత్రంలేవు."

వాసునావంక జాలిగా జూశాడు. "అవును! అంత గొప్పమేఘాలని, పాతిక అంగుళం సెల్యులాయిడ్ లో యిరికించి నాలుగు గోడలమధ్య వదిలేస్తే నీబోటివాళ్ళకి బాగానే వుంటయి. కావాలనుకుంటే తాకి చూసి, గుప్పెట్లోకి పోగుచేసుకుంటారు కూడా"

మేఘాలమీదనుంచి దృష్టిని మళ్లించకుండానే అతడు యీ వ్యాఖ్యానం చేశాడు. నాకు చిరాకుకలిగింది. అసలుతను చెప్పదలుచుకున్న విషయం మర్చిపోయి, యీ అనవసర విషయాల్ని గురించి చర్యలోకి దిగడం నాకు ఘోరంగా కనబడింది.

"ఏదో విషయం చెపుతానన్నావ్" పక్కన కూర్చుంటూ ప్రశ్నించాను.

"ఏవిషయం?" నావంక ఆశ్చర్యంగా చూస్తూ వాసు అన్నాడు.

నాకు పట్టరానంత కోపం వచ్చింది. మీమొగుడూ పెళ్ళాం పోట్లాటవిషయం అందామనేవరకు వచ్చి తమాయించుకుని తిరిగిలోపలకు గుటక వేశాను. అతడుమళ్ళీ ఏమీ జరగనట్టే ఆకాశంలో వరుసగా ఎగిరి వస్తున్న పక్షులవంక, తదేకధ్యానంతో చూస్తున్నాడు. బహుశా పక్షులు ఎగరగలవనే పరమ సత్యాన్ని యిప్పుడే తెలుసుకుని ఉంటాడు.

"వెళ్తానోయ్! రేపు కనబడతాను. నేను లేచి బయటకురాను."

"ఉఁ!సరే."

నాకు అతడిమీద ఎప్పుడూ కలగనంత అసహ్యం కలిగింది. యిలాంటి మనిషితో మీనాక్షి ఎలా కాపరం చేస్తోంది? బహుశా





కవిభార్య అనే తృప్తితో అయి వుండవొచ్చు !

సరిగా రోడ్డు వైపుకువున్న గేటుతీసే సమయానికి- అతడు వెనకనుంచి పెద్దగా కేకపెట్టాడు. బహుశా ఏదైనా మేఘంగాని, పక్షిగాని అమాంతం కిందికిదిగి వచ్చి మింగివేయడం లేదుగదా!

"అరే!భద్రం! ఎక్కడకోయ్?నీతో మాట్లాడాలి." వాసు అరుస్తూ పరుగుతో వచ్చి నాచేయి గట్టిగా పట్టుకున్నాడు.

"మేఘాల్ని గురించా?" కోపంగా అన్నాను.

"కాదురా బాబూ! అవేమీ కాదు. స్వవిషయం. బాల్యస్నేహితుడివి. అంత కోపం..." పెద్దగా వురిమింది. తీవ్రమైన గాలితో సన్నని చినుకులు ప్రారంభమయినై.

"ఇప్పుడు యింకేం మాట్లాడతాం ? వానకూడా ప్రారంభమయింది. రేపు"

వాసు రెండో చేత్తో నాబుజం గట్టిగా పట్టుకున్నాడు. "రేపు కాదురా! యివ్వాళే- యిప్పుడేమాట్లాడాలి"యిద్దరం వేగంగా యింట్లోకి పరిగెత్తాం. మమ్మల్ని చూస్తూనే మీనాక్షి టేబిలు ముందు నుంచిలేచి వంటగదిలోకి వెళ్ళిపోయింది. నేను గబగబా వెళ్ళి టేబిలు ముందు కూర్చున్నాను.

"హుఁ! యిక చెప్పు త్వరగా."

వాసు వంటగదివైపుకు ఓమారు చూసి మొహం చిట్లించాడు. "యిక్కడకాదు. డాబాపై గదిలో" అతడు బతిమాలుతున్నట్టుగా నా చెయ్యిపట్టుకుని లేవదీశాడు. నాకుజాలీ, విచారం కలిగింది. ఏదో పీక్కు తిందామనేంత ఆత్రంగా వివాహాలు చేసుకొని - తరువాత యింత బాధ పడడం ఎందుకు? మీనాక్షికోసం నాతో పోటీచేసి మరీ గెల్చాడు వాసు!

నా వెనక గదిలోకి వస్తూనే లోపల తలుపుకు గడియవేశాడు. నేను మంచం మీద కూర్చున్నాను. బయట వురుములు మెరుపుల్తో వాన తీవ్రంగా కురుస్తోంది. చల్లని గాలి కిటికీలోనుండా లోపల ప్రవేశించి శరీరానికీ, మనస్సుకీ గిలిగింతలు పెడుతోంది. రెండువిభిన్న దేహాలూ, హృదయాలూ గట్టిగా వొరుసుకొని, ఆరాపిడిలో వురుముల్నీ, మెరుపుల్నీ, ఆఖరికి పిడుగుల్నీ వుత్పత్తి చేయవలసిన మధుర కాలం! కాని వాసు స్థితి చూస్తేనాకు జాలివేసింది. ప్రకృతి కలిగించే యింత దోహదాన్నీ, గుర్తించేశక్తీ, అనుభవించే సమర్థత వాసుకులేదా? యీస్థితిలో గనక నేనే వాసునైవున్నట్టయితే- స్నేహితుణ్ని పిట్టగోడ మీదనుంచి కిందకు తోసేసి మీనాక్షిని పైకెత్తుకొచ్చేవాడిని.

'చలిగావుందా? కిటికీ మూయమంటావా! నన్ను ఆనుకొని కూర్చుంటావా" వాసుప్రశ్నించాడు.

'ఒద్దు. విషయం ఏమిటో త్వరగా చెప్పు.'

'మీనాక్షిని గురించి'

'ఏం జరిగింది?'

'ఆత్మహత్య చేసుకుందామనే వరకూ వెళ్ళాను. అయినా నీతోమాట్లాడి...'

హరిహరీ ! ఏదో ఘోరం జరిగి వుంటుంది. బహుశా ఏరాత్రివేళో ఆమె గోడదూకేయలేదుగదా? ఆత్మ హత్య చేసుకునేవాళ్లల్లో కవులు ఆఖరివాళ్లు.

పెద్ద విపత్తే సంభవించి వుంటుంది. లేకపోతే ఆత్మహత్యా విషయం కలలో కూడా తలచేరకం మనిషికాదు వాసు !

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" అతడు ఎంతో ఆప్యాయంగా యింకా నాదగ్గరగా జరుగుతూ ప్రశ్నించాడు.

నాకు ఆసమయంలో అతడంటే విపరీతమైన జాలీ, ఎన్నడూ కలగనంత ప్రేమా కలిగింది. ఒక్క త్రుటికాలంలో మా యిద్దరి బాల్యచేష్టలు; గోలీకాయలఆట; కోతికొమ్మచ్చి... అన్నీ నామనోనేత్రం ముందు గిర్రున తిరిగినై! ఎంతప్రయత్నించినా ఆగకుండా, రెండు కన్నీటి బిందువులు జారి నా చేతిమీదపడినై. మీనాక్షి ఎంత అపచారం చేసింది !

వాసు వణుకుతూ నన్ను గట్టిగా కావిలించుకుని—"వద్దు రామభద్రం ! నాకోసం నీవు కళ్ళనీళ్ళు పెట్టబోకు. నీవే అంత విచారపడితే-అసలు యిక నేను బతకలేను" అన్నాడు.

జేబుగుడ్డతో కళ్లు గట్టిగా తుడుచుకున్నాను. నాకళ్ళనీళ్ళని అతడుగమనించాడని తెలుసుకోగానే నాకు చాలా సిగ్గు కలిగింది. లేని వుత్సాహాన్ని కనబరుస్తూ అన్నాను—

"ఛా! కళ్లనీళ్లు కాదోయ్, చలికి అవి చమ్మగిలి వుంటాయ్. కిటికీ వేసేస్తే బావుంటుంది." లేచి కిటికీరెక్కలు బిగించాను. బయటవాన యింకా జోరుగా కురుస్తోంది. మనోవికారాలనీ, హృదయారాటాలనీ కలిగించే పల్చని చిరుచలిగాలి! దాని తాకిడికి తట్టుకునేందుకు నేనైతే జీవంలేని స్వెట్టరును వుపయోగించాలి. కాని వాసు సజీవమైన మరోహృదయంతోనే శరీరాన్ని కప్పేసుకోవచ్చు. అయినా ఆత్మహత్యలు...

"అసలు విషయం నీకు యింకా చెప్పలేదు." వాసు వీపు గట్టిగాతట్టి నామత్తు వదిలించాడు. నేను తిరిగి భావప్రపంచంలోనుంచి, యథార్థ ప్రపంచంలో కాలు పెట్టాను.

"విషయం ఏదైనా, నీవు ఆత్మహత్యని గురించి ఆలోచించడం చాలా దారుణం."

"అవునురా! అందుకే విషయమంతా నీతో చెప్పదలుచుకున్నాను."

"అది మంచిపని. నీవు చెప్పే విషయం ఏదైనా, నేను యిచ్చే సలహా ఎటువంటిదైనా, ఒకటి మాత్రం గుర్తుంచుకో. నీ మనస్సులోనుంచి ఆ ఆత్మహత్యను గురించిన ఆలోచన తీసి బయటపారేయ్. ఒకసారి ప్రాణం పోయిన తరవాత తిరిగి కావాలనుకుంటే ఆఖరికి బ్రహ్మదేవుడి బాబాయిఅయినా యివ్వలేడు."

వాసు తలవంచుకుని ఆలోచిస్తున్నాడు. నేను చెప్పే మాటల ప్రభావం అతడిమీద బాగా పనిచేస్తూవుందని గ్రహించాను. బయట యింకా వాన తీవ్రంగా కురుస్తూనే వుంది. కిటికీరెక్కలు వేసినా చలిగాలి ఏ సందుల్లోనుంచో దూరి లోపలికి వస్తూనేవుంది. నాకు వెచ్చని కాఫీ తాగితే బావుండు ననిపించింది. అప్పుడప్పుడు దేవుడు కల్పిస్తూండే యిలాంటి ఆత్మహత్యల వాతావరణాన్ని ఎదుర్కునేందుకు, మానవుడు సృష్టించిన వెచ్చని కాఫీ, ఘాటైన సిగరెట్టూ తిరుగులేని ఆయుధాలుగా తోచినై. వాసు చెప్పదలుచుకున్న ఆ భయంకరగాథ సూటిగా,





తేటగా అతడిలోనుంచి బయటపడాలంటే—అతడికి ప్రయత్నించి కొంత వుత్సాహాన్ని కలిగించాలి. అందుకని అతడి బుజం పట్టుకుని వూపుతూ—

"చలిగావుందోయ్ ! వేడివేడి కాఫీ తాగితేబావుంటుంది. కిందకెళ్లి తేగలవా?" అతడు భయకంపితుడిలా నావంకచూశాడు—"నేను వెళ్ళలేనురాబాబూ! వెళ్లలేను. ఆమొహాన్ని చూడటమంటేనే..." అక్కడితో మాట తడబడి ఆగాడు. గొంతుసవిరించుకుని "అసలువిషయం..."

నేను అతడిమాటకు మధ్యలోనే అడ్డు వచ్చాను. "అసలు విషయం అంతా తెలిసిపోయింది. నీవు ఆత్మహత్యవరకూ ఆలోచించావంటే — బాల్యస్నేహితుడినైన నేను అర్థం చేసుకోగలను. నేనైతే యీపాటికి కత్తికిఎరవేసి వుండేవాడిని."

వాసు ఏదో గొణిగాడు. నేను వినిపించుకోకుండా గబగబా మెట్లుదిగాను.

మీనాక్షి నాకు హాల్లో ఎదురైంది. కోపాన్ని అణిచేందుకు గట్టిగా ప్రయత్నం చేస్తూ అడిగాను. 'కాఫీకావాలి.' ఆమె ముఖంలో ఆశ్చర్యం, భయం రెండూ కనిపించినై.

"డికాషన్ తయారుగావుంది. పాలు కొంచెం వెచ్చచేయాలి. ఒక్క ఐదునిమిషాలు కూర్చోండి." ఆమె యీమాటలు చెబుతూనే వంటగదివైపుకు నడిచింది.

మీనాక్షి ఏమీజరగనట్టే, ఎరగనట్టే యిచ్చినజవాబూ, నిబ్బరంగా వేసే అడుగులూ చూస్తూనే నాగుండె పాదాలకిందికి జారిపోయింది. నేను కలల్లో చూసే, పుస్తకాల్లో చదివే అభిమానస్త్రీ ఆమె! స్కూల్ ఫైనల్లో నాకంటె రెండు మార్కులు యింగ్లీషులో ఎక్కువతెచ్చుకుని ప్యాసవడం వల్లనే ఆమె వాసుకు భార్యగా దొరికింది. నేను పరీక్షతప్పడంవల్ల ఆసంవత్సరానికి వివాహానికిఅనర్హుణ్ణయిపోయాను.

మనస్సు వద్దంటున్నా కాళ్లు నన్ను గదివైపుకు నడిపినై. ఆమెగ్లాసుల్లోపాలు, చక్కెర, డికాషన్ వేసి యిటూ అటూ కలుపుతోంది. ఆమె స్నేహితుడి భార్య అయిన తరవాతినేను మరిచిపోయేందుకు గట్టి ప్రయత్నం చేసిన అనేకభావాలు తిరిగి నాలో తీవ్రంగారేకెత్తినై. యిప్పుడు ఆమె స్నేహితుడి ఒక్కడి భార్యే కాదు ... అయినా, అంత సౌందర్యం, తెలివితేటలు, తేజస్సు గోడలుదూకే సితికిపోవడమంటే నాకు చాలావిపరీతంగా తోచింది. మన్మధుడు—కుబేరుడు ఒకే వ్యక్తిగా తయారై ప్రేమభిక్ష యాచించవలసిన దివ్యసౌందర్యం !

ఆమె గ్లాసుల్లో తిరగపోస్తూ మధ్య మధ్య చెంచాతో ఏదో కలుపుతోంది. హఠాత్తుగా నాకు అనుమానం కలిగింది. మా ఆలోచనంతా కనిపెట్టి విషంకలపడం లేదుగదా? ఆమెచేతులవంక జాగ్రత్తగా చూశాను. అవి భరతనాట్యాన్ని అభినయిస్తున్నట్టు కనబడినై. సన్నని ఆవేళ్లు బంగారు తీగల్లాగా, మెరుపురేఖల్లాగా నా నేత్రాలకు మిరుమిట్లు కొలిపినై. అంత లావణ్యమైన హస్తాలు విషాన్ని యివ్వలేవు; ఒకవేళ యిచ్చినా అమృతమై వూరుకుంటుంది.

"యిదిమీకు, యిదిమీ స్నేహితుడికి" రెండు గ్లాసులనిండా కాఫీ పోసియిస్తూ ఆమె అన్నది.

"ఆతేడా ఎందుకని?" అప్రయత్నంగా ప్రశ్నించాను.

"మీకు డికాక్షన్ తక్కువకావాలి; ఆయనగారు ఎక్కువతాగుతారు."

భర్తల రుచులేకాకుండా. వాళ్ల స్నేహితుల రుచులుకూడా తెలుసుకుని, అందుకు అనుగుణంగా ప్రవర్తించేంత మర్యాద తెలిసిన యీరకం స్త్రీలు హఠాత్తుగా గోడలు ఎందుకు గెంతేస్తూంటారా అని నాకు సందేహం కలిగింది.

వాసు నా చేతిలోనుంచి కాఫీగ్లాసును వణుకుతున్న చేతుల్లోకి తీసుకొని ఒక్కగుక్క తాగి, మొహం వికారంగాపెట్టి "విషం రా బాబూ! విషం!" అన్నాడు. నేను ఆమాట వింటూనే తత్తరపాటుతో గ్లాసు కిందకు వదిలేశాను.

"అయితే విషంకలిపిందంటావా?" వాసుముఖంలో మరణబాధా లక్షణాలు కోసం జాగర్తగా చూస్తూ ప్రశ్నించాను.

"విషం కలపడమేమిటి?"

నేను జవాబుయివ్వకుండా ఊరుకున్నాను. పరిస్థితి అంతా చూస్తూంటే వాసుకు పూర్తిగా మతిభ్రమ కలిగినట్టు కనబడింది. బయట ఉరుములూ, మెరుపులూ ఎక్కువైనై. అసలుసమస్యఏమిటో తొందరగా తెలుసుకుంటే బావుండునని పించింది.

"అసలు జరిగిందేమిటో త్వరగా చెప్పు"

వాసు ఓక్షణకాలం నామొహంలోకి చూశాడు. "మీనాక్షివల్ల చాలా యాతనను అనుభవిస్తున్నాను, బాల్య స్నేహితుడివి గనక నీవు అర్థం చేసుకోగలవను కుంటాను. త్వరపడితే తేలే విషయంకాదు. నీవుబాగా ఆలోచించి సలహా యివ్వాలి. యీవానలో ఇంటికెలా వెళ్తావ్? యీరాత్రికియిక్కడే భోజనం."

అసలు మీనాక్షి ఏఘోరపాపానికిఒడిగట్టిందో అతడిద్వారా తెలుసుకోవాలనే ఆసక్తి నాలో ఎక్కువైంది. కాని వాసు ఆవిషయం బయట పెట్టేందుకు మొహమాట పడుతున్నాడు. సూచనప్రాయంగా అసలు సంగతి నాకు అర్థమైందని చెపితే అతడు బిడియం విడిచేయవచ్చు-

'ఇంతకీ-ఎవరితో? ఎప్పుడు? ఎక్కడ?' మాటల్ని తూచి మరీ వుపయోగించాను. వాసు కనురెప్పలు పైకెత్తి వింతగా నా వంక చూశాడు 'అంటే-?'

నాకు చెడ్డకోపం, విసుగూ కలిగింది. మొహమాటానికి యిది సమయం కాదని తేల్చుకున్నాను.

'అంటే- మీనాక్షి ఏదుర్మార్గుడితో ఆదుర్మార్గ కార్యం చేసింది?'

వాసు నా ప్రశ్నవింటూనే చప్రున మంచం మీదినుంచి లేచి కిటికీ దగ్గరకు వెళ్ళాడు.

'మనయిద్దరిలో ఒకళ్లకుమతిపోయింది' అర్థస్వగతంగా అన్నాడు. 'నాకుమాత్రం ఆమతిపోయిన ఒకడు ఎవరో తెలుసు.'

'అరేవాసు! నువ్వు సంగతంతా పూర్తిగా వినిపించే వరకు నేను మాట్లాడదలుచుకోలేదు. రా! ఊఁ! త్వరగా-'

వాసు తిరిగివచ్చి మంచంమీద కూర్చున్నాడు.

'అసలు విషయం ఇది'

'మీనాక్షిని నేను ప్రేమించలేకపోతున్నాను. నువ్వనుకున్నట్టు ఆమె ఏపాప





కార్యం చేయలేదు. అసలు అలాంటి మనిషే కాదు.'

నాకు సంగతి తెలిసిపోయింది. యిదో రకమైన గుండెజబ్బు. ధన్వంతరి వంశీయుడు కుదర్చగలిగింది మాత్రం కాదు. ఫ్రాయిడ్ శిష్యుడు కుదర్చవలసిన కేసు.

'ఏమిటి ఆలోచిస్తున్నావ్? నీసలహా కావాలి." వాసు నావీపు గట్టిగాతట్టాడు.

'ఎందుకని ప్రేమించలేకపోతున్నావ్? ఎప్పటినుంచి ప్రేమించలేకపోతున్నావ్?'

'నీ ప్రశ్నలన్నిటికీ జవాబు యిస్తాను కాని నీవు కొంత సానుభూతితో ఆలోచించాలి' అతడు నా వంక దీనంగా చూశాడు.

'నాలో సానుభూతి స్నేహితులకేగాక, శత్రువులకుగూడా పంచి పెట్టగలిగినంత వుంది. కాని అసలు విషయం, నీవు ప్రేమించలేకపోవడానికి మీనాక్షిలో వచ్చిన మార్పేమిటని' వాసు బాగా నాదగ్గరకు జరిగి చెవులో చెప్పదగినంత మెల్లిగా అన్నాడు. 'ఆముఖంరాబాబూ ఆముఖం! నేనుచూడలేను.'

'ఆముఖంలో ఏదైనామార్పు వచ్చిందంటావా?'

'ఆమెలో రాలేదు. నాకు తెలుసు, కాని నాదృష్టిలో మార్పువచ్చింది.'

'ఎప్పటినుంచి?'

'ఫలానారోజునుంచి అని ఖచ్చితంగా చెప్పలేను. కాని కవిత్వం రాయమొదలుపెట్టిన దగ్గరనుంచీ. నేను మనప్రబంధాలు యింకా యితరత్రా అలాంటి సాహిత్యం చదువుతున్నానని నీకు తెలుసుగదా! అప్పటినుంచి ఆమె అంటే నాకు కొంత వ్యతిరేక భావం కలుగుతూ వచ్చింది. కాని ఆఖరికి యిక ఆమె ఎదటవుండగానే సహించలేనిదశ. అజంతా, ఎల్లోరాలూ, అమరావతీ దర్శించిన తరవాత కలిగింది.'

'యింకా నాకు బాగా అర్థమయేటట్టు చెప్పాలి.'

'సానుభూతితో ఆలోచించాలి. సానుభూతి—' వాసు కళ్ళల్లో నీళ్ళు రావడం చూశాను. నాకు జాలీ, బాధా కలిగింది.

"అవన్నీ చూసిన తరవాతా, చదివిన తరవాతా నీలోవచ్చిన మార్పేమిటి?"

"మీనాక్షి ముఖంలో స్త్రీకి వుండవలసిన లక్షణాల్లేవు. మనం యేశిల్పాన్ని చూసినా ప్రబంధాన్ని చదివినా స్త్రీముఖాన్ని చంద్రబింబంతో, మీననేత్రాలతో వర్ణిస్తారు. కాని మీనాక్షి విషయం పూర్తిగా దీనికి వ్యతిరేకం. గుండ్రనికళ్లూ, సోగముఖం. ఆమెను ఇప్పుడు చూస్తూంటే—అచ్చగా పురుషుణ్ని చూసినట్టుగా నాకు వుంటుంది. యిక ఆమెతో నేను కాపరం చెయ్యలేను."

వాసు నిస్పృహతో మంచానికి అడ్డంగా పడుకున్నాడు. నాలో అసంభవమనుకుని అడుక్కుతోసేసినఆశ తిరిగిపైకొచ్చేందుకు ప్రయత్నం చేస్తోంది. అయినా వాసు స్థితికి జాలికలిగింది.

"నీవుద్దేశ్యం-మన పూర్వశిల్పులూ, సాహిత్య కారులూ స్త్రీకి వుండవలసిన లక్షణాలంటూ చెప్పినవి ఆమెలో ఏమీ లేవని. అంతేనా!"

"నీవు సమస్య క్లిష్టంచేసి, అట్టడుక్కు తీసుకుపోతున్నావ్. నేననేది ఆమెలో స్త్రీ లక్షణాలు లేవని కాదు. నేను

సౌందర్యపిపాసినని నీకు తెలుసు. అందువల్ల నేను కాంక్షించే కలలుగనే స్త్రీకి వుండవలసిన లక్షణాలు ఆమె ముఖంలో లేవని — అంటే ఆమె ముఖంలో స్త్రీ లక్షణాలకంటె పురుషలక్షణాలు ఎక్కువవున్నై. ఆ గుండ్రనికళ్లూ, కోల ముఖం...”

“అయితే సంవత్సరంనుంచి ఎలా కాపరం చేస్తున్నావ్” కొంతకఠినంగానే ప్రశ్నించాను.

“మొదటిమూడు నెల్లూ ఆమె ముఖాన్ని అసలు చూడవలసిన అవసరమే నాకు కలగలేదు. ఆమె పేరు తలుచుకుంటేనే బ్రహ్మానందం కలిగేది. తరవాత ఆరు నెలలూ ఆమె ముఖాన్నీ, యితర ఆకర్షణలనీచూచి అవసరమైన వుద్రేకాన్ని కలిగించుకోవలసినస్థితి కలిగినా— అవేవీ అప్పటి దశలో అంతఘోరంగా కనబడలేదు. ఎటొచ్చీ యీమూడు నెలలనుంచీ ముఖ్యంగా మనపూర్వ శిల్పాన్నీ సాహిత్యాన్నీ చూడడం, చదవడం ప్రారంభించిన దగ్గిరనుంచీ...” ఆపైన వాసుకు మాటలు పెగలలేదు.

వ్యాధిబాగా ముదిరి పోయిందని గ్రహించాను. వుపయోగించుకోగలిగితే— యిందులో చక్కని అవకాశం నాకు వుందని తోచింది. అయినా అతడిప్రస్తుత మానసికస్థితిని పూర్తిగా తరచి చూడకుండా, నేను లేనిపోని ఆశల్తో కార్యరంగంలోకి దిగదలుచుకోలేదు. అందుకని నవ్వుతూ అన్నాను—

“యీరోజుల్లో స్త్రీలకు గుండ్రని కళ్లూ, కోలముఖమూ ఫ్యాషన్”

“నువ్వు కొంతసీరియస్‌గా మాట్లాడాలి. హాస్యానికి సమయంకాదు.” వాసు మంచంమీదినుంచి కిటికీదగ్గరకు వెళ్ళాడు.

“అయితే సీరియస్‌గానే మాట్లాడదలుచుకున్నాను. దగ్గిరకురా!” వాసు తిరిగి వచ్చి నాపక్కన కూర్చున్నాడు. నేను ప్రారంభించాను.

“సౌందర్యాన్ని గురించి-మనపూర్వుల అభిప్రాయాలకూ, యిప్పటి మన అభిప్రాయాలకూచాలా తేడావుంది. నువ్వేదో గొప్ప శిల్పం అనే, ఆఅజంతా, ఎల్లోరా బొమ్మలకి, వుండవలసిన స్థానంలోసరిగా రవికా, చీరకట్టి, యింతలిప్‌స్టిక్, వానిషింగ్ క్రీమూ, పౌడరుకొడితే — వాటికీ యిప్పుడు మనంచూసే స్త్రీలకూ ఏమీ తేడా వుండదు.”

“నీవుఏదో చెత్తమాట్లాడేస్తున్నావ్.” వాసు కోపంగా అన్నాడు.

“నేను మాట్లాడేది ఎలా చెత్త అవుతుందో చెప్పు.”

“నేను చెప్పేది ఆకారం, పొందికా, యింకానీకు బాగా తెలియాలంటేషేప్-షారం! కాని నీవు అసందర్భంగా లిప్‌స్టిక్, క్రీములూ తీసుకొస్తున్నావ్.”

“అయితే నిన్ను ఒక్కప్రశ్న వేస్తున్నాను, సూటిగాజవాబు చెప్తావా?”

“ఊఁ! కానీ...”

“నాకు సౌందర్యం అంటే ఏమిటో తెలుసుననేది ఒప్పుకుంటావా?”

“నీప్రశ్నకు అవునుఅని ఖచిత్చంగా జవాబు చెప్పలేను; ఎందుకంటే - నేను నాభావ ప్రపంచంలోచూసి పరితపించేంత సౌందర్యవతుల్ని, నీకు మీనాన్న పెళ్లిసంబంధాలు తీసుకువస్తే నీవు వద్దన్నావు.”





“అంటే నాకు మతిపోయిందనా?”

“కాదు. కాని అసలు సౌందర్యం అంటే ఏమో నీకు తెలియదని...”

“నీ అభిప్రాయం ఏదైనా, నేను మాత్రం సౌందర్యవతులుగా యీప్రపంచంలో లెక్కలోకి తీసుకునేది ముగ్గురిని మాత్రమే! వాళ్లకోసమే మానాన్న తీసుకువచ్చే సంబంధాలన్నీ తిరస్కరించాను.”

“ఎవరాముగ్గురు?”

“ఒకరు; హిందీ గోల్మాల్ ఫిల్ములో కథానాయిక పాత్రధరించిన మాయబాల. రెండు; మొన్న మనంచూసిన అబద్ధం తెలుగు ఫిలిములోని చంచలీదేవి. మూడు...” “ఊఁ! చెప్పు.”

“నీకు కోపం రాదనుకుంటాను.”

“కోపం ఎందుకు?” “మీనాక్షి!”

వాసు తుళ్లిపడ్డాడు. అతడిముఖంలో ఆశ్చర్యం తాండవించింది.

“నిజంగానా?”

“నిజం! ఆ మొదటి యిద్దరూ మానవులకి అందుబాటులో వున్నవాళ్లు కాదు. యికపోతే మీనాక్షి. నువ్వు ఆమెవల్ల ఆత్మహత్య చేసుకుందామనే వరకు వెళ్లావు కాబట్టి - నావిషయంలో నీకేమీ అభ్యంతరం వుండదనుకుంటాను... ...తరవాతనువ్వు, అజంతా, ఎల్లోరాల లోనుంచో, అమరావతీస్థూపాన్నుంచో నీకుకావలసిన సౌందర్యవతిని ఏరుకోవచ్చు.” వాసుదీర్ఘంగానిట్టూర్చుతూ గది అంతా కలయతిరిగాడు. నేను మౌనంగా ఆరాత్రంతా ఆలోచించి మీనాక్షికి ఓపెద్ద ఉత్తరం వ్రాశాను. వాసు తనను అసహ్యించుకుంటున్నాడనీ, అదిదాదాపు యిప్పుడు ద్వేషంగామారిందనీ, ఊహించి వూరుకున్నాను. ఓఐదునిమిషాలు గడిచిన తరవాత హఠాత్తుగా అతడు నాపక్కకు వచ్చికూర్చుని, నాకళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు. “హాస్యమా?”

“హాస్యం ముమ్మాటికీ కాదు. నువ్వు సరేనంటే - ఈవానలోనే మీనాక్షిని నాతో తీసుకుపోవడానికి తయారు. ‘లా’కు సంబంధించిన చిక్కులేమైనా వుంటే తరవాత సరిచేసుకుంటాను. నీకూ ఆత్మహత్య గొడవ వదిలిపోతుంది.”

వాసు జవాబివ్వలేదు. తలవంచుకొని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అతడిలో ఏదోపోరాటం ప్రారభమైందని గ్రహించాను. క్షణికోద్రేకంలో - అజాగర్తగా మీనాక్షి సౌందర్యాన్ని గురించిన నా అభిప్రాయాన్ని కొంచెంహెచ్చు మోతాదులో అతడికి చెప్పటం పొరపాటే అని తోచింది. వెంటనే విరుగుడు ఉపయోగించాలి. మంచంమీదినుంచిలేచి కిటికీదగ్గరకు వెళ్లి బయటకు చూశాను. యింకా వాన తీవ్రంగాకురుస్తోంది. బాగాఆలోచించి అన్నాను—

“యిష్టంలేని స్త్రీతో కాపరం చేయడం వ్యభిచారంతో సమానం. సౌందర్యాన్ని గురించి లోతుకుదిగి ఆలోచిస్తే నీఅభిప్రాయమే సరైందికావచ్చు. యిక నేను యింటికి వెళతాను.”

వాసు తలవంచుకునే‘సరే!’అన్నాడు.

అంత తీవ్రమైన వానలో తడుస్తూ యింటికి వెళ్ళాను.

పురుషుడి ఆత్మాభిమానం వున్న ఏ స్త్రీ కూడా కాపురం చేయదనీ స్పష్టం చేస్తూ ఆఖరున ఓనాలుగైదు పంక్తుల్లో, ప్రేమతత్వాన్నీ, రాత్రి పది గంటలకు బయలు

దేరే మెయిల్ ట్రెయిన్ని గురించిరాసి వుదయం ఏడింటికల్లా ఆమెకు పంపాను.

ఆపగలల్లా ప్రయాణ సన్నాహాలతో గడిపాను. కాని సాయంత్రం ఐదుగంటల వరకు చూసినా ఆమెనుంచి జవాబు రాలేదు. బహుశా వాసు వాలకాన్ని గడచిన మూడునెలలనుంచీ గ్రహిస్తున్నా-యింకా ఓనిర్ణయానికి రాలేక బాధ పడుతూవుండి వుంటుంది. నేను స్వయంగా వెళ్ళి, విషయం కొంత విపులంగా చెప్పి రెచ్చగొడితే——?

ఆమెతో మాట్లాడవలసిన పద్ధతీ, వుపయోగించ వలసిన పద్ధతీ, వుపయోగించ వలసిన మాటలూ, ఒకటి, రెండు మార్లు మనస్సులో తర్కించుకొని బయలుదేరాను. యింటికి వెళ్ళేటప్పటికి తలుపు దగ్గిరకు వేసివుంది. వాసు లోపల వున్నాడేమో అన్న అనుమానం కలిగింది. తలుపు కొట్టకుండా ఓ నిమిషం అలాగే నుంచున్నాను. లోపల నుంచి ఏవోమాటలు వినబడుతున్నై. చెవును తలుపుకు సంధించాను——"అయ్యో తప్పు! కాళ్లు పట్టుకో బోకండి"

'నువ్వు దేవతవి! కవిత్వపు పిచ్చిలో జీవంలేని శిలల్లో, పుస్తకాల్లో వున్నదే నిజమైన సౌందర్యం అనుకుని, నిన్ను చాలాబాధించాను. కాని రాత్రి భద్రం నాకళ్లు తెరిచాడు.'

'అవును, మీకళ్లు తెరిచాడు. నాకళ్లు పొడిచాడు.' మీనాక్షి రోషంగాఅన్నది.

'ఏం జరిగింది?'

'యీవుత్తరం చూడండి.'

డ్రాయరులాగిన శబ్దం వినబడింది. రాబోయే ప్రమాదాన్ని గ్రహించాను. చెవి తలుపు దగ్గిర అలాగేవుంచి కాళ్లను సరైన పద్ధతిలో పెట్టాను. ఒలాంగ్ జంప్ తరవాత పరుగు! ఆరెంటిల్లో స్కూలు వాళ్ళిచ్చిన కప్పులు యింకా నాదగ్గిర అలాగే వున్నై.

'ఛీ! దుర్మార్గుడు. స్నేహితుడిభార్య అనే జ్ఞానం అన్నా లేకుండా యిలావుత్తరం రాయడే? పుష్పక విమానంతో నందనోద్యానవనంలోదించడం దగ్గిరనుంచీ—— ఆఖరికి మద్రాసు లేచిపోవడం-అన్నివిషయాలు రైలుస్టేషను వెనకవున్న మురుగుకాల్వ పక్క గుడిసెలో స్వయంగా- అనేవరకు దిగజారాడు. ద్రోహి! చూడు! యిప్పుడే వాడిపొక్కచించిమరీవస్తాను.'

తలుపు గడియ కదిలినశబ్దం అయింది. ఓలాంగ్ జంప్- తరవాత పరుగు అనుకుంటూనే- ఆతత్తరబాటులో ఓ హైజంప్ కొట్టి, తరువాత రెండులాంగు జంపుల్తో కాళ్లని స్వాధీనంలోకి తెచ్చుకుని, పరుగుకు ప్రారంభించాను. వెనకవాసు పెద్దగా కేకపెట్టాడు.

'ఒరే భద్రిగా! ఆగు. నీడొ...'

నేను ఆగదలుచుకోలేదు. ఏఆకర్షణ కలిగించినవుద్రేకంలో మొండిగా తెగించి మావూరు ముసలి ఆంబోతు మందూరు ఆంబోతు కాళ్ళు విరగ గొట్టిందో నాకు తెలుసు. యినుమడించిన వేగంతో, ఆ రోడ్డుమూలతిరిగాను. అప్పుడే స్కూల్లో నుంచి బయటకు వస్తున్న ఓకుర్ర వెధవ నన్ను వాళ్లటీచరుకు చూపెడుతూ అంటున్నాడు- 'అన్నిటి కంటేవేగంగలజంతువు గుర్రం ఎలాఅవుతుందిసార్?'






ఆధారం: మేరీ కార్మైకెల్ స్టోప్సు

రచన: "భరణి"

## "రతి"

సాధారణ మానవునిలో సృష్టికార్యం కొరకు ఉన్నకోరిక వేసవుల్లో తక్కువగాను, తక్కినకాలంలో కొద్ది హెచ్చుగానూ వుంటుంది. ఈ తేడాచాలామంది కనిపెట్టలేరు. కొద్దిమంది ప్రతిమాసంలోనూ ఏదో ఓసమయంలో ఈసెక్సుకోరిక హెచ్చుగా వుందనుకున్నారు. కాని అది పూర్తిగా సత్యంకాదు. పురుషునికి ఏచిన్న తలంపుకైనా, కాస్త నగ్నప్రదర్శనానికైనా, ఉత్సాహంగా ఉండే పుస్తకానికైనా రతికి తయారైపోయే శక్తిఉంది. వాళ్ళలో చాలాకొద్ది కాలంలో ఆకోరిక, దాని చర్యకు తయారైపోతాడు. దీన్ని అదుపాజ్ఞల్లో వుంచుకోవడానికి మానసికమైన స్తోమత కావాలి.

స్త్రీలే కనుక——జంతుజాలంలోవలె, ఆ కలయిక కాలమందే——పురుషుణ్ణి ఆహ్వానించడమే జరిగిందా ఈ సరికి పురుషులు దుఃఖాంతంగా తయారై వుండేవారే. స్త్రీలో పత్రుపు వుద్వేగాలు వుండడంవల్ల అంతక్రూరంగా ఆమె వుండలేదు. దీనికన్న ఆమెకి కోరిక, ఇచ్ఛ వుండినా, వుండకపోయినా, పురుషుడు, తనబలముచేత సంపాదించిన అధికారంవల్ల, ఆమెకు సృష్టికార్యానికి బలవంతపెట్టి ఎలానో దాన్ని తీర్చుకుంటున్నాడు.

మగవాడికి ప్రతిదినం, స్త్రీకి అప్పుడప్పుడు కోరికజనిస్తుంది. దాన్ని ఆసమయంలోనే తీర్చుకోవాలి అనుకుంటే, నిరంతరం, వాళ్ళదాంపత్యంలో పోట్లాటలుతప్పవు. కనుకే ఓవిధమైన ఆంక్షలతోనే సంసారం జరగడం మంచిది అనిపిస్తుంది.

ఇద్దరూ అనుగుణ్యంగానే మైత్రిచేసుకుని సుఖపడడము మంచిది. అది ఏదో విధంగా జరిగిన కాలంలో సుఖం వున్నట్టు తోస్తుంది. తెలిసో, తెలియకో మైత్రి వాళ్ళల్లో వచ్చింది. దాంతోనే సంఘం, భర్తహక్కులు, భార్యహక్కులు విభజించిందేమో! భర్తని సంపాదించే వాడిగానూ, భార్యకి గృహకృత్యాలు ఇచ్చి, శాంత పరిచేరు. ఈ అకాల కోర్కెలకు శరీరం హాని చెయ్యబడుతున్నందుకు ఫలితంగానే అన్నట్టుగా ఆమెకు ఎక్కువ విశ్రాంతి కల్పించేరు.

"స్త్రీ పురుషుడు వీరిద్దరూ కోరేది ఏకకాలమందు జరగాలంటే నిజంగాకష్టము. అందులో ఎవరో వకరు త్యాగం చెయ్యబడాలి. దానికోసం, సంఘం స్త్రీనే నిర్ణయించింది" అని మాంటిగాజో అన్నాడు.

పరిశీలించిచూస్తే, అటువూర్తిగా స్త్రీని త్యాగంచేసి, సౌఖ్యం చూచుకున్న పురుషులు చాలాతక్కువ. కొంతమంది మూర్ఖత్వంలోచేసి వుండవచ్చు. మనసంఘం ఇప్పుడు స్త్రీనే త్యాగంచేసి, దాంతో పురుషుని సుఖాల్ని కలిపేరు. వాళ్లు తమ పిశివాదనలో స్త్రీ, పురుషుని చెప్పుచేతల్లో వుండాలని, ఆమె రాత్రి పగలు విచక్షణ లేకుండా శరీరాన్ని, వప్పచెప్పాలన్న భావనలో వున్నారు. ఈభౌతిక క్షణిక ఆనందాల కొరకు, ఈ నియమంతో దంపతులు ఆశించుకున్న స్వర్గం రాకపోగా, పైగా 'ఎందుకు వచ్చిందా?' అన్న బాధమాత్రం పొందుతున్నారు.

స్త్రీ పురుషులమధ్య అనురాగపూర్వపు మైత్రి రావడానికి విధించుకునే ఆంక్షలు పరిపూర్ణంగా ఇరువురిమధ్య జరగాలి. ఒడంబడికగా దీనికి ఇద్దరిత్యాగం కావాలి.

ముందుగా పురుష వుత్పత్తిని పరిశీలిద్దాం. దీనిమీద ఎంతమందో పుస్తకాలు వ్రాసేరు. పురుషునికి కావలసిన జ్ఞానం, అందులో చాలా తక్కువగానేఉంది. అసలు లేదేమో! అవి ఏవిధంగా వాడుకచుకోని, ఆచరణలోపెడితే సంసారం ఆదర్శం అవుతుందో చెప్పకనే వుండిపోయేయి. యవ్వనం వచ్చిన ప్రతీ పురుషుడు కొంతైనా 'సెక్సు'ను గురించి తెలుసుకోవాలి. అదిమానసికంగా ఏవిధమైన శక్తి ఇస్తుందో, అన్న కోర్కెలేకపోలేదు. దాన్ని శాస్త్రరీత్యా, మానసికరీత్యా, ఎవరూ చెప్పనేలేదు. తెలిసీ తెలియని జ్ఞానంమీద, పురుషుడే, భావనలో అది అతీతంగా కల్పించుకుని, ఓనిర్ణయానికి వస్తాడు; అందులో ముఖ్యవిషయాల్ని పూర్తిగావదిలేస్తాడు; క్రూరంగా, దీనికొరకు ప్రయత్నాలు చేసినా, పూర్ణజ్ఞానానికి, అతని పూర్వపు, క్రూర, అసహజ నిర్ణయాలు అడ్డుపడి, ఆశ్చర్యం, సిగ్గు కల్గచేస్తాయి.

పురుష అంగం, వీర్యాన్ని స్ఖలనంచేస్తుంది. అందులో సూక్ష్మంగా బ్రతికివున్న, చిన్నచిన్న సెల్సు, (Sperms) ఉంటాయి. వాటిద్వారం, పురుషాంగంలో (Pennis) నుండి, స్త్రీయోనిలో పడుతుందని; స్త్రీ యోని ముఖద్వారం రెండుపెదిమలతో మూయబడి, వుంటుంది. ఈద్వారకైవారము, పురుషాంగమును లోపల ప్రవేశ





పెట్టగలిగినంతగా ఉంటుంది. స్త్రీ యోనికి అంతర్ముఖంగానే, సూక్ష్మమైనద్వారం వుంటుంది. దీనిలోనుండే శుక్లము ప్రవేశించి, గర్భధారణమునకు ఉపయుక్తపడుతుంది. రతి యోనిలోనే, ఆఖరు అవుతుంది. ఇది మామూలుగా జరిగేకాండ. దీనికితోడుగా, ముఖ్యంగా, కొన్ని సూక్ష్మగ్రంధులు, కండరాలు యోనిని అనుసరించివుంటాయి. ఇవి అనేకంవుండి, ముఖ్యపాత్రల్ని వహిస్తూనే శరీరానికి ఇతర అవయవాలకి కావలసిన ఆరోగ్య బాధ్యతని నిర్వర్తిస్తాయి.

పురుషుని అంగం మామూలుగా, సృష్టకార్యానికి వుపక్రమించనపుడు, మెత్తగా, మృదువుగా నంగివుంటుంది. అది వుద్రేకపడినపుడు—దీనికి కారణం మెదడు పరిసరాలు అయివుంటాయి—నిఠారుగా, పెద్దదై బిగుతుగా గట్టిగా వుంటుంది. సాధారణంగా పురుషుడు ఈస్థితిరాగానే శరీరంలో వీర్యం నిలబడి వుంది, దానిని బయటకు పంపాలి అన్న దృష్టిలో వుంటాడు. ఇదిచాలాతప్పు. ఈ స్థితి, శుక్లం నిలబడి వుండటంవల్ల కాదు. అది అంగానికి ఇరువైపులా, వున్న రక్తపు గ్రంథులు నాళాలు రక్తాన్ని నరాల్లోకి పంపినపుడు ఇది జరుగుతుంది.

ఈ రక్తపు కేంద్రీకరణస్థితి నరాలు తమ రక్తాన్ని తిరిగి పంపుకోగానే, ప్రాథమిక స్థితికి, ఏ విధమైన శుక్లం పోకుండానే, వస్తాయి. ఇట్టి స్థితిలో విశ్రాంతి, ఆరోగ్యంవుంటే, మనస్సు చలించకుండా, యథాస్థితి పొందవచ్చు. బలహీనతేవుండి కోరికే ఆహ్వానిస్తే, శుక్లం బయటకు పోవడం జరుగుతుంది.

శుక్లనష్టంవల్ల శరీరానికి ఎంతచేటు వాటిల్లుతుందో గ్రహించరు. ఒక్కొక్కసారి శుక్లం పడితే, అందులో రెండు మొదలు ఐదువందల మిలియన్ల సూక్ష్మజీవులు (Sperms) వుంటాయని అంచనా వేయబడింది. ప్రతీ చిన్నజీవి తాలూకు ఆరోగ్యవంతమైన వీర్యమూ స్త్రీ అండాశయమందు ప్రవేశించి, నూత్నజీవిని ఇచ్చేశక్తి కలదిగా వుంటుంది. (ఒక్క పురుషస్ఖలనము యావత్ ప్రపంచంలోని స్త్రీలనందరినీ కూడా గర్భధారణము చేయించ గలదన్నమాట!) ఈ ప్రతీ చిన్నజీవిలోనూ, వంశపారం పర్యావచ్చే లక్షణాలు, మనశరీరంలోకల్లా ఎక్కువ ఉపయోగకారి, ప్రత్యేకమైన రసాయనిక పదార్థము (నూక్లియస్ ప్లాజమ్) కలిగి వుంటుంది. పైగా శుక్లంలో ఇతర ముఖ్యరసాయనిక ద్రవ్యాలలో, కాల్షియమ్, భాస్వరము ముఖ్యంగా వుంటాయి. ఇవి రెండూకూడా మానవశరీరానికి గుండెల్లాంటివి.

ఇటువంటి స్థితిలో, శుక్లాన్ని బహిర్గతం చేసెయ్యాలి అన్నభావన చాలా తప్పు. నరాలకి బలహీనత శరీరంలో ఉన్న రసాయనిక ముఖ్యవస్తువులు పోగొట్టుకోవడంకంటె, వాట్లని, కోరికాసమయాల్లో ఇతరత్రా మనస్సు త్రిప్పి రోజులు గడపడం మంచిది. ఈత్రిప్పుట వలెనే, మనస్సు, మెదడకు, ఆసంయోగ వస్తువుల వలన స్ఖలనం కలిగి మరింతగా, విజ్ఞానాన్ని పొందడానికి సహాయకారి అవుతుంది.

ఇది శరీరానికి మేథస్సుకుమంచిదని దాన్నే ప్రతిసారి ఆంక్షల్లో పెట్టడం పురుషునికి మంచిదికాదు. యే ఆంక్ష, మనోనిశ్చయం, తృప్తిని ఇస్తుందో, అదే మనస్సును ఓసమయంలో శిక్షించి, నిరంతరంగా బాధిస్తుంది. స్త్రీ ఋతుగతుల ప్రకారం ఈ ఆంక్ష విధించుకోవడంవల్ల ఆ అవసర సమయాల్లో నవ్యశక్తి, పునర్బలం మనస్సుకు ఆనందం కల్గచేస్తాయి. స్త్రీ, పక్షపు కోరికల్లోని కలయికలో స్త్రీ పరిపూర్ణ తృప్తి (Orgasm) పొందడం, ఇవ్వడంకూడా జరుగుతుంది.

అందువల్ల – స్త్రీ పురుషులు ఇరువురుకూడా, సృష్టికార్యాన్ని అవసర సమయంలో, ఎన్నిసార్లు చేసినా, దాన్ని నాలుగైదురోజులు ఆచరించడం, తర్వాత పదిరోజులు కనీసం ఎడబాటుగా అదుపుఆజ్ఞల్లో పెట్టుకోవడం మంచిది. ఈలోపుగా సృష్టికార్యపు కోరిక కలగవచ్చు, పై పరిస్థితులు మనల్ని ప్రోత్సహించవచ్చు. ఇది అంతగా పట్టుపట్టవలసిన విషయంకాదు.

స్త్రీలలో ఋతుకోరికలు నెలకి ఒకేసారి రావడంవల్ల, అంతకాలం మనస్సును గట్టిపరచుకుని ఉన్నవారు లేకపోలేదు. అటు కట్టడిలో ఉంచుకోలేని వారూ వున్నారు. అటువంటి వాళ్ళకు తమ జీవిత ఆదర్శాలకి భంగంరాకుండా ఈ కోరికను తృప్తిపరచుకోవడంలో తప్పులేదు. ఆంక్ష అన్నదానిని పెట్టుకోవడం తెలివితక్కువ. కొద్ది విజ్ఞానవంతులు ఆచరణలో ఉంచినవారు ఆ సమయం ఒస్తుందనగానే, తమ భార్యల్ని లాలించడం, పొగడడం చేస్తూ పునరుక్తిగా ఆ మొట్ట మొదటిరోజుల్ని జ్ఞాపకం చెయ్యడంతో, ఆమెను రేకెత్తించి, ఆమె సంతృప్తికొరకు తమతృప్తినికూడా దోహదం చేస్తూ వుంటారు. దీనివల్ల ఆమె కోరిక తీరడం కాకుండా మనస్సులో కూడా, ఇద్దరం పూర్ణతృప్తి పొందేమన్న భావన కల్గుతుంది.

థామస్‌క్లొవస్ ఇల్లా వ్రాసేడు. "ఆంక్షఅన్న తలంపుకలిగి, ఆచరణలో పెట్టాలనుకుంటే, ప్రకృతే తనంతటతాను ఆ అలవాటును సులభంగా అలవాటు చేస్తుంది తలంపులో వున్న కేంద్రీకరణ మీద ఇది ఆధారపడుతుంది. నీరసంగాతప్పదన్నట్టుగా ఆరంభిస్తే అది ఓజబ్బుక్రింద తయారై, చావునుకూడా కొనితెస్తుంది."

స్త్రీలలోనూ విపరీత కోరిక కలవారు లేకపోలేదు. వారికి ఈకోరిక ఋతుకాలమందు కాక, ఇతరరోజులలోనూ కలగవచ్చు. ఇది సాధారణంగా వారి ప్రియులు చూపించే ప్రేమ, మోహం, మీద ఆధారపడివుంటుంది. అటువంటిస్థితిలో, ఆమెకు కోరిక లేకపోయినా, జనించి, కదలిక కల్గడంకద్దు. ఈ రేకెత్తించడంలో పురుషుడు చాలా శ్రమపడవలసి వుంటుంది. ఆమెకు ఏవిధంగాకోర్కెల్ని తెప్పించుటకు ఎన్నో భావాలని కలగచేయుటలో కాలం తీసుకుంటుంది. దీనికి కారణం ఆమెలోఉండే 'అసమయంవల్లే'

ప్రణయానికి దారిని ప్రతీ పురుషుడు నేర్చుకోవలసి వుంటుంది. ఆమె, అతని తృప్తి దీనిమీద ఆధారపడి వుంటుంది. ప్రతీపురుషుడు సృష్టి కార్యానికి ఉపక్రమించేటప్పుడు ఆమెని రేకొట్టాలి. నిద్రిస్తున్న మనస్సుకు మధురమైన భావాల్ని కలుగ చెయ్యాలి. దీనికి ఆమె అందం - పొగడడం, గిలిగింతలు ఇటువంటివి ముఖ్యావసరాలు. ఇవి సమయానుకూలంగా ఉపయోగిస్తూనే, ఆమెకూడా సమాన భాగస్వామురాలైయ్యేట్టుగా చెయ్యాలి. దీన్నే 'wooing' అన్నారు.





స్త్రీ పురుషులకు, కుతూవలంవల్ల నేర్చుకున్న భౌతికజ్ఞానమే కాని, సృష్టి కార్యంలో జరిగేది ఏమిటి ? దానిఫలితం? ఇది తెలియదు. మొదట్లో ఈ 'వూయింగ్' అయిన తర్వాతనే, ఇద్దరూ సృష్టికార్యానికి ఉపక్రమిస్తారు. పెద్దదైన పురుషాంగం స్త్రీ యోనిలోకి నొక్కబడుతుంది. ఆసమయంలో స్త్రీ తయారుగా వుండకపోతే పురుషాంగం లోపలికి వెళ్ళడం చాలాకష్టమవుతుంది. యోని ద్వారంలో (vaginal orifice) స్రవించే ద్రవం స్రవించక, ద్వారం ముడుచుకునే ఉండిపోతుంది. స్త్రీతయారుగానేవుంటే, యోని పరిసర కండరాలు రక్తంతో పొంగి, ద్రవమయంగా ఉండి ద్వారం పెద్దది చేయించి, పురుషాంగ ప్రవేశానికి దారి ఏర్పరుస్తుంది. అందువల్లనే స్త్రీని తయారు చేయుట, రేకెత్తించుట అన్నవి ముఖ్య అవసరాలు. ఇదే ఆచరించక పోతే ఆమెకి బాధ, పురుషుడు అంటే ద్వేషం, సృష్టికార్యంమీద ఏవగింపు గలుగుతాయి.

సృష్టి కార్యంలో ఈ దగ్గరికి వచ్చినతర్వాత, ఏవిధమైన బంధనాల్లో ఆఖరు కావాలి అన్నసమస్య కలగకపోదు. సాధారణంగా, నూటికి చాలమందిలో ఒకళ్ళనొకళ్ళుచూస్తూ, కళ్ళల్లో నవ్వుకుంటూ, కళ్లనీ, పెదిమల్నీ తిరుగా తిరుగా ముద్దు పెట్టుకుంటూనే ఆఖరుచేస్తారు. ఇది నిజంగా వాళ్లల్లో తృప్తికి పరిపూర్ణతకి ఉదహరణ అనే అనుకోవచ్చు. మనశాస్త్రాల్లో అనేక బంధనాలు చెప్పేరుకాని, అవి రతి కాలాన్ని పొడిగించడానికి కొన్నీ సంతాననిరోధానికి కొన్నీ పనికివచ్చినా తక్కినవి నరాల్ని అనవసర ప్రయాసలకు గురిచేసి, స్ఖలనమును శీఘ్రంగా కావిస్తాయి.

మొదటినుంచీ యోనిలో పురుషాంగ ప్రవేశం జరుగుతుందా అన్నది చాలా మందికి తెలియదు. యువతుల్లో యోనిద్వారం ఓసన్నటి పొర (hymen) చేత కప్పబడివుంటుంది. ఇది ఆ మొదటిరతుల్లో పురుషావయవపు రాపిడికి, పగలి దారిని కలుగ చేస్తుంది. కొంతమందిలో పొర దళసరిగావుండి పగలదు. ప్రప్రథమకలయికల్లో పురుషుడు తనకామాన్ని అదుపు-ఆజ్ఞల్లో పెట్టుకుని, సమయానుకూలంగా, ఆంక్ష విధించుకుంటూనే, ప్రవేశాన్ని కల్గించుకోవడం మంచిది. బలవంతంగా శక్తి చూపించడం జరిగిందా అది స్త్రీ హృదయంలో విముఖత, భయం, ద్వేషం, కల్గిస్తుంది.

స్త్రీ పురుషుడు పై విధంగా దగ్గరగా, సృష్టికార్యపు చర్యల్లోకి వచ్చిన తర్వాత, పురుషుని మానసిక, శరీరక ఉత్సాహము కొంతకాలము (ఇది ఎక్కువ, తక్కువకూడా ఉంటుంది) నకు సడలి, వీర్యాన్ని వదులుతుంది. దంపతు లిద్దరూ ఒకరికొకరు పరిపూర్ణతృప్తిలో ఉంటే, అదే సమయంలో స్త్రీకి తననరాల మత్తు,

పురుషునివలె పడలుతుంది. ఇటువంటి క్షేమకరతృప్తి రావాలంటే శరీరాలకి బలం ముఖ్యం. చాలా మందిలో పురుషుడే 'క్లయిమాక్సు' (అంత్యస్థితి)కి స్త్రీ కంటె ముందుగా రావడంతో స్త్రీ అసంతృప్తిలోనే వుండిపోతుంది. స్త్రీకే ముందుగా ఈ అంత్యస్థితి రావచ్చు. కాని అదిచాలా అరుదు. నూటికి డెబ్భై ఎనభైమంది స్త్రీలు ఈ 'అంత్యస్థితి' రాకుండానే. పురుషులరాపిడి ఉధృతంలో వారి స్ఖలనం అయి వుంటోంది.

అసలు స్త్రీ శరీరపుతీరు, ఈ 'అంత్యస్థితి' కూడా చాలా విచిత్రమైనవే. స్త్రీని రతికేళికి పురుషుడు తయారు చేస్తున్నాడంటే, ఆమెని మనసా, వాచా, కూడా రేకెత్తించేడన్నమాట. ఇది కాలం తీసుకుంటుంది. దానికోరకు కాలాన్ని వినియోగించే పురుషులు చాలాతక్కువే. యోనిముఖద్వారానికి, పైగా చిన్న 'సురిపిడి కాయలా' 'క్లిటొరిస్' (Clitoris) అనేదివుంది. ఇది పురుషాంగంలాగే చాలా సున్నితంగా, స్పర్శసుఖాలకు వుద్రేకపడుతూ వుంటుంది. రతికాలంలో ఇది పెద్దదై, దగ్గరగావున్న పెదిమల రాపిడివల్ల కదులుతూ, స్త్రీనరాలకి మత్తు, వుద్రేకం కల్గిస్తుంది.

సాధారణంగా స్త్రీ రతికి తయారైనా, పదిమొదలు ఇరవై నిమిషాలవరకూ 'అంత్యస్థితి'కి వచ్చుటకు పడుతుంది. పురుషుడిలో ఇది రెండు మూడు నిమిషాలతోనే ఆఖరవుతుంది; అతని తొందరలో తనువిధించుకోవలసినఆంక్ష ( Restraint) మర్చిపోతాడు. ఇప్పటి యువకుల్లో ఈ తొందర నిజంగా సెక్సు, విజ్ఞానం లేకపోవడంవల్లే జరుగుతుంది.

యీ అంత్యస్థితికి రావడం, మూడు విధాలగారతికేళి అవుతుంది అనుకోవచ్చు. అది దైవత్వంలో సృష్టికార్యం అనే పవిత్రతను మనలో కలగజెయ్యడంతో కల్గిన ఓ మానసికానికాసం; యీ కలయికలో కల్గిన భౌతిక ఆనందపు సంతోషంతో నరాలకి, శరీరానికి కల్గిన హుషారు, తృప్తి, తనకి సంతతి కలుగగలదు అన్న ఆశలోని ఆనందం.

ఇప్పటి కాలంలో పురుషులు. సంతాననిరోధం కొరకు ముఖ్యంగా, అంత్యస్థితికి వచ్చినపుడు, తన అంగాన్ని యోనిలోనుండితీసి, స్ఖలనము బయట విడవడం. చేస్తున్నారు. దీన్నే "Coitus interruptus" అన్నారు. దీనివల్ల యోనిలో పుంబీజ ప్రవేశం జరగదు, అందువలన స్త్రీ గర్భవతికాదు అన్న తలంపులో ఇదిజరుపుతారు. యీ అలవాటు, స్త్రీలకు అనవసరంగా గర్భధారణ బాధ తప్పించినా, అది ఆమె ఆరోగ్యానికి హానికరం. ఆమె రేకెత్తిన శరీర, మానసికస్థితి అల్లానే ఒదలడం వల్ల నరాల మీద యీ అసంతృప్తి పనిచేసి, ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది.

[ ఇంకా వుంది ]

Edited and Published by Dhanikonda Hanumantha Rao at
Abhisarika Office Tenali, & Printed by *him* at Nalanda Press, Tenali.